RNI.No. APTEL/2014/57702
ESTD: 1999
www.voodayam.com
Postal Regd. No. GTR/117/2025-27




# వుదయం




గుంటూరు | 27-02-2026 శుక్రవారం | సంపుటి : 12 | సంచిక : 363 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously Published from Guntur, Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Warangal
Follow us on

## వడ్డెర్ల సంక్షేమ అభివృద్ధి కేవలం సీఎం చంద్రబాబు తోనే సాధ్యం

- అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఈ శ్వర్ రావు
- కడప జిల్లా వడ్డెర్ల సమస్యల గురించి వడ్డెర కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్ల సమావేశం
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వడ్డె ఓబన్న జయంతి వేడుకలు అధికారికంగా నిర్వహణ

5



## కడప కమిషనర్ మనోజ్ కుమార్ రెడ్డిని తొలగించడం హర్షం

- మనోజ్ కుమార్ రెడ్డి ఆస్తులపై సీబీఐ విచారణ చేపట్టాలి
- ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి. యం. ఓబులేసు యాదవ్
- ఆర్డీవో గా నియామకమైన నాటి నుండి నేటి వరకు అనేక అవినీతి అక్రమాలు

5





## రాయలసీమకు నిజమైన ద్రోహి జగనే

### మంత్రి నిమ్మల రామానాయుడు

**అమరావతి:**

రాయలసీమ ఎత్తిపోతల పథకంపై ఏపీ శాసన మండలిలో అధికార తెదేపా, ప్రతిపక్ష వైకాపా సభ్యుల మధ్య మాటల యుద్ధం జరిగింది. ఆరోపణలు, ప్రత్యారోపణలతో సభ దద్దరిల్లింది. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం ఆపిందని.. ఆ ప్రాంతానికి సీఎం చంద్రబాబు అన్యాయం చేశారని వైకాపా సభ్యులు విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వంతో లాలూచీ పడి ప్రాజెక్టును నిలిపివేశారని ఆ పార్టీ సభ్యులు ఇషాక్ బాషా, రామసుబ్బారెడ్డి ఆరోపించారు.

#### అధికారంలో ఉన్నప్పుడు వైకాపా పట్టించుకోలేదు

వైకాపా ఆరోపణలను మంత్రులు నిమ్మల రామానాయుడు పయ్యావుల కేశవ్ తిప్పికొట్టారు. జగన్ సీఎంగా ఉండగానే ఆ ప్రాజెక్టును ఎన్జీటీ ఆపిందని.. జరిమానా కూడా విధించిందని నిమ్మల గుర్తుచేశారు. అధికారంలో ఉన్న ఐదేళ్ల పాటు ప్రాజెక్టు గురించి కనీసం పట్టించుకోలేదన్నారు. రాయలసీమ ప్రాంతానికి నిజమైన ద్రోహి జగన్ అని.. ఆయన్ను నిలదీయకుండా తప్పుడు ఆరోపణలు చేయడం దారుణమన్నారు. వైకాపా హయాంలోనే సీమలోని ప్రాజెక్టులన్నీ తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయని విమర్శించారు. ఆ ప్రాంతానికి నీరిచ్చేందుకు ఒక్క ప్రాజెక్టునూ జగన్ చేపట్టలేదన్నారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం సాగునీటి కోసం కాదు.. తాగునీటి కోసమని వైకాపా ప్రభుత్వం 2023 ఆగస్ట్ 18న జీవో నంబర్ 364 సహా అఫిడవిట్ ఇచ్చిన విషయాన్ని నిమ్మల సభ దృష్టికి తీసుకొచ్చారు.

#### అప్పుడు హరీశ్‌రావు ఏం చెప్పారో తెలుసుకోండి

మంత్రి సమాధానంపై మండలి ప్రతిపక్ష నేత బొత్స సహా వైకాపా సభ్యులు అసంతృప్తి వ్యక్తంచేశారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌పై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనపై ఎక్కడా సమాధానం ఇవ్వలేదంటూ నిరసన తెలిపారు. దీంతో సభను మండలి ఛైర్మన్ కాసేపు వాయిదా వేశారు. అనంతరం మళ్లీ సభ ప్రారంభయ్యాక గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టుపై ప్రశ్నోత్తరాలు చేపట్టారు. అయితే రేవంత్ వ్యాఖ్యలపై మంత్రి సమాధానానికి వైకాపా సభ్యులు పట్టుబట్టారు. ఈక్రమంలో బొత్స సత్యనారాయణ, మంత్రుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. 2020లో ఎన్జీటీకి వెళ్లి రాయలసీమ ఎత్తిపోతలను తామే ఆపామని బీఆర్ఎస్‌కు చెందిన మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారని మంత్రి నిమ్మల అన్నారు. అప్పటి సీఎం జగన్‌తో తెలంగాణ సీఎం కేసీఆర్ మాట్లాడటంతో ప్రాజెక్టు ఆగిందని హరీశ్‌రావు స్పష్టం చేసిన విషయాన్ని తెలుసుకోవాలన్నారు.

మంత్రి సమాధానంపై బొత్స అసంతృప్తి వ్యక్తం చేయగా.. మంత్రి పయ్యావుల ఘాటుగా స్పందించారు. రాయలసీమ లిఫ్ట్ విషయంలో తప్పంతా వైకాపా ప్రభుత్వానిదేనని చెప్పారు. ఆ ప్రాజెక్టును ఆపి తప్పు చేసిందెవరో ఆ పార్టీ సభ్యులు తెలుసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రయోజనాలను వైకాపా ప్రభుత్వం తాకట్టు పెట్టిందన్నారు. సభలో గందరగోళం చెలరేగడంతో మండలి ఛైర్మన్ సభను కాసేపు వాయిదా వేశారు.



## ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్‌పై అరెస్ట్ వారెంట్ జారీ

**అమరావతి:**

బిహార్ క్యాడర్ ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్‌పై అరెస్ట్ వారెంట్ జారీ అయింది. ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును వైకాపా హయాంలో సీఐడీ కస్టడీలో చిత్రహింసకు గురిచేసి, హత్యాయత్నానికి పాల్పడ్డారంటూ నమోదైన కేసులో గుంటూరులోని మొబైల్ కోర్టు దీన్ని జారీ చేసింది. విచారణ కోసం గుంటూరు పోలీసులు ఇచ్చిన నోటీసులపై సునీల్ నాయక్ స్పందించకపోవడంతో అతడిని అరెస్టు చేసేందుకు ఇటీవల ఎస్పీ దామోదర్ బృందం బిహార్ రాజధాని పట్నాకు వెళ్లింది. అయితే ట్రాన్సిట్ వారెంట్ జారీ చేసేందుకు అక్కడి హైకోర్టు నిరాకరించింది. ఈ నేపథ్యంలో గుంటూరు మొబైల్ కోర్టులో పోలీసులు అరెస్ట్ వారెంట్ పిటిషన్ వేశారు.

---

## తాగునీరు కలుషితమైతే ఉపేక్షించేది లేదు

### ఏపీ ప్రభుత్వం కీలక ఆదేశాలు

**అమరావతి:**



శ్రీకాకుళంలో డయేరియా కేసులు వెలుగు చూస్తున్న వేళ ఏపీ మున్సిపల్ శాఖ కీలక ఆదేశాలు జారీ చేసింది. తాగునీరు కలుషితమైతే కమిషనర్లను ఉపేక్షించేది లేదని హెచ్చరించింది. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీల్లో కలుషితం కాని.. సురక్షిత నీరు అందించేలా ఎస్‌వోపీ జారీ చేసింది. అన్ని మున్సిపాలిటీల్లో తాగునీటి పైప్‌లైన్లు తనిఖీ చేయాలని ఆదేశాలిచ్చింది. డ్రైనేజీల్లో నీరు నిలవకుండా వెంటనే చర్యలు చేపట్టాలని పేర్కొంది.

---




## మండలిలో సోము వీర్రాజుపై దాడికి వైకాపా సభ్యుల యత్నం

**అమరావతి:**

ఏపీ శాసన మండలిలో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. భాజపా ఎమ్మెల్సీ సోము వీర్రాజు పైకి వైకాపా సభ్యులు ఇజ్రాయెల్, విక్రాంత్, రమేశ్ యాదవ్ దూసుకెళ్లారు. రాయలసీమ ఎత్తిపోతల పథకంపై మంత్రి నిమ్మల రామానాయుడు సమాధానం పూర్తయిన తర్వాత చర్చకు వైకాపా సభ్యులు పట్టుబట్టారు. మంత్రి సమాధానం పూర్తవడంతో తర్వాత ప్రశ్నకు మండలి ఛైర్మన్ అవకాశం కల్పించారు. దీంతో ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడేందుకు యత్నించారు. ఈ క్రమంలో ఆయన పైకి ఎమ్మెల్సీ ఇజ్రాయెల్‌తో పాటు ఆ పార్టీకి చెందిన కొందరు సభ్యులు దూసుకెళ్లారు. తాము నిరసన తెలుపుతుంటే మైక్ ఎందుకు తీసుకున్నారంటూ వీర్రాజుపై దాడికి యత్నించారు. వీర్రాజుకు మద్దతుగా మంత్రులు అనిత, గొట్టిపాటి రవికుమార్ వెళ్లి అడ్డుకున్నారు. ఉద్రిక్త వాతావరణం మధ్య సభను మండలి ఛైర్మన్ మోషేనురాజు వాయిదా వేశారు.

### పోలవరం-నల్లమల సాగర్‌తో..

# తెలుగు రాష్ట్రాలకు లాభం

## గంగా-కావేరి అనుసంధానం నా ప్రగాఢ ఆకాంక్ష

- గోదావరికి అఖండ హారతి.. కృష్ణాకు పవిత్ర హారతి
- రాష్ట్రంలో కట్టిన ప్రాజెక్టులన్నీ ఎన్డీయే, తెదేపా హయాంలోనే..
- పట్టిసీమ నుంచి 100 టీఎంసీలు కృష్ణాకు
- రాష్ట్రంలో ప్రాజెక్టుల పూర్తికి బ్లూప్రింట్ సిద్ధం
- సాగునీటి రంగంపై శాసనసభలో సీఎం చంద్రబాబు



**అమరావతి:**

ప్రకృతిని ఆరాధించడం.. నీటిని పూజించే సంప్రదాయం మనదని సీఎం చంద్రబాబు అన్నారు. గోదావరికి అఖండ హారతి ఇచ్చామని, కృష్ణాకు పవిత్ర హారతి ఇచ్చామని గుర్తు చేస్తూ.. నదులను పూజించడం సంప్రదాయంగా పెట్టుకున్నామని తెలిపారు. సాగునీటి రంగంపై సీఎం చంద్రబాబు శాసనసభలో మాట్లాడారు. గంగా-కావేరి అనుసంధానం కావాలనేది నా ప్రగాఢ ఆకాంక్ష అని చెప్పారు. "ఏ పనైనా చిన్న ఆలోచనతోనే మొదలవుతుంది. గంగా-కావేరి అనుసంధానం సాధ్యాసాధ్యాలపై ఆనాడే చర్చలు జరిగాయి. నదుల అనుసంధానం చేసి తెలుగుతల్లికి జలహారతి ఇచ్చే బాధ్యత మాది. నదుల అనుసంధానం వల్ల నీటి సమస్యలు తగ్గుతాయి. రాష్ట్రంలో కట్టిన ప్రాజెక్టులన్నీ ఎన్డీయే లేదా తెదేపా హయాంలోనే జరిగాయి. పట్టిసీమ నుంచి 100 టీఎంసీలు కృష్ణాకు తీసుకొచ్చాం. వెలిగొండ ప్రాజెక్టుకు నేనే శంకుస్థాపన చేశా... నేనే పూర్తి చేస్తున్నా. ధవళేశ్వరం వద్ద బ్యారేజీ నిర్మాణం వల్ల కాటన్ దొరను ఇప్పటికీ గుర్తుపెట్టుకుంటున్నారు. గోదావరి జిల్లాల్లో కాటన్ దొర విగ్రహాలు పెట్టి పూజిస్తున్నారన్నారు.

#### ప్రాజెక్టుల పూర్తికి బ్లూ ప్రింట్ సిద్ధం

పోలవరం-నల్లమల సాగర్ లింకు ప్రాజెక్టు వల్ల ఎవరికీ నష్టం లేదు. గోదావరి నుంచి వృథాగా సముద్రంలోకి వెళ్లే వరద జలాలను తరలిస్తాం. గోదావరిపై ఎగువ రాష్ట్రం కాళేశ్వరం ప్రాజెక్టు కట్టింది. అందుకు మేం అభ్యంతరం చెప్పలేదు. ఆ ప్రాజెక్టు వల్ల తెలుగు రాష్ట్రాలకు లాభం. పోలవరం డయాఫ్రంవాల్ కొట్టుకుపోతే గుర్తించలేని పరిస్థితి గత పాలకులది. చేయని నేరానికి నన్ను గత పాలకులు.. 53 రోజులు పాటు జైల్లో పెట్టారు. రాష్ట్రంలో ప్రతి ఎకరాకూ నీరు ఇవ్వాలన్న లక్ష్యంతోనే పని చేస్తున్నా. కావేరిపై రెండు రాష్ట్రాలు ఎలా కొట్లాడుకుంటున్నాయో చూశాం. నీరు పుష్కలంగా ఉంటే ఎలాంటి సమస్యలు రావు. నీటి భద్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి. కొందరు రాజకీయం కోసమే నీటి సమస్యలను తీసుకొస్తున్నారు. ఏపీకి ఉండే వాటర్‌సెక్యూరిటీ దక్షిణ భారత్‌లో మరే రాష్ట్రానికీ లేదు. భూమినే జలాశయంగా మార్చి నీటి సంరక్షణ చేయాలని అందరికీ పిలుపునిస్తున్నా. సాగునీరు, పరిశ్రమలకు నీరు, ప్రతి ఇంటికీ తాగునీరు ఇస్తే లక్ష్యం సాధించినట్లే. తెలుగుతల్లికి జలహారతి ఇచ్చేలా ప్రతి ఎకరాకు నీరివ్వాలని సంకల్పం. రాష్ట్రంలో ప్రాజెక్టుల పూర్తికి బ్లూప్రింట్ సిద్ధం చేస్తున్నాం'' అని చంద్రబాబు వివరించారు.

#### ఆ జిల్లాలను సస్యశ్యామలం చేస్తా..

ఆర్థిక ఇబ్బందులున్నా కూడా మార్కాపురం, ఒంగోలు జిల్లాలను సస్యశ్యామలం చేస్తామని సీఎం చంద్రబాబు మాటిచ్చారు. 30 ఏళ్ల ముందు ఆ ప్రాజెక్టు శంకుస్థాపన చేసి.. మొదటి దశను ఈ ఏడాది జూలైలోనే పూర్తి చేసి నీళ్లు ఇస్తామని చెప్పుకొచ్చారు. వెలిగొండ ప్రాజెక్టుకు రూ.2500 కోట్ల మేర ఇంకా ఖర్చు చేయాల్సి ఉందని వివరించారు. రూ.456 కోట్లతో ఫీడర్ కాలువ లైనింగ్ పనులకు శంకుస్థాపన చేశామని అన్నారు. ఈ క్రెడిట్ మొత్తం వైసీపీనే చోరీ చేస్తోందని ఆగ్రహించారు. వెలిగొండకు నీళ్లు రాకుండానే జగన్ రెడ్డి రిబ్బన్ కట్ చేశారని ఎద్దేవా చేశారు. కుప్పంలోనూ ట్యాంకర్లు తీసుకువచ్చి కాలువలో పోశారని విమర్శించారు.

## శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి సన్నిధిలో సంహిత రెడ్డి

**కావలి, ఫిబ్రవరి 26, వుదయం న్యూస్:**



నెల్లూరు జిల్లా, బోగోలు మండలం కొండ బిట్రగుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణం విద్యుత్ కాంతులు ప్రజ్వలిస్తూ, భక్తుల రద్దీతో కళకళలాడింది. ఈ సందర్భంగా కావలి శాసనసభ్యులు కావ్య క్రిష్ణారెడ్డి కుమార్తె సంహిత రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కావలి నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో,ఆయురారోగ్యాలతో ఉండాలని ఆమె స్వామివారిని ప్రార్థించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు అద్భుతంగా ఉన్నాయని ఆలయ నిర్వాహకులను ఆమె అభినందించారు. శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల ప్రారంభోత్సవ వేడుకలు ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఆలయం చుట్టుపక్కల ప్రాంతాలు "గోవిందా... గోవిందా..." నామస్మరణలతో మారుమోగాయి. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన సంహిత రెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు సమర్పించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, కొండ బిట్రగుంటలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలకు విశేషమైన ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ, అధికారులు, సేవా సిబ్బందిని అభినందించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించడం అభినందనీయం అన్నారు.




---

## ఇంటి కూల్చివేత జరిగిన ఘటనకు నెల రోజులైనా దక్కని న్యాయం

- రాజ్యాంగ ప్రతులతో అఖిలపక్ష నేతల నిరసన
- శాంతి అంటే నేరాన్ని కప్పిపుచ్చడమేనా..



**కడప, ఫిబ్రవరి 26, (వుదయం జిల్లా బ్యూరో)**

కడప కంది పాలెంలో రిపబ్లిక్ డే అర్ధరాత్రి జెసిబీలతో దళిత మాజీ సైనిక కుటుంబ ఇంటి కూల్చివేత జరిగిన ఘటనకు నెల రోజులైనా బాధిత కుటుంబానికి న్యాయం దక్కకపోవడంపై ఆవేదనతో, బాధిత కుటుంబ సభ్యులు ఇవాళ ఘటనా స్థలంలో శాంతి హోమం నిర్వహించారు. అఖిలపక్ష నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు ఘటనా స్థలానికి చేరుకుని రాజ్యాంగ ప్రతులతో తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అనంతరం భారత రాజ్యాంగ పీఠిక పఠనం చేపట్టారు. అర్ధరాత్రి మహిళలు, పిల్లలు, వృద్ధులు నిద్రిస్తున్న వేళ జెసిబీలతో ఇల్లు కూల్చివేయడం అమానుషమని, ఇది భూ వివాదం కాదని రాజ్యాంగ హక్కులపై జరిగిన దాడి అని అఖిలపక్ష నాయకులు బీసీ మహాసభ రాష్ట్ర కన్వీనర్ ఆవ్వారు మల్లికార్జున, ఎస్సీ ఎస్టీ రాయలసీమ మన హక్కుల వేదిక నేత జేవి రమణ, మహాజన రాజ్యం పార్టీ వ్యవస్థాపకులు సంగటి మనోహర్, సిపిఐ నగర కార్యదర్శి ఎన్ .వెంకట శివ, వైసీపీ నగర నాయకులు సుబ్బరాయుడు, ఎస్సీ సంక్షేమ సంఘం నాయకులు ఆర్ యన్ రాజా లు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల రోజులు గడిచినా నిందితులందరినీ గుర్తించి అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. ఈ కేసు దర్యాప్తుపై పారదర్శక పురోగతి జరిగింటే జిల్లా ఎస్పీ ప్రెస్ మీట్ పెట్టి సంబంధిత ఘటన పూర్తి వివరాలు ప్రజలకు వెల్లడించాలన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరిహారం & ఇంటి పునర్నిర్మాణం చేపట్టాలనీ,బాధితులు, సాక్షులకు రక్షణ కల్పించాలన్నారు. ఇది భూ వివాదం కాదనీ , రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం జరుగుతున్న ప్రజా ప్రతిఘటన అన్నారు. ఇల్లు కూల్చివేత ఘటనపై అఖిలపక్ష నేతలు ర్యాలీ నిర్వహిస్తే కడపలో అశాంతి అన్న టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు రెడ్డప్ప గారి శ్రీనివాసులు రెడ్డి శాంతి కోసం కృషి చేస్తామన్న వ్యాఖ్యలు ఈ ఘటనలో సత్యదూరమన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ, ప్రజాసంఘాల నేతలు డిఎం ఓబులేసు, జేష్ఠాధి భాస్కర్, ఇల్లూరి సురేష్, శ్రీకృష్ణ, జోజప్ప, గాంధీ, పగడపుల మల్లికార్జున, షిండే భాస్కర్, వడ్ల భాగ్యలక్ష్మి , శ్యామ్ సన్,నర్సమ్మ, రాముడు, అమీన్ పీరా, నాగేశ్వర్, వెంకటేశ్వర్లు బాధిత కుటుంబ సభ్యులు సట్టి భారవి, భాస్కర్, లక్ష్మీపతి, వనజ, మాధవి, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అమెరికా అతిపెద్ద యుద్ధనౌకలో వింత కష్టాలు...



మధ్యప్రాచ్యంలో ఇరాన్‌తో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరిన వేళ, అమెరికా తన సైనిక శక్తిని పెద్ద ఎత్తున మోహరిస్తోంది. అయితే, ఈ కీలక సమయంలో ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత ఖరీదైన విమాన వాహక నౌక యూఎస్ఎస్ జెరాల్డ్ ఆర్ ఫోర్డ్ ఊహించని సమస్యలతో సతమతమవుతోంది. యుద్ధ సన్నాహాల కంటే ఎక్కువగా.. నౌకలోని మరుగుదొడ్ల వ్యవస్థ విఫలమవడం సుమారు 5,000 మంది సిబ్బందికి నరకం చూపిస్తోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో, మధ్యప్రాచ్యంలో సైనిక శక్తిని ప్రదర్శించేందుకు ఈ నౌకను రంగంలోకి దించారు. గత ఏడాది జూన్‌లో సముద్రంలోకి వచ్చిన ఈ నౌక మోహరింపును ఇప్పటికే రెండుసార్లు పొడిగించారు. దీంతో సిబ్బంది దాదాపు 8 నెలలుగా సముద్రంలోనే విధులు నిర్వర్తిస్తున్నారు. సాధారణంగా శాంతికాలంలో ఆరు నెలలకు మించి డెప్లాయ్‌మెంట్ (మోహరింపు) ఉండదు. ఇది మరో 11 నెలల వరకు కొనసాగితే, అమెరికా నేవీ చరిత్రలోనే అత్యంత సుదీర్ఘమైన నిరంతర డెప్లాయ్‌మెంట్‌గా రికార్డు సృష్టిస్తుందని రిటైర్డ్ రియర్ అడ్మిరల్ మార్క్ మాంట్‌గోమరీ వాల్ స్ట్రీట్ జర్నల్‌కు తెలిపారు. సుమారు 13 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.1.1 లక్షల కోట్లు) భారీ వ్యయంతో నిర్మించిన ఈ నౌకలో ఏర్పాటు చేసిన వాక్యూమ్ ఆధారిత ప్లంబింగ్ వ్యవస్థే ప్రధాన సమస్యగా మారింది. ఇందులో దాదాపు 650 టాయిలెట్లు ఉన్నాయి. ఏదైనా ఒక టాయిలెట్‌లో సమస్య వస్తే, ఆ సెక్షన్‌లోని అన్ని టాయిలెట్లు పనిచేయకుండా పోతున్నాయి. టీ-షర్టులు, తాళ్లు వంటి వస్తువులు పైపుల్లో ఇరుక్కుపోవడం, కొన్నిసార్లు టాయిలెట్ విడిభాగాలు ఊడిపోవడం వంటి కారణాలతో ఈ వ్యవస్థ తరచూ మొరాయిస్తోంది. జనవరిలో ఎన్‌పీఆర్ రిపోర్ట్ ప్రకారం, ఈ సమస్యలు మరింత తీవ్రమయ్యాయని తెలుస్తోంది. ఈ సాంకేతిక సమస్యల పరిష్కారానికి నావికా సిబ్బంది రేయింబవళ్లు శ్రమిస్తున్నారు. లీక్‌లను అరికట్టేందుకు కొందరు సిబ్బంది రోజుకు 19 గంటల వరకు పనిచేస్తున్నట్లు సమాచారం. డెప్లాయ్‌మెంట్ గడువును పదేపదే పొడిగించడంతో సిబ్బంది శారీరకంగా, మానసికంగా తీవ్ర అలసటకు గురవుతున్నారు. నెలల తరబడి కుటుంబాలకు దూరంగా ఉండటం వారిని మరింత కుంగదీస్తోంది. నౌక కదలికలను రహస్యంగా ఉంచే 'ఘోస్ట్ మోడ్' కారణంగా బయటి ప్రపంచంతో సంప్రదింపులు కూడా పరిమితమయ్యాయి. ఈ ఒత్తిడితో విసిగిపోయిన కొందరు నావికులు, ఈ డ్యూటీ ముగిసిన వెంటనే నేవీని విడిచిపెట్టాలని భావిస్తున్నట్లు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం మధ్యప్రాచ్యంలో యూఎస్ఎస్ అబ్రహం లింకన్‌తో పాటు జెరాల్డ్ ఫోర్డ్ కూడా చేరడంతో రెండు విమాన వాహక నౌకలు మోహరించినట్లు అయింది. ఈ అంతర్గత సమస్యలు సిబ్బంది నైతిక స్థైర్యంపై ప్రభావం చూపుతున్నప్పటికీ, నౌక యుద్ధ సామర్థ్యంపై ఎలాంటి ప్రభావం లేదని అధికారులు చెబుతున్నారు.

## 'జయలలిత జయంతికి గుడ్‌న్యూస్'



తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత జయంతి వేళ ఆమె స్నేహితురాలు, అన్నాడీఎంకే బహిష్కృత నాయకురాలు వీకే శశికళ కీలక ప్రకటన చేశారు. జయలలిత జయంతి వేడుకలకు ముందు శుభవార్త వస్తుందని వ్యాఖ్యానించారు. అన్నాడీఎంకే నుంచి బహిష్కరణకు గురైన నేపథ్యంలో శశికళ కొత్త రాజకీయ పార్టీని ప్రారంభిస్తారని గత కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో శశికళ తాజాగా చేసిన వ్యాఖ్యలకు రాజకీయ ప్రాధాన్యం ఏర్పడింది. జయలలితకు నివాళులర్పించిన అనంతరం శశికళ చేసిన వ్యాఖ్యలు తాను కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయబోతున్నానని ఆమె పరోక్షంగా సంకేతాలు ఇచ్చినట్లు అయ్యింది. ఫిబ్రవరి 24 (మంగళవారం) తమిళనాడు మాజీ సీఎం జయలలిత జయంతి. ఈ క్రమంలో శశికళ అన్నాడీఎంకే వ్యవస్థాపకుడు, మాజీ సీఎం ఎంజీ రామచంద్రన్, జయలలిత స్మారక మందిరాల వద్ద పుష్పగుచ్చాలు పెట్టి నివాళులర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తన రాజకీయ అరంగేట్రం గురించి శశికళ పరోక్షంగా సంకేతాలు ఇచ్చారు. "ఈ రోజు అమ్మ (జయలలిత) పుట్టినరోజు సందర్భంగా ఒక కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఆ కార్యక్రమంలో శుభవార్త వస్తుంది. " అని వ్యాఖ్యానించారు.

### పార్టీ నుంచి సస్పెండ్

మాజీ సీఎం జయలలిత 2016 డిసెంబర్‌లో మరణించడంతో, అప్పట్లో ఆమె నెచ్చెలి శశికళ అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి బాధ్యతలు చేపట్టారు. అంతలోనే శశికళ అక్రమాస్తుల కేసులో జైలుకు వెళ్లారు. దీంతో ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. కాగా, తమిళనాడులో మరికొద్ది నెలల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఫిబ్రవరి నెల ప్రారంభంలో శశికళ చెన్నైలో తన మద్దతుదారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శశికళ సన్నిహితుడు అరసన్ కీలక వ్యాఖ్యలు చేశారు. తాము చిన్నమ్మతోనే (శశికళ) ఉన్నామని, ఆమెకు అండగా నిలుస్తామని అరసన్ అన్నారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో శశికళ ఏ నిర్ణయం తీసుకున్నా తాము అందుకు కట్టుబడి ఉంటామని తెలిపారు. తాను చిన్నప్పటి నుంచి వీకే శశికళ, ఆమె భర్త నటరాజన్‌కు చాలా నమ్మకమైన మద్దతుదారుడినని చెప్పారు. ఎప్పటికీ అలాగే కొనసాగుతానని స్పష్టం చేశారు. అయితే 2026లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలకు ముందు శశికళ తన మద్దతుదారులతో సమావేశం అవ్వడం, ఇతర పరిస్థితులను బట్టి ఆమె కొత్త పార్టీ పెట్టనున్నారని వార్తలు వినిపించాయి. అందుకు తగ్గట్లుగానే జయలలిత జయంతి నాడు శశికళ పరోక్ష సంకేతాలు ఇచ్చారు.

### మోదీ, అమిత్ షా నివాళులు

మరోవైపు, జయలలిత 78వ జయంతి సందర్భంగా ప్రధాని మోదీ, కేంద్రహోం మంత్రి అమిత్ షా ఆమెకు నివాళులర్పించారు. జయలలిత సేవలను గుర్తు చేసుకున్నారు. తమిళనాడులో సంక్షేమ ఆధారిత పాలన, మహిళా సాధికారత, సమగ్రాభివృద్ధికి పాటుపడిన ఆకర్షణీయమైన నాయకురాలు, అత్యుత్తమ పాలనాదక్షత కలిగిన నేత జయలలిత అని మోదీ కొనియాడారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. 'జయలలితను ఆమె జయంతి సందర్భంగా స్మరించుకుంటున్నాం. ఆకర్షణీయ నాయకురాలిగా, అత్యుత్తమ పాలనాదక్షత కలిగిన నేతగా ఆమె ప్రజల హృదయాల్లో చోటు సంపాదించుకున్నారు. ఆమె జీవిత ప్రయాణం అపారమైన ధైర్యం, దృఢ సంకల్పంతో కూడుకున్నది. తమిళనాడు ముఖ్యమంత్రిగా మహిళా సాధికారత, సామాజిక న్యాయం, సమ్మిళిత అభివృద్ధిపై బలమైన సంకల్పంతో సంక్షేమ ఆధారిత పాలనను ఆమె కొనసాగించారు." అని మోదీ పేర్కొన్నారు.

### 'పేదల సంక్షేమం, మహిళల హక్కుల కోసం జయలలిత కృషి చేశారు'

అలాగే కేంద్ర హోం మంత్రి అమిత్ సైతం జయలలితకు నివాళులర్పించారు. ఈ క్రమంలో తమిళనాడులోని పేదల సంక్షేమం, మహిళల సాధికారత కోసం జయలలిత చేసిన కృషిని గుర్తుచేసుకున్నారు. "తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, ప్రజానాయకురాలు జె. జయలలిత జయంతి సందర్భంగా ఆమెకు నా హృదయపూర్వక నివాళులు. పేదల సంక్షేమం, మహిళల సాధికారత కోసం ఆమె అంకితభావంతో కృషి చేశారు. తమిళనాడును అభివృద్ధి పథంలో నడిపించారు. ఆమె పరిపాలన ప్రయోజనాలు సమాజంలోని చివరి వ్యక్తికి కూడా చేరేలా చూసుకున్నారు. ప్రజా సేవ పట్ల ఆమె నిబద్ధత ఎప్పటికీ అందరికీ ప్రేరణగా ఉంటుంది." అని అమిత్ షా ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

# కేరళమ్‌గా కేరళ రాష్ట్రం పేరు

కేరళ రాష్ట్రం పేరును 'కేరళమ్'గా మార్చాలన్న ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు కేంద్ర మంత్రి మండలి మంగళవారం ఆమోదం తెలిపింది. నూతన పీఎంఓ కాంప్లెక్స్ 'సేవా తీర్థ్'లో ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన తొలి కేబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

'కేంద్ర కేబినెట్ ఆమోదం పొందిన తరువాత, భారత రాష్ట్రపతి 'కేరళ పేరు మార్పు బిల్లు, 2026'ను కేరళ రాష్ట్ర శాసనసభకు పంపిస్తారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్-3 ప్రకారం, కేరళ రాష్ట్రం తన అభిప్రాయాన్ని తెలియజేసేందుకు ఈ ప్రక్రియను చేపడతారు. కేరళ శాసనసభ అభిప్రాయాన్ని తెలుసుకున్న తర్వాత, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి సిఫారసుతో పార్లమెంట్?లో కేరళ పేరు మార్పు బిల్లు- 2026ను ప్రవేశపెడుతుంది' అని అధికారిక ప్రకటనలో పేర్కొన్నారు.

వాస్తవానికి కేరళ పేరును 'కేరళం'గా మార్చాలని కోరుతూ 2024 జూన్ 24న కేరళ శాసనసభ ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించింది. "మలయాళం భాషలో రాష్ట్రం పేరు 'కేరళం'. 1956 నవంబర్ 1న భాషా ప్రాతిపదికన రాష్ట్రాలు ఏర్పడ్డాయి. కేరళ పిరవి దినం కూడా నవంబర్ 1నే జరుగుతుంది. వాస్తవానికి స్వాతంత్ర్య పోరాట కాలం నుంచే మలయాళం మాట్లాడే వారందరికీ కలిపి 'ఐక్య కేరళం' కావాలనే డిమాండ్ బలంగా ఉండేది. అయితే రాజ్యాంగంలోని మొదటి షెడ్యూల్?లో మాత్రం 'కేరళ' అని నమోదు చేశారు. అందుకే ఆర్టికల్ 3 ప్రకారం రాష్ట్రం పేరును 'కేరళం'గా మార్చాలని కేంద్రానికి విజ్ఞప్తి చేస్తున్నాం" అని 2024లో చేసిన ఆ తీర్మానంలో పేర్కొన్నారు.

### రాష్ట్రాల పేర్లు ఇలా మార్చవచ్చా?

రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం, ఇప్పటికే ఉన్న రాష్ట్రాల పేర్లను మార్చే అధికారం పార్లమెంట్?కు ఉంటుంది. అయితే



ఇలాంటి బిల్లును రాష్ట్రపతి సిఫారసు లేకుండా పార్లమెంట్?లో ప్రవేశపెట్టడానికి వీల్లేదు. అంతేకాదు సంబంధిత రాష్ట్ర శాసనసభకు ఆ బిల్లును పంపి నిర్ణీత సమయంలోగా అభిప్రాయాలను కోరాల్సి ఉంటుంది. అయితే ఇప్పటికే కేరళ రాష్ట్రం పేరు మార్పు అంశాన్ని కేంద్ర హోం మంత్రిత్వశాఖ పరిశీలించింది. కేంద్ర హోం మంత్రి అమిత్? షా ఆమోదంతో డ్రాఫ్ట్ కేబినెట్ నోట్?ను న్యాయవ్యవహారాల శాఖ, శాసన సభ విభాగాలకు, న్యాయమంత్రిత్వ శాఖలకు పంపారు. వారు కూడా ఈ ప్రతిపాదనకు తమ సమ్మతిని తెలియజేశారు.

### కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

మంగళవారం కేంద్ర కేబినెట్ కేరళ పేరు మార్పుతో పాటు పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. దేశవ్యాప్తంగా బాలికలందరికీ ఉచితంగా హెచ్?పీవీ వ్యాక్సినేషన్ చేయించాలని తీర్మానించింది. అలాగే 14 ఏళ్ల బాలికలకు ఉచితంగా గర్డాసిల్ ఇంజెక్షన్ ఇవ్వాలని నిర్ణయించింది. మరోవైపు శ్రీనగర్?లో రూ.1667 కోట్లతో ఎయిర్?పోర్ట్ నిర్మాణానికి, రూ.1667 కోట్లతో అహ్మదాబాద్ మెట్రో విస్తరణకు ఆమోదం తెలిపింది. అలాగే విద్యుత్ రంగంలో సంస్కరణలు చేపట్టాలని నిర్ణయించింది.

### కేరళన్, కేరళైట్ పదాల మాటేమిటి?

కేరళ పేరును కేరళంగా మార్చడంపై కాంగ్రెస్ నేత శశిథరూర్ తనదైన రీతిపై స్పందించారు. రాష్ట్రం పేరును మారిస్తే అక్కడి ప్రజలను పిలిచే 'కేరళైట్?', 'కేరళన్?' లాంటి పదాల పరిస్థితి ఏమిటని సరదాగా ప్రశ్నించారు. 'కేరళం' వాసులను ఇకపై ఏమని పిలవాలి? అని చమత్కరించారు. వాస్తవానికి దీనిని కేబినెట్ నిర్ణయానికి ముందే ఎక్స్? వేదికగా ఆయన ఓ పోస్టు పెట్టారు. "ఇదంతా మంచిదే. కానీ ఇంగ్లీష్? మాట్లాడే మనలాంటి వారికి కోసం, భాషకు సంబంధించిన ఓ ప్రశ్న వేస్తాను. కేరళ ప్రజలను 'కేరళైట్'?, 'కేరళన్'? అనే పదాలతో పిలుస్తారు. రాష్ట్రం పేరును కేరళం అని మారిస్తే, అప్పుడు అక్కడి ప్రజలను 'కేరళమైట్' అంటారు. ఇదోదే సూక్ష్మజీవి పేరులా ఉంది. ఇక 'కేరళమియన్?' అంటే ఏదో అరుదైన ఖనిజం పేరులా అనిపిస్తోంది. ఈ పేరు మార్పు వల్ల పుట్టుకొచ్చే కొత్త పదాల కోసం కేరళ ముఖ్యమంత్రి ఓ పోటీని నిర్వహించాలేమో!"

### రాజాజీ విగ్రహం ఏర్పాటుపై హర్షం

మరోవైపు సోమవారం రాత్రి శశిథరూర్?, రాష్ట్రపతి భవన్?లో సి.రాజగోపాలాచారి (రాజాజీ) విగ్రహాన్ని ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. భారత్ గణతంత్ర రాజ్యంగా మారకముందు, (రాష్ట్రపతి పదవి ఏర్పడక ముందు) గవర్నర్ జనరల్‌గా పనిచేసిన ఏకైక భారతీయుడు రాజాజీ అని ఆయన గుర్తు చేశారు. విద్యార్థి దశ నుంచే ఆయన స్వతంత్ర పార్టీ సిద్ధాంతాలకు తాను బలమైన మద్దతుదారుడనని చెప్పారు. ప్రభుత్వ జోక్యం వంటగది, పడకగది, గ్రంథాలయాల వరకు ఉండకూడదనే ఆయన దృఢమైన భావాలను శశిథరూర్ కొనియాడారు. నేడు ఆయనను అనుసరించేవారు తక్కువ మంది ఉండడం విచారకరమని వ్యాఖ్యానించారు.

# రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా అమెరికాతో ట్రేడ్ డీల్

యుద్ధ నిర్ణయాల నుంచి అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాల వరకు అన్ని అంశాల్లో ప్రధాని నరేంద్ర మోదీ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. దేశ భద్రత, రైతుల ప్రయోజనాలు, పార్లమెంటరీ వ్యవస్థ అన్నీ ప్రమాదంలో పడుతున్నాయని అన్నారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్ వేదికగా జరిగిన రైతు మహాచౌపాల్ సభలో పాల్గొన్న రాహుల్, ఈ మేరకు కేంద్ర ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేశారు.

### ప్రధాని స్పందించలేదు: రాహుల్

మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే తన పుస్తకంలోని చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించిన రాహుల్, చైనా ట్యాంకులు సరిహద్దుల్లోకి వచ్చినప్పుడు ఆదేశాల కోసం రక్షణ మంత్రికి ఫోన్ చేసినా స్పందన రాలేదని నరవణే రాశారని చెప్పారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఎవరూ స్పందించలేదని ఆయన పేర్కొన్నారని తెలిపారు. చివరికి యుద్ధ నిర్ణయం ప్రధాని తీసుకోవాల్సి ఉన్నప్పటికీ, అప్పటి ప్రధాని స్పందించలేదని, ఆర్మీ చీఫ్‌ను ఒంటరిగా వదిలేశారని రాహుల్ వ్యాఖ్యానించారు. యుద్ధం చేయాలా వద్దా అన్నది రాజకీయ నిర్ణయమని, అది సైన్యానికి మోపలేమని స్పష్టం చేశారు.

### వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసేలా అమెరికాతో ఒప్పందం!

ఇక ఇండో-- యూఎస్ ట్రేడ్ ఒప్పందంపై కూడా ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికాతో కుదిరిన ఈ ఒప్పందం రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకమని, వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసేలా ఉందని చెప్పారు. ఐదు నెలల పాటు



వ్యవసాయ ఉత్పత్తుల అంశం కారణంగా ఈ ఒప్పందం నిలిచిపోయిందని, రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రభుత్వం కూడా అంగీకరించలేదని పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంట్ నుంచి బయటకు వెళ్లి నేరుగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్?కు ఫోన్ చేసి ఒప్పందానికి సిద్ధమని చెప్పారని ఆరోపించారు.

### ఎప్‌స్టీన్ ఫైళ్ల వెనుక అనుమానాలు

"నాలుగు నెలలు ఏమీ జరగలేదు. ఒక్కసారిగా ప్రధాని కాల్ చేసి రైతులను అమ్మేశారు. గార్మెంట్ రంగాన్ని కూడా నష్టపరిచారు. దేశ డేటాను అమెరికాకు అప్పగించారు" అంటూ విమర్శించారు. ఈ ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని ప్రధానికి సవాల్ విసిరారు. అమెరికాలో ఎప్?స్టీన్? కేసుకు సంబంధించిన లక్షల ఫైళ్లు ఉన్నాయని, అవి వెలుగులోకి రాకపోవడం వెనుక కూడా అనేక అనుమానాలు ఉన్నాయని రాహుల్ అన్నారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా ఎక్కడ చూసినా అదానీ పేరే వినిపిస్తోందని, ఆ సంస్థ కేవలం కంపెనీ కాదని, బీజేపీ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలా మారిందని ఆరోపించారు. "అమెరికా సుప్రీం కోర్టు నిర్ణయం తర్వాత ఇతర దేశాలు యూఎస్?తో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకోవాలని నిర్ణయించు కున్నాయి. కానీ ప్రధాని మోదీ మౌనంగా ఉన్నారు. ఈ వేదిక నుంచి నేను మోదీని సవాలు చేస్తున్నా. అమెరికా సుప్రీంకోర్టు ఈ ఒప్పందంపై తీర్పు ఇచ్చిన తర్వాత, అమెరికాతో ఒప్పందాన్ని రద్దు చేయండి. ట్రంప్ ఒత్తిడి కారణంగా ఆయన ఒప్పందాన్ని రద్దు చేయలేరు. భారత్?లో అత్యధిక జనాభా, అత్యధిక డేటా ఉంది. కానీ ప్రధాని మోదీ మన డేటా మొత్తాన్ని అమెరికాకు ఇచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీపై ఒత్తిడి లేకపోతే, ఆయన ఇలా చేసి ఉండేవారు కాదు. తన ఇమేజ్‌ను, రాజకీయ భవిష్యత్తును కాపాడుకోవడానికి ఆయన భారతదేశాన్ని అమ్మేశారు" అని రాహుల్ ఆరోపించారు.

### ప్రజలతో కలిసి పోరాటం

పార్లమెంటరీ వ్యవస్థపై కూడా రాహుల్ గాంధీ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఏడాది తొలిసారి లోక్‌సభ ప్రతిపక్ష నేతకు సభలో మాట్లాడే అవకాశం ఇవ్వలేదని తెలిపారు. లోక్‌సభ లో ప్రసంగం ప్రారంభించగానే అడ్డుకున్నారని, తన మాట వినిపించనివ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ప్రయోజనాలు, జాతీయ భద్రత, ప్రజాస్వామ్య వ్యవస్థ అంశాల్లో కేంద్రం బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. దేశ ప్రయోజనాల కంటే వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాలు ముందుకు రావొద్దని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో ప్రజలతో కలిసి పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు.

# చైనా జే-20కి చెక్...

భారత వాయుసేన (ఐఏఎఫ్) తన సామర్థ్యాన్ని మరింత పటిష్టం చేసుకునే దిశగా కీలక యోచనలు చేస్తోంది. ఇటీవలే జరిగిన 'ఆపరేషన్ సిందూర్' తర్వాత, రష్యాకు చెందిన ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్ 'సుఖోయ్ ఎస్‌యూ-57' కొనుగోలుపై రక్షణ వర్గాల్లో చర్చలు మళ్లీ ఊపందుకున్నాయి. చైనా, పాకిస్థాన్ నుంచి ఎదురయ్యే సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు ఈ అత్యాధునిక యుద్ధ విమానాలను సమకూర్చుకోవాలని భారత్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఈ ఒప్పందం కార్యరూపం దాల్చితే, వాయుసేన సుమారు 40 ఎస్‌యూ-57 జెట్లను ఆర్డర్ చేసే అవకాశం ఉందని సమాచారం. గత ఏడాది పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్ వాయుసేనతో జరిగిన గగనతల పోరాటాలు భారత రక్షణ వ్యూహకర్తలకు కొత్త పాఠాలు నేర్పాయి. ఆధునిక యుద్ధ తంత్రంలో ఫైటర్ జెట్లు నేరుగా తలపడే డాగ్‌ఫైట్ కన్నా, శత్రువు కంటపడకుండా దాడి చేసే స్టెల్త్ టెక్నాలజీకే ప్రాధాన్యత పెరిగిందని స్పష్టమైంది. ఈ నేపథ్యంలో, రాడార్లకు చిక్కని ఐదో తరం యుద్ధ విమానాల ఆవశ్యకతను ఐఏఎఫ్ గుర్తించింది. ఇప్పటికే చైనా జే-20 పేరుతో సొంతంగా స్టెల్త్ ఫైటర్‌ను అభివృద్ధి చేసింది. భవిష్యత్తులో ఈ టెక్నాలజీ పాకిస్థాన్‌కు కూడా అందే అవకాశం ఉందన్న ఆందోళనల నేపథ్యంలో, భారత్ వేగంగా స్పందించాల్సిన అవసరం ఏర్పడింది.

### ఎస్‌యూ-57 ప్రత్యేకతలు ఏంటి?

రష్యా అభివృద్ధి చేసిన ఎస్‌యూ-57 ఒక శక్తివంతమైన ఐదో తరం మల్టీరోల్ స్టెల్త్ ఫైటర్. శత్రు రాడార్లను ఏమార్చేలా ప్రత్యేకమైన ఎయిర్‌ఫ్రేమ్ డిజైన్, రాడార్ తరంగాలను శోషించుకునే మెటీరియల్స్‌తో దీనిని నిర్మించారు. సూపర్‌క్రూయిజ్



సామర్థ్యం (ఆఫ్టర్‌బర్నర్ అవసరం లేకుండానే సూపర్‌సానిక్ వేగంతో ప్రయాణించడం), అడ్వాన్స్‌డ్ సెన్సార్ ఫ్యూజన్ వంటి అత్యాధునిక ఫీచర్లు ఇందులో ఉన్నాయి. గగనతలం నుంచి గగనతలానికి, భూమిపైకి క్షిపణులను ప్రయోగించే సత్తా దీని సొంతం.

### మధ్యంతర పరిష్కారంగానే..

భారత్ సొంతంగా 'అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్' (ఏఎంసీఏ) పేరుతో ఐదో తరం ఫైటర్ జెట్‌ను అభివృద్ధి చేస్తోంది. అయితే దీని తొలి ప్రయోగాత్మక ఫ్లైట్ 2028-29లో జరిగి, 2035 నాటికి గానీ వాయుసేనలోకి పూర్తిస్థాయిలో చేరే అవకాశం లేదు. ఈ సుదీర్ఘ కాలంలో ఏర్పడే వ్యూహాత్మక అంతరాన్ని పూడ్చడానికే ఎస్‌యూ-57 జెట్లను ఒక 'బ్రిడ్జింగ్' పరిష్కారంగా భారత్ చూస్తోంది. గత ఏడాది జరిగిన ఏరో ఇండియా 2025లో రష్యా ఈ విమానాన్ని ప్రదర్శనకు ఉంచింది. అయితే, ప్రస్తుతానికి ఈ కొనుగోలుపై ఎలాంటి అధికారిక ఒప్పందం జరగలేదని, కేవలం చర్చల దశలోనే ఉందని రక్షణ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

# జాతీయం-అంతర్జాతీయం

# చర్చలు ఫలవంతం

## యుఎస్ వాణిజ్య కార్యదర్శి లుట్నిక్‌తో చర్చలపై కేంద్ర మంత్రి

**ముంబై, ఫిబ్రవరి 26 (ఉదయం):**

యుఎస్ వాణిజ్య కార్యదర్శి హోవార్డ్ లుట్నిక్, భారత్‌కు అమెరికా రాయబారి సెర్జియో గోర్‌తో అత్యంత ఫలవంతమైన చర్చలను జరిపినట్టు కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ గురువారం పేర్కొన్నారు. భారత్, అమెరికాల మధ్య వాణిజ్యాన్ని విస్తరించడం, ఆర్థిక సంబంధాలను బలోపేతం చేయడంపై ఈ సమావేశం దృష్టి పెట్టింది. ఈ సమావేశానికి సంబంధించిన వివరాలను గోయల్ సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్ పై పంచుకున్నారు. ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింతగా పెంచడం, సహకారాన్ని పెంపొందించడం లక్ష్యంగా ఈ చర్చలు జరిగినట్టు ఆయన తెలిపారు. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని విస్తరించి, బలమైన ఆర్థిక భాగస్వామ్యం చుట్టూ ఈ చర్చలు జరగాయని గోయల్ అన్నారు. ప్రపంచ వాణిజ్యంలో తన ఉనికిని పెంచుకోవడానికి, భారతీయ వ్యాపారాలకు అంతర్జాతీయ మార్కెట్ల అందుబాటును మెరుగుపరచడానికి భారతదేశం చురుకుగా పనిచేస్తోంది. ప్రభుత్వం భారతీయ కంపెనీలను ప్రపంచ విలువ గొలుసులలో భాగం కావాలని, విదేశాలలో కొత్త అవకాశాలను అన్వేషించాలని కూడా ప్రోత్సహిస్తోంది.



**విస్తరిస్తున్న భారత్ వాణిజ్య నెట్‌వర్క్**

దాదాపు 38 దేశాలతో భారత్ తొమ్మిది స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల (ఎఫ్‌టిఎ)లపై సంతకాలు చేసిందని గోయల్ పేర్కొన్నారు. ఈ ఒప్పందాలు భారతీయ వ్యాపారవేత్తలకు మెరుగైన మార్కెట్ల అందుబాటు, ప్రాధాన్యతా వాణిజ్య ప్రయోజనాలను కల్పిస్తాయని అన్నారు.

భారతీయ సరుకులు, సేవలు, వ్యవసాయ ఉత్పత్తులు, మత్స్య సంపద నూతన గ్లోబల్ మార్కెట్లకు చేరడానికి ఈ ఎఫ్‌టిఎలు తోడ్పడుతున్నాయని ఆయన అన్నారు. అవి శ్రమఆధారిత రంగాలకు మద్దతు ఇస్తుండడమే కాక నైపుణ్యం కలిగిన నిపుణులకు చలనశీలతను మెరుగుపరుస్తున్నాయి.

**ప్రపంచ సంబంధాల ద్వారా ఆత్మనిర్భర్ భారత్**

ఆత్మనిర్భర్ భారత్ దార్శనికత మనను మనం ప్రత్యేకంగా, వంటరిగా ఉంచుకోవడం గురించి కాదని గోయల్ స్పష్టం చేశారు. బదులుగా, ఇది ప్రపంచ భాగస్వామ్యాల ద్వారా బలమైన, విశ్వసనీయమైన, వైవిధ్యభరితమైన సరఫరా లంకెలను నిర్మించడంపై దృష్టి పెడుతుంది. దేశవ్యాప్తంగా ఉన్న ఎంఎస్ఎంఇలు, రైతులు, ఎగుమతిదారులు, మత్స్యకారులకు ప్రపంచ స్థాయి అవకాశాలను కల్పించాలని వ్యవస్థాపకులు, పరిశ్రమ నాయకులను ఆయన కోరారు.

**భారత్ భవిష్యత్తుపై విశ్వాసం**

ఇటీవల ముంబైలో జరిగిన 27వ ఇవై ఎంటర్‌ప్రెన్యూర్ ఆఫ్ ది ఇయర్ అవార్డుల కార్యక్రమంలో గోయల్ మాట్లాడుతూ, భారతదేశ వృద్ధి కథను దాని వ్యవస్థాపకులు,యువత ముందుకు నడిపిస్తారని అన్నారు. 'అమృత కాలం' లో యువ భారతదేశం దేశానికి మార్గనిర్దేశం చేస్తుందని, 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి సహాయపడుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# ఇజ్రాయెల్- భారత్ మధ్య పెరుగుతున్న బంధం

**న్యూఢిల్లీ, పిబ్రవరి 26 (ఉదయం):**

## 2017లో మోడీ పువ్వు నుంచి 2026లో నెసెట్ మెడల్ వరకూ..

ప్రధాని నరేంద్ర మోడీ రెండు రోజుల ఇజ్రాయెల్ పర్యటన ముగిసింది. భారత ప్రధాని





అయిన తర్వాత ఆ దేశంలో ఆయన పర్యటించడం ఇది రెండవ సారి. బుధవారం బెన్‌గురియన్ విమానాశ్రయంలో ఆయనకు ఇజ్రాయెలీ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ సాదరంగా ఆహ్వానం పలికారు.

**పుష్పానికి మోడీ పేరు**

ప్రధాని 2017లో చేసిన తొలి పర్యటన గుర్తున్నవారికి ఈ పర్యటన దానిని గుర్తు చేస్తుంది. ఆ సమయంలో ఆయన డాంజిగర్ పుష్పవనంలో ఆగినప్పుడు, ఆయన గౌరవార్థం త్వరగా ఎదిగే ఒకరకం చేమంతి పువ్వుకు మోడీ అని ఇజ్రాయెల్ పేరు పెట్టింది. ఇది చాలా అరుదైన, ప్రత్యేక దౌత్యపరమైన చర్య. ఇది ఇరు దేశాల మధ్యగల సన్నిహిత స్నేహాన్ని ప్రదర్శించింది. ఈ పువ్వు బిరబిరపెరగడానికే కాదు, ప్రకాశవంతమైన రంగుకు ప్రసిద్ధి చెందింది. దీనిని భారత్ ఇజ్రాయెల్ మధ్య పెరుగుతున్న బలమైన సంబంధాల గుర్తుగా చూస్తారు.

**నెసెట్‌లో ప్రధాని మోడీ ప్రసంగం**

దాదాపు తొమ్మిది సంవత్సరాల తర్వాత, ఆ బంధం మరింత బలపడింది. తొలి రోజే, ప్రధాని మోదీ ఇజ్రాయెల్ పార్లమెంట్ అయిన నెసెట్ ప్రత్యేక సమావేశంలో ప్రసంగించారు. దీనితో నెసెట్‌లో ప్రసంగించిన తొలి భారతీయ నాయకుడయ్యారు. తన ప్రసంగంలో, అక్టోబర్ 7 నాటి అనాగరిక ఉగ్రవాదాన్ని ఆయన ఖండించారు. ఈ క్షణంలో, ఆ తర్వాత కూడా ఇజ్రాయెల్‌తో భారత్ దృఢంగా నిలుస్తుందని ప్రకటించారు. పంచుకున్న విలువలు, స్నేహం, గౌరవం, భాగస్వామ్యం గురించి మాట్లాడారు. శాసనసభ్యులు తమ స్థానాల నుంచి లేచి నిలబడి కరతాళ ధ్వనులే కాక, "మోడీ, మోడీ" అని నినాదాలు చేయడం విశేషం. సంబంధాలను మరింత బలోపేతం చేయడంలో ఆయన పాత్రకు గాను ఇజ్రాయెల్ పార్లమెంట్ నుండి అత్యున్నత గౌరవం అయిన ప్రతిష్ఠాత్మక మెడల్ ఆఫ్ ది నెసెట్‌ను ప్రదానం చేశారు. రెండవ రోజు, ఆయన నెతన్యాహూతో కలిసి నివాళులు అర్పించేందుకు హోలోకాస్ట్ మెమోరియల్ అయిన యాదవాషెంను సందర్శించారు. అనంతరం వారు రక్షణ, సాంకేతికత, ఇతర ఒప్పందాల గురించి చర్చించారు. భద్రతను, ఆర్థిక వ్యవస్థను, ఆవిష్కరణల సహకారాన్ని పెంచుకునేందుకు మార్గాలను నాయకులు చర్చించారు.

# రాజ్యసభకు నామినేషన్లు ప్రారంభం



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:**

భారత ఎన్నికల సంఘం 15 రాష్ట్రాల్లోని మొత్తం 37 రాజ్యసభ స్థానాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయడంతో గురువారం ఎన్నికల ప్రక్రియ అధికారికంగా ప్రారంభమైంది. మహారాష్ట్రలో ఏడు స్థానాలు, తమిళనాడులో ఆరు, బీహార్, పశ్చిమ బెంగాల్‌లలో ఐదు చొప్పున, ఒడిషాలో నాలుగు, అస్సాంలో మూడు, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, హర్యానాలలో రెండు చొప్పున, హిమాచల్ ప్రదేశ్‌లో ఒకస్థానానికి మార్చి 16న ఓటింగ్ జరుగనుంది. వివిధ రాష్ట్రాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సభ్యుల పదవీ కాలం ముగియనుండటంతో ఈ ఖాళీలను భర్తీ చేయనున్నారు.

**ఎన్నికల కమిషన్ ప్రకటించిన షెడ్యూల్ :**

**నామినేషన్ల ప్రారంభం:** గురువారం నుంచే అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేయవచ్చు.

**నామినేషన్ల దాఖలుకు ఆఖరు తేదీ :** మార్చి 5.

**పరిశీలన :** దాఖలైన నామినేషన్లను మార్చి 6న అధికారులు పరిశీలిస్తారు.

**ఉపసంహరణ:** పోటీ నుంచి తప్పుకోవాలనుకునే అభ్యర్థులకు మార్చి 9 వరకు అవకాశం కల్పించారు.

**పోలింగ్, ఫలితాలు:** ఒకవేళ అవసరమైతే (ఏకగ్రీవం కాని పక్షంలో) మార్చి 16న ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు.

# ఆపరేషన్ సిందూర్ 2.0 కఠినం

## భారత సైన్యం వెస్ట్రన్ కమాండ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26 (ఉదయం): దాదాపు 26మంది మరణానికి దారితీసిన పహల్‌గాంవ్ తీవ్రవాద దాడి అనంతరం గత ఏడాది మేలో భారత సైనిక దళాలు ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా పాకిస్తాన్‌లో, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో తీవ్రవాద మౌలిక సదుపాయాలను మాత్రమే లక్ష్యంగా చేసుకొని దాడులు చేశారు.ఆపరేషన్ సిందూర్ పాకిస్తాన్‌కు బలమైన సందేశాన్ని ఇవ్వగా, ఆపరేషన్ సిందూర్ 2.0 కొనసాగుతోందని, ఈసారి దాని సన్నాహక స్థాయి భారీగా ఉందని 2 కోర్స్ కి చెందిన జనరల్ ఆఫీసర్ కమాండింగ్ (జిఒసి) లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ పేర్కొన్నారు. గత ఏడాది మేలో జరిగిన ఆపరేషన్ సిందూర్‌ను గుర్తు చేసుకుంటూ, కేవలం నాలుగు రోజుల్లోనే పాకిస్తాన్‌కు కఠినమైన సందేశాన్ని భారత్ ఇచ్చిందని, ఆ దేశాన్ని మోకాళ్ల పైకి తెచ్చిందని అన్నారు.

ఆ ఆపరేషన్‌లో మేం పాకిస్తాన్‌కు చాలా చిన్న శాంపుల్ చూపించాము. కేవలం నాలుగు రోజుల్లోనే, వారిని మోకాళ్ల పైకి తెచ్చాం. దానితో మా డిజిఎంఒకు ఫోన్ చేసి ఈ యుద్ధాన్ని ఆపమని అడిగారు. ఇది చాలా చిన్న ఉదాహరణ, దాని ఉద్దేశం శిక్షణ అని లెఫ్టినెంట్ జనరల్ పుష్కర్ విలేకరులతో అన్నారు. పంజాబ్‌లోని పఠాన్‌కోట్‌లో వెస్ట్రన్ కమాండ్ హై ప్రొఫైల్ ఆపరేషనల్ కెపాబిలిటీ డెమోన్‌స్ట్రేషన్ సందర్భంగా ఆ అధికారి మాట్లాడారు. ఉగ్రవాదం పట్ల భారతదేశం అనుసరిస్తున్న "జీరో టాలరెన్స్ పాలసీ"కి అనుగుణంగా ఆపరేషన్ సిందూర్ కొనసాగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గతంలో పునరుద్ఘాటించారు. మేం ఎటువంటి బలమైన చర్య తీసుకోకుండా ఆయన (షెహబాజ్ షరీఫ్) నిరోధించాలనుకుంటున్నారు. ఇది ఆయన చేస్తున్న ఒక రకమైన మోసం, దీనిని మనం బహిరంగంగా చెప్పాలి. ఆయన అణు దాడితో మేం నిరుత్సాహపడం అని ఆయన చెప్పినట్టు వార్తా సంస్థలు పేర్కొన్నాయి. ఆపరేషన్ సిందూర్ కొనసాగుతోంది. ఆపరేషన్ సిందూర్ 2 కోసం సన్నాహాలు చాలా విస్తృతంగా ఉన్నాయి.



ఈ ఆపరేషన్ ఎలా జరుగుతుందో నేను ఇప్పుడే మీకు చెప్పలేను. ఎందుకంటే ఇది శత్రువుకు మనం ఎంత నష్టం కలిగించాలనుకుంటున్నామో అనేదానిపై ఆధారపడి ఉంటుంది. అది ఏదైనా రకమైన నష్టం అయినా, మేము దానిని నిర్వహించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నాము అని ఆయన వివరించారు.

**అణ్వాయుధ దాడులనే అబద్ధానికి వెనక్కి తగ్గం:**

మరో సీనియర్ సైనిక అధికారి కూడా ఈసారి పాకిస్తాన్ నుండి వచ్చే ఏదైనా రెచ్చగొట్టడం వల్ల బలమైన ప్రతీకారం తీర్చుకోవచ్చని అన్నారు. పాకిస్తాన్ అణు దాడులనే బెదిరింపుతో భారతదేశం ఇకపై నిరుత్సాహపడదని వెస్ట్రన్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్‌ఇన్‌చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ మనోజ్ కుమార్ కటియార్ అన్నారు. భారత సైన్యం బలమైన చర్య తీసుకోకుండా పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ నిరోధించాలనుకుంటున్నారు అని ఆయన అన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో వెస్ట్రన్ కమాండ్ సాధించిన విజయాన్ని లెఫ్టినెంట్ జనరల్ కటియార్ మరింత పట్టి చూపుతూ, భారత సైన్యం గతంలో కంటే... కఠినంగా స్పందించాలి అని అన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో, మేము వారి (పాకిస్తాన్) ఉగ్రవాద స్థావరాలన్నింటినీ దాడి చేసాం. ఆ తర్వాత, వారు ప్రతీకారం తీర్చుకున్నారు, ప్రతిస్పందనగా, మేం వారి సైనిక స్థావరాలను, వైమానిక స్థావరాలను ధ్వంసం చేసాం. అప్పుడు వారు కాల్పుల విరమణను డిమాండ్ చేశారు. మా నుండి నేరుగా కాకుండా, ఇతర దేశాల నుండి కూడా భారతదేశంతో కాల్పుల విరమణను కోరారు, అని ఆయన అన్నారు.

# బంగ్లాదేశ్ అధ్యక్షుడిపై ప్రతిపక్ష జమాత్ నేత విమర్శలు

**ఢాకా, ఫిబ్రవరి 26 :**

షేక్ హసీనా 2024లో పదవీచ్యుతురాలైన తర్వాత, మహమ్మద్ యూనస్ పాలనలో తనకు ఎదురైన అవమానం గురించి బంగ్లాదేశ్ అధ్యక్షుడు మహమ్మద్ షాబుద్దీన్ మాట్లాడిన కొద్ది రోజులలోనే బంగ్లాదేశ్ అతివాద జమాత్ ఎ ఇస్లామీ పార్టీ నాయకుడు షఫీకుర్ రెహమాన్ ఆయన పై తీవ్ర దాడికి దిగారు. బంగ్లాదేశ్ పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుడు కూడా అయిన ఆయన, ఆగస్టు 5, 2024 నాటి ఘటనలకు సంబంధించిన కీలక వాస్తవాలను బయటపెట్టడానికి దేశాధ్యక్షుడు నిరాకరిస్తున్నారని పేర్కొన్నారు. బంగాలి ప్రచురణ అయిన కలేర్ కాంథోకు షాబుద్దీన్ ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూను రెహమాన్ ప్రస్తావిస్తూ,ఆగస్టు 5, 2024 గురించి అధ్యక్షుడు అనేక వాస్తవాలను దాచిపెట్టారు అని అన్నారు. పదవీచ్యుతురాలైన ప్రధానమంత్రి రాజీనామా గురించి ఆ రోజు అక్కడ ఉన్న నాయకులకు ఆయన చెప్పినది, తరువాత ఆయన దేశానికి తెలియజేసినది ఆయన ప్రస్తుత వ్యాఖ్యలలో ప్రతిబింబించడం లేదు. ఆయన ఇప్పుడు చెబుతున్నది ఆ రోజు చెప్పినది కాదు అని షేక్ హసీనా రాజీనామా వివాదం గురించి ప్రస్తావిస్తూ అన్నారు.

ఆ రోజు లక్షలాది మంది ప్రజలు విన్న దానికి, ఆయన అప్పుడు చెప్పిన దానికి, ఇప్పుడు చెబుతున్న దానికి అధ్యక్షుడు పొంతన పెట్టగలరా? అని రెహమాన్ ప్రశ్నించారు.

దేశం అమాయకమైందు కాదు. రాష్ట్ర అత్యున్నత కార్యాలయం నుండి ఇటువంటి ప్రవర్తన ఆమోదయోగ్యం కాదు అని ఆయన అన్నారు.



**యూనస్-జమాత్ సంబంధం?**

మాజీ ప్రధాన సలహాదారు, నోబెల్ గ్రహీత మొహమ్మద్ యూనస్ తనను రాజ్యాంగ విరుద్ధమైన రీతిలో పదవి నుండి తొలగించడానికి కుట్ర పన్నారని షహాబుద్దీన్ ఆరోపించిన కొన్ని రోజుల తర్వాత అధ్యక్షుడిపై రెహమాన్ విమర్శలు వచ్చాయి. యూనస్ పదవీకాలంలో బంగ్లాదేశ్‌ను అస్థిరపరిచి రాజ్యాంగ శూన్యతను సృష్టించడానికి ప్రయత్నాలు జరిగాయని షహాబుద్దీన్ పేర్కొన్నారు.

అధ్యక్షుడిని విమర్శించడం ద్వారా, జమాత్ చీఫ్ అనుకోకుండా బంగ్లాదేశ్‌లోని ఇస్లామిస్ట్ గ్రూపులకు, యూనస్ తాత్కాలిక పాలనకు మధ్య ఉన్న సంబంధాన్ని బయటపెట్టారు.

ఆగస్టు 2024 తిరుగుబాటు తరువాత యూనస్ తన 18 నెలల పదవీకాలంలో రాడికల్ ఇస్లామిస్ట్ శక్తులను ప్రోత్సహించడం, మద్దతు ఇవ్వడం లేదా అధికారం ఇవ్వడం వంటి ఆరోపణలను పదవీచ్యుతురాలైన హసీనా, ఆమె అవామీ లీగ్ పార్టీ, వివిధ విశ్లేషకుల నుండి ఎదుర్కొన్నాడు.

**హసీనా రాజీనామా వివాదం**

ఆగస్టు 5, 2025న హసీనా బంగ్లాదేశ్ నుండి పారిపోయిన కొన్ని గంటల తర్వాత, షహబుద్దీన్ ఒక టెలివిజన్ ఇంటర్వ్యూలో హసీనా రాజీనామా లేఖను తనకు ఇచ్చిందని, తాను దానిని అందుకున్నాను అని అన్నారు. యూనస్ తాత్కాలిక పాలన ఏర్పాటును చట్టబద్ధం చేయడానికి హసీనా రాజీనామా రాజ్యాంగబద్ధంగా అవసరం.

అయితే, రెండు నెలల తర్వాత, హసీనా రాజీనామా గురించి తాను విన్నాను కానీ ఆమె రాజీనామా చేసిందా లేదా అనేదానికి ఎటువంటి ఆధారాలు లేవని అధ్యక్షుడు పేర్కొన్నారు. నేను చాలాసార్లు రాజీనామా లేఖను సేకరించడానికి ప్రయత్నించాను కానీ విఫలమయ్యాను. బహుశా ఆమెకు సమయం లేకపోవచ్చు అని ఆయన అక్టోబర్ 2024లో బంగ్లాదేశ్ దినపత్రిక జనతార్ చోఖ్‌తో అన్నారు.

ఆయన వైఖరిలో వచ్చిన మార్పే ఆయనను తొలగించాలనే పిలుపుకు దారితీసింది. అయితే ఆయన దాని నుంచి బయటపడగలిగారు. బంగ్లాదేశ్ అధ్యక్షుడు యూనస్ పాలన తనను పదే పదే అత్యున్నత పదవి నుండి తొలగించడానికి ప్రయత్నించిందని ఆరోపించారు.

# ఎంఒయుపై భారత్-నేపాల్ సంతకాలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:**

అడవులు, వన్యప్రాణులు, పర్యావరణం, జీవవైవిధ్య పరిరక్షణ, వాతావరణ మార్పు వంటి రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని ప్రోత్సహించడానికి... వన్యప్రాణుల కారిడార్లు, పరస్పర అనుసంధాన ప్రాంతాల పునరుద్ధరణ, విజ్ఞానం, సాంకేతిక నైపుణ్యం, ఉత్తమ పద్ధతులను పంచుకోవడానికి... భారత ప్రభుత్వ పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ బుధవారం నేపాల్ ప్రభుత్వ అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖతో ఒక అవగాహన ఒప్పందం (ఎంవోయూ) పై సంతకాలు చేసింది. భారత ప్రభుత్వ పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్, నేపాల్ ప్రభుత్వ అటవీ, పర్యావరణ మంత్రి మాధవ్ ప్రసాద్ చౌలగైన్‌ల సమక్షంలో న్యూఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఈ అవగాహన ఒప్పందంపై ఇరు దేశాల ప్రతినిధులు సంతకాలు చేశారు. భారత్‌నేపాల్ దేశాలు గొప్ప జీవవైవిధ్యం, ప్రకృతి పరమైన వారసత్వాన్ని కలిగి ఉన్నాయి. వాటి సంబంధిత భూభాగాల్లో విస్తృతమైన రక్షిత ప్రాంతాల నెట్‌వర్క్‌లను ఇరు దేశాలూ ఏర్పాటు చేశాయి. అనేక బహుపాక్షిక పర్యావరణ ఒప్పందాలు, సదస్సులలో ఇరు దేశాలు భాగస్వాములుగా ఉన్నాయి. భాగస్వామ్య పర్యావరణ వ్యవస్థలు, సరిహద్దుల మీదుగా ఉన్న వన్యప్రాణుల ఆవాసాల దృష్ట్యా అడవులు, వన్యప్రాణులు, పర్యావరణం, జీవవైవిధ్య పరిరక్షణ, వాతావరణ మార్పు రంగాల్లో ఇరు దేశాల ప్రభుత్వాల మధ్య సమన్వయం, సహకారాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఇరు దేశాల ప్రతినిధులు అభిప్రాయపడ్డారు.



ఏనుగు, గంగా డాల్ఫిన్, ఖడ్గమృగం, మంచు చిరుత, పులి, రాబందులు వంటి కీలక జాతుల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ ప్రకృతి దృశ్య స్థాయిలో జీవవైవిధ్య పరిరక్షణ వ్యూహాలను రూపొందించడంలో సహకారాన్ని ఈ అవగాహన ఒప్పందం పెంపొందిస్తుంది. ఇది బలోపేతమైన అటవీ, రక్షిత ప్రాంతాల నిర్వహణ... సరిహద్దుల మధ్య రక్షిత ప్రకృతి దృశ్యాలను సృష్టించే దిశగా కారిడార్లు, ఇతర పరస్పర అనుసంధాన ప్రాంతాల పునరుద్ధరణ... జీవవైవిధ్య పరిరక్షణ ముప్పులను పరిష్కరించడం... అటవీ, వన్యప్రాణులకు సంబంధించిన నేరాలను అరికట్టడం... అమలు సంస్థల ఫ్రంట్‌లైన్ సిబ్బంది సామర్థ్యాన్ని పెంపొందించడం... జీవవైవిధ్య హాట్‌స్పాట్‌లలో స్మార్ట్ గ్రీన్ మౌలిక సదుపాయాలను ప్రోత్సహించడం వంటి అంశాలపై ఈ ఒప్పందంలో ప్రధానంగా దృష్టి సారించారు.

ఈ అవగాహన ఒప్పందంపై సంతకం చేయడం వల్ల వన్యప్రాణుల, జీవవైవిధ్య పరిరక్షణలో భారత్‌నేపాల్ సహకారం మరింత బలోపేతమవుతుందని... ఉమ్మడి పర్యావరణ వ్యవస్థల రక్షణకు, ఈ ప్రాంతంలోని సహజ వనరుల స్థిరమైన నిర్వహణకు ఇది దోహదపడుతుందని భావిస్తున్నారు.

# క్షమాపణతో వదిలేయలేం: సుప్రీం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26 (ఉదయం):**

## 8వ తరగతి పాఠ్యాంశమై ఎన్‌సిఆర్‌టిపై మండిపాటు

ఎన్‌సిఇఆర్‌టి ఎనిమిదో తరగతి సోషల్ సైన్స్ పాఠ్యపుస్తకంలో న్యాయవ్యవస్థలో అవినీతి అనే వివాదాస్పద విభాగం చేర్చడంపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను సుప్రీంకోర్టు గురువారం తీవ్రంగా తప్పుబట్టింది.

ధర్మాసనం ముందు హాజరైన మెహతా, ఈ విషయానికి బాధ్యులను భవిష్యత్తులో పాఠ్యపుస్తకంలో జోక్యం చేసుకోనివ్వమని అన్నారు. ఆ భాగం సమర్థనీయం కాదని అంగీకరించారు. అయితే, కేవలం ఆ విషయాంశాన్ని తొలగించడం సరిపోదని భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ స్పష్టం చేశారు.

**న్యాయవ్యవస్థ రక్తంచిందిస్తోంది: సిజెఐ తీవ్ర వ్యాఖ్యలు**

పుస్తకం ఇప్పటికే మార్కెట్‌కు చేరుకుందని పేర్కొంటూ, ఆ భాగాన్ని ఉపసంహరించుకోవడం లేదా క్షమాపణ చెప్పడం సరిపోదని సిజెఐ వ్యాఖ్యానించారు. కేవలం క్షమాపణ చెప్పి అధికారులను వదిలేయలేం. దానిని తొలగిస్తున్నామని చెప్పడం సరిపోదు. పుస్తకం ఇప్పటికే పంపిణీ చేశారు. నేను కూడా ఒక కాపీని చూశాను" అని ఆయన అన్నారు.





కేవలం 32 కాపీలు మాత్రమే పంపిణీ చేశారని, పిల్లలకు సానుకూల విలువలను బోధించాలని మెహతా చెప్పినప్పుడు, సిజెఐ ఈ సమస్య చాలా తీవ్రమైందని ప్రతిస్పందించారు. ఈ పుస్తకంలో అంశాన్ని చేర్చడం ప్రణాళికాబద్ధమైన చర్యగా ఆయన అభివర్ణించారు, ఈ పుస్తకాన్ని పిల్లలు మాత్రమే కాకుండా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విస్తృత సమాజం కూడా చదువుతారని నొక్కి చెప్పారు.

**కొనసాగనున్న విచారణ, షోకాజ్ నోటీసులు జారీ**

కోర్టు సంతృప్తి పడే వరకూ విచారణను ముగించబోమని ప్రధాన న్యాయమూర్తి స్పష్టం చేశారు. దీని వెనుక ఉన్నది ఎవరో మేం తెలుసుకోవాలి. మేం సంతృప్తిపడే వరకూ, ఈ వ్యవహారం కొనసాగుతుందని ఆయన అన్నారు.

పౌరుల హక్కులను పరిరక్షించడంలో న్యాయవ్యవస్థ పాత్రను పాఠ్యపుస్తకంలో విస్మరించారని ఆయన పేర్కొన్నారు. న్యాయం పొందడం, న్యాయ సహాయం అందించడం మెరుగుపరచడానికి తీసుకున్న వివిధ చర్యలను, అలాగే ప్రజా జీవితంలో అవినీతికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టు జారీ చేసిన అనేక మైలురాయి ఆదేశాలను కోర్టు పట్టి చూపింది. ఈ భాగం మంచి ఉద్దేశ్యంతో రాసినట్లు కనిపించడం లేదని సిజెఐ పేర్కొన్నారు. కోర్టు మంచి విశ్వాసంతో చేసిన న్యాయమైన విమర్శలను అణచివేయడానికి ప్రయత్నించదని స్పష్టం చేస్తూనే, న్యాయవ్యవస్థ గౌరవాన్ని కాపాడుకోవడం చాలా అవసరమని ఆయన నొక్కి చెప్పారు. చిన్న పిల్లలకు ఏకపక్ష కథనాన్ని అందించడం వారి మనస్సులను ప్రభావితం చేస్తుందని ఆయన అన్నారు. ఉద్దేశపూర్వకంగా న్యాయవ్యవస్థ పట్ల అగౌరవాన్ని వ్యాప్తి చేయడం నేరపూరిత ధిక్కారానికి దారితీస్తుందని కూడా ఆయన హెచ్చరించారు.

**క్షమాపణ నిజాయితీగా చెప్పారా లేదా అని పరిశీలించాలి**

పుస్తక పంపిణీని నిలిపివేసి, దానిని ఉపసంహరించుకుంటున్నట్లు పేర్కొంటూ విద్యా శాఖ ఒక పత్రికా ప్రకటన జారీ చేసిందని ధర్మాసనానికి సమాచారం అందింది. ఆ ప్రకటనలో విచారం కూడా వ్యక్తం చేశారు. అయితే, క్షమాపణ నిజాయితీగా చెప్పారా లేదా అని కోర్టు పరిశీలించాలని సిజెఐ అన్నారు.

పాఠశాల విద్యా శాఖ కార్యదర్శి, ఎన్‌సిఇఆర్‌టి డైరెక్టర్ దినేష్ సక్లానీ వివరణ కోరుతూ సుప్రీం కోర్టు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పుస్తకాన్ని స్వాధీనం చేసుకుని, దాని ఆన్‌లైన్ పిడిఎఫ్ వెర్షన్‌ను తొలగించడంతో సహా పుస్తకం ప్రజలకు అందుబాటులోకి రాకుండా చూడాలని కోర్టు ఆదేశించింది.

### విద్యామంత్రి స్పందన

వివాదాస్పదమైన కొత్త పాఠ్య పుస్తకం విషయంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పందించారు. ఆ పుస్తకంలో 'న్యాయ వ్యవస్థలో అవినీతి' అంటూ ఒక అధ్యాయాన్ని ప్రచురించడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసి, ఆ పుస్తకాన్ని నిషేధించిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విచారం వ్యక్తం చేశారు.

ఈ విషయం తన దృష్టికి రాగానే ఆ పుస్తకాలు సర్క్యులేషన్‌లో లేకుండా వెనక్కి తీసుకోవాలని ఎన్‌సిఇఆర్‌టిని ఆదేశించాను. న్యాయ వ్యవస్థను అగౌరవపర్చాలనే ఉద్దేశం ప్రభుత్వానికి లేదు. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నాం. మేం న్యాయవ్యవస్థకు అత్యున్నత గౌరవం ఇస్తాం. కోర్టు నిర్ణయానికి కట్టుబడి ఉంటాం. జరిగినదాని పట్ల చింతిస్తున్నాను. ఎన్‌సిఇఆర్‌టిపై విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. భవిష్యత్‌లో ఇలాంటి తప్పిదాలు పునరావృతం కాకుండా చూసుకుంటాం అని మంత్రి వెల్లడించారు. ఈ పుస్తకంలోని అధ్యాయాన్ని తీవ్రంగా పరిగణించిన సుప్రీంకోర్టు ఇప్పటికే సుమోటోగా విచారణకు చేపట్టిన సంగతి తెలిసిందే. ఇదంతా న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు చేసిన కుట్రేనంటూ ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ విచారణ సందర్భంగా ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా బేషరతుగా క్షమాపణలు చెప్పారు. ఇక ఇప్పటికే ఎన్‌సీఈఆర్‌టీ ఆ పాఠ్యపుస్తకాన్ని అధికారిక వెబ్‌సైట్ నుంచి తొలగించింది. అసంబద్ధమైన అంశాలను ప్రచురించినందుకు క్షమాపణ చెప్పింది.



## వడ్డెర్ల సంక్షేమ అభివృద్ధి కేవలం సీఎంతోనే సాధ్యం

- అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వర్ రావు
- కడప జిల్లా వడ్డెర్ల సమస్యల గురించి వడ్డెర కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్ల సమావేశం



**కడప, ఫిబ్రవరి 26, (వుదయం జిల్లా బ్యూరో)** వడ్డెర్ల సంక్షేమం, అభివృద్ధి కేవలం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని ఏపీ వడ్డెర సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వరరావు తెలిపారు. గురువారం కడప నగరంలోని బీసీ భవన్‌లో ఆదరణ పథకం–3, కడపజిల్లా వడ్డెర్ల సమస్యల గురించి వడ్డెర కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ ఈశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవితమ్మ ఆదేశాల మేరకు ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. వడ్డెర్ల సంక్షేమాన్ని కాంక్షిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తూ ఆయా అంశాలపై వడ్డెర సంఘ నేతలతో సమీక్షిస్తున్నామన్నారు. సమావేశం దృష్టికి తీసుకొచ్చిన అన్ని అంశాలను ముఖ్యమంత్రితోపాటు మంత్రులు లోకేష్, సవితమ్మ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంతో పాటు స్థానిక సమస్యలను ఆయా శాసనసభ సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వడ్డెర్ల ముద్దుబిడ్డ వడ్డె ఓబన్న జయంతి వేడుకలు అధికారిక కార్యక్రమంగా నిర్వహించి వడ్డెర్లకు తగిన గౌరవాన్ని కల్పించిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికి దక్కిందన్నారు. రాబోయే కాలంలో వడ్డెర్లకు సంబంధించి అన్ని అంశాల్లో తగిన న్యాయం చేసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ వడ్డెర సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ దేరంగుల రమణయ్య, ఏపీ వడ్డెర సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ తమ్మిశెట్టి రమాదేవి, ఇతర డైరెక్టర్లు గండికోట వెంకట సుబ్బయ్య, దుర్గా మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కడప కమిషనర్ మనోజ్ కుమార్ రెడ్డిని తొలగించడం హర్షం

- మనోజ్ కుమార్ రెడ్డి ఆస్తులపై సీబీఐ విచారణ చేపట్టాలి
- ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి. యం. ఓబులేసు యాదవ్



**కడప, ఫిబ్రవరి 26, (వుదయం జిల్లా బ్యూరో)** 2018 గ్రూప్ 1 నియామకాల్లో అక్రమాలు జరిగాయన్న అభియోగాలపై హైకోర్టులో దాఖలైన పిటిషన్ పై విచారించిన కోర్టు 26 మంది ఆర్డీవోలను, 22 మంది డిఎస్పి లను వాళ్లు ఉన్న ప్రస్తుత స్థాయి నుండి దిగువ స్థాయికి బాధ్యతలను తగ్గించి, సిట్ ఏర్పాటుచేసి విచారించాలని కోర్టు ఆదేశాలలో కడప నగరపాలక సంస్థ కమిషనర్ మనోజ్ కుమార్ రెడ్డిని తొలగించడమే కాకుండా ఆయన ఆస్తులపై సిబిఐ విచారణ చేపట్టాలని జాతీయ చేతి వృత్తుల ఐక్య వేదిక పార్టీ జాతీయ అధ్యక్షులు అవ్వారు మల్లికార్జున, ఆర్ ఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి. యం. ఓబులేసు యాదవ్, ఎస్సీ, ఎస్టీ రోమన్ రేట్స్ జాతీయ కన్వీనర్ జీవి రమణ, మహాజన రాజ్యం పార్టీ జాతీయ అధ్యక్షులు సంగటి మనోహర్ లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప నగర పాలక సంస్థ కమిషనర్ 2018 గ్రూప్ వన్ ద్వారా ఆర్డీవో గా నియామకం అయిన నాటి నుండి నేటి వరకు అనేక అవినీతి అక్రమాలకు మనోజ్ కుమార్ రెడ్డి పై ఉన్నాయని సంబంధ ఆరోపణలు అనేకం ఉన్నాయన్నారు. ఆర్డీవో గా ఉన్నప్పుడు అసైన్డ్ భూముల ఫ్రీ హోల్డ్ వ్యవహారంలో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. కడప నగరపాలక సంస్థ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన నాటినుండి నగరపాలక సంస్థ అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టిన యాదాల పిచ్చయ్య ట్రస్టుతో అధికార పార్టీ నేతలతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకున్నట్లు కడప నగరంలో చర్చ జరుగుతుందని తెలిపారు. కడప నగరంలో విలువైన కళాక్షేత్రం, వైయస్సార్ ఆడిటోరియం, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవన్, పాత మున్సిపల్ కార్యాలయ స్థలం పి పి పి పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులకు అమ్మకానికి పెట్టడాన్ని నగరపాలక సంస్థ కమిషనర్ పి పి పి విధానం అజెండాలో చేర్చారన్న విషయాన్ని బట్టి నగరంలో ఉన్న విలువైన ప్రభుత్వ స్థలాలను పక్కా ప్రణాళికతో అమ్మకానికి పెట్టి అధికారాన్ని పార్టీ నేతలకు కట్టబెట్టి మనోజ్ రెడ్డి వ్యక్తిగత ఆదాయాన్ని పెంచుకోవాలన్న దురుద్దేశాలు బట్టబయలయ్యాయి అన్నారు.

## దళితులపై మారణహోమాన్ని అరికట్టాలి

ఆంధ్రప్రదేశ్ దళిత మిత్ర సంఘం డిమాండ్



**కడప, ఫిబ్రవరి 26, (వుదయం జిల్లా బ్యూరో)** రాష్ట్రంలో దళితుల ప్రాణాలకు రక్షణ కరువైందని, అరాచక శక్తులు బరితెగిస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ దళిత మిత్ర సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కైపు రామాంజనేయులు, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు మురహరి ప్రవీణ్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం ఈ సందర్భంగా కడప నగరంలో తమ కార్యాలయంలో మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో దళితులపై దాడులు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. కడప జిల్లా పోరుమామిళ్లలో ఇద్దరు దళిత యువకులను అత్యంత పాశవికంగా మర్డర్ చేయడం సభ్య సమాజం తలదించుకోవాల్సిన విషయం. అలాగే కర్నూలు జిల్లాలో ఒక దళిత నాయకుడిని పక్కా పథకం ప్రకారం హత్య చేశారు. ఇవి కేవలం వ్యక్తిగత గొడవలు కావు, దళిత జాతిని అణచివేయాలనే కుట్రలో భాగం. ప్రభుత్వం మరియు పోలీస్ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటం వల్లే నేరస్తులకు ధైర్యం పెరుగుతోంది. రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు మురహరి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. "రాష్ట్రవ్యాప్తంగా యువత, ముఖ్యంగా దళిత యువకులు టార్గెట్ అవుతున్నారు. పోరుమామిళ్ల ఘటనలో మరణించిన యువకుల కుటుంబాల పరిస్థితి వర్ణనాతీతం. ప్రభుత్వం తక్షణమే స్పందించి నిందితులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలి. చట్టాలు పుస్తకాల్లోనే ఉన్నాయి తప్ప, అమలులో కనిపించడం లేదు. దళితుల రక్తం చిందిస్తే చూస్తూ ఊరుకోబోమని, అవసరమైతే రాష్ట్రవ్యాప్త యువజన పోరాటానికి సిద్ధమౌతామన్నారు. ప్రభుత్వానికి కీలక డిమాండ్లు సెన్సిటివ్ జోన్ ఏర్పాటుచేసి, రాష్ట్రంలో దళితులపై దాడులు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను, దళిత జనాభా ఎక్కువగా ఉన్న సమస్యాత్మక గ్రామాలను తక్షణమే 'సెన్సిటివ్ జోన్లు' (అతి సున్నిత ప్రాంతాలు) గా ప్రకటించాలి. అక్కడ నిరంతరం పోలీసు రక్షణ (పోలీస్ ఔటపోస్ట్స్) కల్పించి, దళితులకు భద్రతపై భరోసా ఇవ్వాలి. పోరుమామిళ్ల, కర్నూలు హత్య కేసులను ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు అప్పగించి, 90 రోజుల్లోపు నిందితులకు కఠిన శిక్ష పడేలా చూడాలి. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే రూ. కోటి రూపాయల చొప్పున పరిహారం ప్రకటించి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద రాజీలేని కఠిన చర్యలు తీసుకోవాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకూడదు. ఈ దాడులు ఇలాగే కొనసాగితే, ఆంధ్రప్రదేశ్ దళిత మిత్ర సంఘం ఆధ్వర్యంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీలను కలుపుకొని రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని చేపడతామని తెలిపారు.

## పసిబిడ్డలపై కామంధుడి కన్ను

- రంగంలోకి దిగిన నెల్లూరు సఖి సిబ్బంది
- పోక్సో కింద కేసు నమోదు



**కావలి, ఫిబ్రవరి 26, వుదయం న్యూస్:** కావలి పట్టణంలో గత రెండు రోజుల క్రితం ఓ కామందుడు పసిబిడ్డలపై కన్నేసి కామ వాంఛ తీర్చుకున్న ఆరోపణలపై వృద్ధ కామాందుడైన జ్ఞాన ప్రసాద్ పై ఎట్టకేలకు ఫోక్ షో కేసు నమోదైనది. చట్టం ముందుకు ఆ కామాంధుడిని హాజరు పరిచే సన్నద్ధం సిద్ధమైంది. గురువారం నెల్లూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ బి హేనా సుజన్ ఆదేశాలతో సఖి సిబ్బంది గోళ్ల సాధన, ఎన్ లీలావతి, అలాగే కావలి ఉమెన్ ఫోర్స్ కన్వీనర్ శారదమ్మ, కలయిక కళ్యాణమండపం ప్రతినిధి సరస్వతి తదితరులు పాల్గొని నిజాన్ని నిగ్గుతేల్చే పనిలో గట్టిగా నిలిచారు. వివరాలు పరిశీలిస్తే కావలి రెండవ పట్టణ పరిధిలోని ఓ ప్రభుత్వ మున్సిపల్ పాఠశాలలో చదువుతున్న స్పర్శ జ్ఞానం లేని పసిబిడ్డలను అదే ప్రాంతంలో ఉంటూ బొరుగుల మిక్సర్ వ్యాపారి జ్ఞాన ప్రసాద్ అనే కామాంధుడు పాఠశాల వద్ద పిల్లలకు అమ్ముకుంటూ ఉన్నాడు. నిత్యం కామాంధుడు వాడి కోరికలకు కొంతమంది చిన్న బిడ్డలకు ఉచితంగా బొరుగుల మిక్సర్ ఇస్తూ, అప్పుడప్పుడు ఆ బిడ్డలకు డబ్బులు ఆశ చూపి ఇంటికి తీసుకువెళ్తూ వారితో కామవాంఛ తీర్చుకుంటూ పైశాచిక ఆనందం పొందుతూ కొనసాగుతుంది. అయితే ఆ విషయం ఎట్టకేలకు ఆ చిన్న బిడ్డలు వారి తల్లిదండ్రులకు తెలియజేస్తూ, అనంతరం పాఠశాల ఉపాధ్యాయుల సహకారంతో వెలుగులోకి వచ్చింది. అయితే సఖి సిబ్బంది పక్షాన దీటుగా నిలిచారు. అయితే ఈ కామాంధుడిని కాపాడేందుకు

మానవత్వం లేని వారి సామాజిక వర్గ నేతలు పలువురు చక్రంతిప్పి బాధిత కుటుంబాలను భయం గుప్పిట్లో ఉండేటట్లు చేశారు. మానవత్వం మరిచి ఈ బొరుగుల మిక్సర్ కామాంధుడిని కాపాడేందుకు అధికార పార్టీని సైతం అడ్డం పెట్టుకొని కాపాడాలనే ప్రయత్నాలు చేశారు. అయితే బాధిత పసిబిడ్డల తల్లిదండ్రులు న్యాయం జరుగుతుందో లేదో అనే భయంతో ఉన్నారు. కామందుడు వైపు వారు పెట్టిన భయానికి బాధిత బిడ్డల తల్లిదండ్రులు లొంగిపోయి వాస్తవికతను పక్కన పెట్టి వెనుతిరగాలని చూశారు. అయితే ఈ సమాచారం పత్రికల్లో రావడంతో నెల్లూరు సఖి సిబ్బంది అరంగేట్రం చేసి బాధిత కుటుంబాల తల్లిదండ్రులను కలిసి అలాగే పాఠశాల ఉపాధ్యాయులను కలిసి చిన్న బిడ్డలకు, తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. వారు సేకరించిన సమాచారం మేరకు కావలి రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ చేరుకొని సీఐ గిరిబాబు సమక్షంలో వాస్తవాలు వినిపించారు. స్పందించిన సీఐ గిరిబాబు సఖి సిబ్బంది ద్వారా బాధిత పసిబిడ్డల తల్లిదండ్రుల పక్షాన నిలబడి పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు. బాధిత ఇద్దరు చిన్నారులను కావలి ప్రభుత్వ వైద్యశాలకు మెడికల్ టెస్టుల కోసం సీఐ గిరిబాబు పంపించడం జరిగింది. ఈ రిపోర్టులు ఆధారంగా కేసు నడుస్తుందని కావలి ఉమెన్ ఫోర్స్ కన్వీనర్ శారదమ్మ పేర్కొన్నారు. అయితే ఐసిడిఎస్ పిడి బి హేనాసుజన్ స్పందించటం ద్వారానే సఖి సిబ్బంది కావలికి చేరుకొని అభద్రతా భావం లో ఉన్న తల్లిదండ్రులతో మాట్లాడి మీకు అండగా ఉంటాం, అని ధైర్యంగా ఉండండి అని భరోసా కల్పించి వారి పక్షాన నిలవడం జరిగింది. ఈ సందర్భంగా సఖి సిబ్బంది మాట్లాడుతూ మహిళలకు చిన్న బిడ్డలకు సమాజంలో భద్రత కరువైందని అవగాహన ఎంతైనా అవసరమని ఇలాంటి సందర్భాలు చోటు చేసుకున్నప్పుడు తమకు సమాచారం అందిస్తే అవగాహన కార్యక్రమాలు కల్పిస్తూ, బాధితుల పక్షాన నిలిచి న్యాయపోరాటం చేస్తామని వారు తెలిపారు. ఈ విషయమై కావలి రెండవ పట్టణ సీఐ సంయమనం పాటిస్తూ కేసును పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తుంది.

## అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ కడప జిల్లా కొత్త కమిటీ ఘనంగా ఏర్పాటు



**కడప, ఫిబ్రవరి 26, (వుదయం జిల్లా బ్యూరో)** ప్రతి ఏడాది ఒక మంచి పని అనే ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రేరణాత్మక సందేశాన్ని ప్రధాన లక్ష్యంగా తీసుకొని, అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ కడప జిల్లా కమిటీని ఘనంగా ఏర్పాటు చేసింది అని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు శివ శంకర్ ఆధ్వర్యంలో, కడప జిల్లా నూతన కమిటీ అధికారికంగా నియమించబడింది అని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కొరముట్ల రవితేజ బి. నవీన్ కుమార్ ఎస్. ముఖ్తాయర్ వై. కార్తీక్ పి. హర్ష వర్ధన్ బి. వంశీ వార ప్రసాద్ ఏ. మధు, ఉ.ఆహారున్ ఎస్. ఈనాయ్తుల ఎం. బాలాజీ టి. వంశీ ఎస్. మున్నా కొత్త కమిటీ ఏర్పాటుతో కడప జిల్లాలో అల్లు అర్జున్ అభిమాన శక్తి మరింత బలోపేతం కానుంది. అభిమానులను ఒకే వేదికపై సమన్వయం చేస్తూ, క్రమబద్ధమైన వ్యవస్థతో ముందుకు సాగాలని నిర్ణయించారు. ప్రతి ఏడాది ఒక మంచి పని అనే నినాదాన్ని ఆచరణలో పెట్టే దిశగా, కడప జిల్లా కమిటీ ప్రతి సంవత్సరం ఒక సామాజిక సేవా కార్యక్రమాన్ని నిర్వహించనుంది అని అన్నారు. సినిమా విడుదలల సందర్భంగా వేడుకలతో పాటు రక్తదాన శిబిరాలు, అవసరమైన వారికి సహాయం, విద్యా సహాయం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించబడతాయి. రాష్ట్ర అధ్యక్షులు శివ శంకర్ మాట్లాడుతూ అభిమానులు క్రమశిక్షణతో, సేవా భావంతో సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. కొత్తగా నియమితులైన కమిటీ సభ్యులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, వారి సేవలు విజయవంతం కావాలని కోరుకున్నారు.

## వెంకట్రావుపల్లిలో ఎస్టీలపై దౌర్జన్యం



**ఆత్మకూరు (వుదయం ప్రతినిధి) ఫిబ్రవరి 26వ తేదీ** ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని వెంకటరావుపల్లి ఎస్.టి కాలనీ నివాసులను కొంతమంది దళారులు ఎస్టీల ఇంటి నివాసాలను ఖాళీ చేయాలని చేయని యెడల మీ అంతు చూస్తామని బెదిరిస్తున్నారని ఎస్టీలు ఆవేదన వ్యక్తం చేశారు. వెంకట్రావు పల్లి ఎస్టీ కాలనీ ఆత్మకూరు బైపాస్ రోడ్డు కి సమీపంలో ఉండడంతో ఆ కాలనీలకు గిరాకీ ధరలు ఎక్కువ పలకడంతో దళారులంతా అక్కడున్న ఎస్టీల్ని ఏదో రకంగా నయానో భయానో భయపెట్టి ఆ కాలనీలను వచ్చిపరుచుకొని అక్కడున్న ఎస్టీల్ని పంపించేయాలన్న ఒక ఆలోచన దొరుకుద్దితో అక్కడ ఎస్టీల దగ్గర పోయి వాళ్లతో బేరసారాలు ఆడుతూ వారు మాట వినని వారిని మేము చెప్పినట్లు వినకపోతే మీ అంతు చూస్తామని, బెదిరించడంతో ఎస్టీలందరూ భయంతో ఈరోజు ఆత్మకూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ ను కలవడం జరిగింది .వాళ్లకు జరిగిన అన్యాయాన్ని ఆయనకు వివరిస్తూ మాకు అక్కడ ఉండడం భయంగా ఉన్నది దయచేసి మాకు రక్షణ కల్పించి ఈ దళారులను ఎవర్ని కూడా మా పరిసర ప్రాంతాలకు రాకుండా చూడాలని వారు ఎస్సైకు వినిపించడం జరిగింది. దానికి సమాధానంగా ఎస్ఐ మీయొక్క విన్నపము నేను పరిశీలిస్తాను అక్కడ మీ దగ్గరకు వచ్చి బెదిరించిన వారి యొక్క వివరాలు ఇవ్వండి మీకు నేను తగు న్యాయం చేస్తానని ఎస్సై జిల్లాని భాష వారికి హామీ ఇవ్వడం జరిగింది. అలాగే ఆత్మకూరు ఆర్డీవోకు కూడా ఎస్టీలు వాళ్లకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించి ఆమెకు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఆర్డీవో స్పందిస్తూ తగు న్యాయం చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. వీరికి సపోర్టుగా సిపిఎం నాయకులు ఆత్మకూరు నాగన్న, బహుజన సమాజ్ పార్టీ నాయకులు బసవ రాజు పాలెం బాబు ఎస్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఏఐటీయూసీ జిల్లా కమిటీలో వీఆర్ఏ సంఘ నేతల కు చోటు

జిల్లా సమితి సభ్యులుగా కోడూరు పుల్లయ్య, పాణ్యం చెన్నయ్య ఎన్నిక



**కడప, ఫిబ్రవరి 26, (వుదయం జిల్లా బ్యూరో)** ఏఐటీయూసీ కడప జిల్లా సమితి లో గ్రామ రెవిన్యూ సహాయకుల సంఘం నేతలకు చోటు దక్కింది. ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యులు గా కోడూరు పుల్లయ్య ను పాణ్యం చెన్నయ్య ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు జిల్లా లో కార్మికుల సమస్య ల పరిష్కారం కోసం కృషి చేస్తామని అన్నారు.వీ ఆర్ ఏ లు చాలా సమస్యలతో సతమతం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేసినారు. వీ ఆర్ ఏ ల సమస్య లపై ఏఐటీయూసీ జిల్లా కమిటీలో చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.మా ఎన్నికకు సహకరించిన జిల్లా మరియు రాష్ట్ర నాయకత్వం కు కృతజ్ఞతలు తెలిపారు.

## 28న జాతీయ సైన్సు దినోత్సవ వేడుకలు

**ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 26, (వుదయం జిల్లా బ్యూరో)** సర్ సి.వి. రామన్ సైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక శ్రీ కృష్ణ గీతాశ్రమం లోని వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్సు దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నామని సైన్స్ క్లబ్ ప్రొద్దుటూరు ప్రెసిడెంట్ వంశీకృష్ణ, జనరల్ సెక్రటరి అల్లా బకష్, జిల్లా కన్వీనర్ విజయ మోహన్ రెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 9–30 గంటలకు ప్రారంభ సమావేశం, ప్రతిభా పరీక్ష నిర్వహణ, మధ్యాహ్నం 2–30కు బహుమతుల ప్రధానోత్సవం నిర్వహిస్తున్నామని వివరించారు. కార్యక్రమానికి సభాధ్యక్షులుగా చాపాడు ఎంఈఓ 2 వంశీకృష్ణ, డి ఈ ఓ షంషోద్దీన్, ప్రొద్దుటూరు ఉపవిద్యాశాఖాధికారి మీనాక్షి, కడప ఉపవిద్యాశాఖాధికారి రాజగోపాల్ రెడ్డి, ముఖ్య అతిథులుగా వెంకటేశ్వర డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ హరినారాయణ, ప్రొద్దుటూరు ఎంఈఓలు సావిత్రమ్మ, శోభారాణి పాల్గొంటారని తెలిపారు. కావున ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని సూచించారు.

## కరప్షన్ కింగ్" ప్రధాని మోడీ కుతంత్రం... న్యాయవ్యవస్థ పై "అవినీతి పాఠం

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ ధ్వజం



**కడప, ఫిబ్రవరి 26, (వుదయం జిల్లా బ్యూరో)** భారత దేశ అత్యున్నత న్యాయవ్యవస్థ పై అవినీతి పాఠ్యాంశంగా 8 వ తరగతి సాంఘిక శాస్త్రంలో ప్రవేశపెట్టిన ప్రధాని నరేంద్ర మోడీ పై కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ ధ్వజమెత్తారు. కరప్షన్ కింగ్ గా చరిత్రకెక్కిన నరేంద్ర మోడీ తన అవినీతి పరిపాలన ఏ స్థాయిలో దేశాన్ని దిగజార్చిందో ముందుగా చూసుకోవాలని విమర్శించారు. కడపలోని తన కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇది కేవలం కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సంయుక్తంగా కలిసి దేశ న్యాయవ్యవస్థ పై చేస్తున్న దాడిగా ఆయన అభివర్ణించారు. డాలర్ కు ప్రతిగా రూపాయి పూర్తిస్థాయి పతనంతో దేశంలో ఆర్థిక ఎమర్జెన్సీ కొనసాగుతున్న దుర్గతిని తెలుసుకోవాలన్నారు. న్యాయాధికారులు,న్యాయవ్యవస్థ, న్యాయస్థానాలను కబళించేందుకు ప్రధాని నరేంద్ర మోడీ చేసిన కుతంత్రంగా ఆరోపించారు. జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి ద్వారా న్యాయవ్యవస్థపై ఈ విధమైన కక్ష తీర్చుకునేందుకు ప్రయత్నించడం దేశద్రోహమేనన్నారు. సుమారు 12 ఏళ్ల అవినీతి, మతవిద్వేషం, వైఫల్యం అత్యాచారాలు ఘోరాలు, నేరాలు, దౌర్జన్యాలు, ఆగడాలు, హత్యల తో దేశ ప్రతిష్టను దిగజార్చిన నరేంద్ర మోడీ వాటి నుండి బయటపడేందుకు చేసిన పన్నాగమన్నారు. న్యాయస్థానాలను పై బెదిరింపు, దాడికి దిగడం దిగడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం స్వయంగా ఈ రాజ ద్రోహానికి పాల్పడటం శోచనీయమన్నారు భారత రాజ్యాంగంలోని కీలక సౌధాన్ని ప్రజల దృష్టిలో భంగపరిచేందుకు మోడీ కుట్ర చేశాడన్నారు. గతంలో ఇదే కేంద్ర విద్యా పరిశోధనా శిక్షణ మండలి ముస్లింలే లక్ష్యంగా మొగలుల చరిత్రను పాఠ్యాంశాల నుంచి తొలగించారన్నారు. ప్రస్తుతం అసాంఘిక, అరాచక, చట్ట విరుద్ధమైన ఆర్ఎస్ఎస్ ను కీర్తిస్తూ పాఠ్యాంశాలు చేయడం ఘోరమన్నారు. దేశ స్వాతంత్రం పురుగులు సమరయోధులకు వెన్నుపోటు పొడిచిన ఆర్ఎస్ఎస్ నాయకులను స్వాతంత్ర్య యోధులుగా కీర్తిస్తూ పాఠ్యపుస్తకాల్లో చేర్చడం వంటి నేరాలకు పాల్పడిన ప్రధాని నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్ షా, ఎన్డీఏ ప్రభుత్వం రాజ ద్రోహం నేరాలు కేసులు మోపి విచారించాలని సుప్రీంకోర్టును కోరారు. న్యాయవ్యవస్థలో అవినీతిని పాఠ్యాంశముగా చేర్చి దేశద్రోహానికి పాల్పడ్డా నరేంద్ర మోడీ హోం మంత్రి అమిత్ షా ఎన్సీఈఆర్టీ చైర్మన్ ఇతర బాధ్యులపై ముందుగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం స్వయంగా ఈ కేసును నమోదు చేయడం తదుపరిదీనిపై సీజేఐ చేసిన హెచ్చరికలు ఎన్డీఏ ప్రభుత్వ సారథి ప్రధాని నరేంద్ర మోడీకి సిగ్గుచేటన్నారు. దేశాన్ని, భారత రాజ్యాంగాన్ని, రాజ్యాంగ వ్యవస్థలను పూర్తిగా ధ్వంసం చేసిన నరేంద్ర మోడీకి కఠిన దండన అవసరమన్నారు. ఇప్పటికైనా ప్రజలు కళ్ళు తెరవాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మయానా రహమతుల్లా ఖాన్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ ప్రతినిధులు హమీద్, ఆబిద్, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమల్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూతులపాటి భౌతిక కాయానికి ఎంపీ కేశినేని శివనాథ్ నివాళి

నూతులపాటి మరణం టీడీపీకి తీరని లోటు : ఎంపీ కేశినేని శివనాథ్



**విజయవాడ ఫిబ్రవరి 25 వుదయం న్యూస్ బ్యూరో:** తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి , టి.ఎన్.ఎస్.ఎఫ్ ఉమ్మడి కృష్ణా జిల్లా మాజీ అధ్యక్షుడు నూతులపాటి నాగభూషణం భౌతిక కాయానికి ఎంపీ కేశినేని శివనాథ్ టిడిపి నాయకులతో కలిసి నివాళులర్పించారు. పటమటలంక లోని బృందావన్ అపార్ట్మెంట్స్ లో నూతులపాటి నాగభూషణం భౌతిక కాయానికి గురువారం ఉదయం ఎంపీ కేశినేని శివనాథ్ సందర్శించి ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. వారి కుటుంబ సభ్యులకి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నాగభూషణం పార్టీ కి చేసిన సేవలను గుర్తు చేశారు. పార్టీ అండగా వుంటుందని కుటుంబ సభ్యులకి భరోసా ఇచ్చారు. నూతులపాటి నాగభూషణంకు నివాళులర్పించిన వారిలో ఏపీ బిల్డింగ్ అదర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ సజ్జా అజేయ్, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, టి.ఎన్.టి.యు.సి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్, టి.ఎన్.ఎస్.ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చరణ్ సాయి లతో పాటు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## ప్రశ్నించని సమాజం ఎప్పటికీ పురోగమించలేదు

జనవిజ్ఞాన వేదిక



**కావలి, ఫిబ్రవరి 26, వుదయం న్యూస్:** జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో సైన్స్ వారోత్సవాలలో భాగంగా వరుసగా 6వ రోజు విద్యార్థుల కోసం బృహత్తర సైన్స్ ఎగ్జిబిషన్ (వైజ్ఞానిక ప్రదర్శన) నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన కావలి పట్టణ ప్రముఖ వైద్యనిపుణులు , జె.వి.వి. గౌరవాధ్యక్షులు డాక్టర్ బెజవాడ. రవికుమార్ మాట్లాడుతూ కావలి పట్టణంలోని వివిధ పాఠశాలల నుండి పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని తమ మేధస్సుకు పదును పెట్టారని, పర్యావరణ పరిరక్షణ, సౌరశక్తి వినియోగం, వ్యర్థాల నిర్వహణ మరియు ఆధునిక సాంకేతికతపై విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయన్నారు. న్యాయ నిర్ణేతలైన ప్రముఖ వైద్యనిపుణులు డాక్టర్ రేవంత్ కుమార్, డాక్టర్ లక్ష్మి , డాక్టర్ బత్తుల నరేంద్ర, డాక్టర్ గొట్టిపాటి. మాలినిదేవి విద్యార్థుల ప్రయోగాత్మక ఆలోచనలను అడిగి తెలుసుకుని వారికి తగిన సలహాలు అందజేశారు. జీవివి అధ్యక్షులు మాట్లాడుతూ నేటి సమాజంలో సాంకేతికత ఎంత పెరిగిన ఇంకా కొన్ని మూఢనమ్మకాలు మనల్ని పట్టిపీడిస్తున్నాయని, "ప్రశ్నించని సమాజం ఎప్పటికీ పురోగమించలేదని" ప్రతి విద్యార్థి ఒక పరిశోధకుడిగా ఆలోచించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కావలి పట్టణ జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి గాదిరెడ్డి. హరినాథ్, ఉపాధ్యక్షులు కందికట్టు. నారాయణ, సి.కల్లయ్య, శ్రీకర్ల. వెంకయ్య, కార్యదర్శి సి. శారద, కార్యవర్గ సభ్యులు ప్రసాదరావు, పెంచలనరసారెడ్డి, రజని పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## కాటంరెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపిన మాజీ ముఖ్యమంత్రి జగన్

**కావలి, ఫిబ్రవరి 26, వుదయం న్యూస్:** నెల్లూరు పర్యటనకు విచ్చేసిన వైఎస్ఆర్సిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కావలి జరిగిన కార్యకర్తల సమావేశం విజయవంత అవడం పట్ల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సెంట్రల్ సీఈసీ సభ్యులు మాజీ శాసనసభ్యులు కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు అని తెలిసింది. మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి తో ప్రత్యేకంగా పది నిమిషాలు చర్చించడం రాజకీయాల్లో చర్చగా మారింది అని తెలిసింది.

## రాబోయే కాలంలో లెజిస్టేటివ్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ జరగాలని ఎంపీ కేశినేని శివనాథ్ ఆకాంక్ష



- ఏపీ స్టేట్ లెజిస్లేటివ్ స్పోర్ట్స్ మీట్ – 2026 కి ముఖ్య అతిథిగా హాజరు
- స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఆలోచన ఎంపీ కేశినేని శివనాథ్ ప్రశంసలు
- లెజిస్లేటివ్ సౌత్ ఇండియా ప్రీమియర్ లీగ్‌కు స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఆలోచన
- వైజాగ్ స్టేడియంలో ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహిస్తామన్న ఎంపీ కేశినేని శివనాథ్

**విజయవాడ ఫిబ్రవరి 25 వుదయం న్యూస్ బ్యూరో :– :** సౌత్ ఇండియన్ లెజిస్లేటివ్ కౌన్సిల్, అసెంబ్లీ ఎమ్మెల్యేలతో క్రికెట్ పోటీలు నిర్వహించాలనే స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఆలోచనను ఎంపీ కేశినేని శివనాథ్ ప్రశంసించారు. స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఆలోచన రాబోయే కాలంలో లెజిస్టేటివ్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ కు పునాది కావాలని ఆకాంక్షించారు. ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న ఏపీ స్టేట్ లేజిస్టేటివ్ స్పోర్ట్స్ మీట్ –2026 కి ఎంపీ కేశినేని శివనాథ్ గురువారం హాజరై క్రీడలు ఆడుతున్న ప్రజాప్రతినిధులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ రాబోయే ఏడాది లెజిస్లేటివ్ సౌత్ ఇండియా ప్రీమియర్ లీగ్ కు వైజాగ్ స్టేడియం వేదిక కాబోతున్నందుకు ఆనందంగా వుందన్నారు. వీటిని ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఈ స్పోర్ట్స్ మీట్ ప్రజాప్రతినిధుల మధ్య ఐక్యత, ఫిట్‌నెస్, క్రీడా స్ఫూర్తి పెంపొందిస్తుందన్నారు. ప్రజా ప్రతినిధులు తమ నియోజవర్గ బాధ్యతలతో పాటు , స్పోర్ట్స్‌లో కూడా యాక్టివ్ గా పాల్గొనటాన్ని అభినందించారు. ఆల్ రౌండర్ ప్రతిభ చూపుతున్న హోం మంత్రి అనిత ను ప్రత్యేకంగా కొనియాడారు. అలాగే ఇప్పటి కి ఫిట్ నెస్ తో వుంటూ యువకులలా కనిపించే ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోడే ప్రసాద్ లను అభినందించారు. స్టేడియం అంతా తిరిగి ప్రజాప్రతినిధులను అప్యాయంగా ఎంపీ కేశినేని శివనాథ్ పలకరించారు.



## పిల్లలకు పలకలు, బలపాలు పంపిణీ



**కడప, ఫిబ్రవరి 26, (వుదయం జిల్లా బ్యూరో)** కడప నగరంలోని 15వ డివిజన్ శివానంద పురం కాలనీలో ఉండే అంగన్వాడి స్కూళ్లను డివిజన్ ఇంచార్జి కొండా సుబ్బయ్య సందర్శించి అక్కడి పిల్లల పూషికాహారం మరి అక్కడ ఏమన్నా సమస్యలు ఉన్నాయని అడిగి తెలుసుకుని పిల్లల ఆటపాటలు చూసి వారిని అభినందించిన విషయాలు కొన్ని సోషల్ మీడియాలో ద్వారా చూసిన మునిస్వామి అను ఒక మాజీ సర్పంచ్ మనసున్న వారు నాకు ఫోన్ చేసి అన్న నేను కూడా ఆ పిల్లలకు నా వంతు బాధ్యతగా అక్కడ ఉన్న పిల్లలకు పలకలు బలపాలు మీ చేతుల మీదుగా నేను అందిస్తాను అని చెప్పి ఈ రోజు నన్ను అక్కడికి పిలిపించి అక్కడ ఉన్న పిల్లలందరికీ పలకలు బలపాలు పంచి పెట్టడం జరిగింది. పిల్లలందరూ ఆనందంతో కేకలు వేసి మేము బాగా చదువుకుంటాము అని వారి పేర్లు చెప్పి నమస్కారాలు తెలియజేశారు. అక్కడ ఉన్న టీచర్ ఇందిరా అభినందనలు తెలియజేశారు.

## అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించిన సర్పంచ్ ఆదిలక్ష్మి

**మధిర ఫిబ్రవరి 26, వుదయం ప్రతినిధి** తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు,గ్రామ సర్పంచ్ చేకూరి ఆదిలక్ష్మి ఎస్సీ కాలనీలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా ఆమె అక్కడ పిల్లలకు అందిస్తున్న ఆహార నాణ్యతను మరియు మరుగుదొడ్ల నిర్వహణను పారిశుధ్యాన్ని తనిఖీ చేశారు.పిల్లలకు, గర్భిణీలకు అందిస్తున్న పౌష్టికాహారం , బాలామృతం పంపిణీ సక్రమంగా జరుగుతుందో లేదో రిజిస్టర్లను తనిఖీ చేశారు. నర్సరీని సందర్శిం చి, హరిత హారం కోసం సిద్ధం చేస్తున్న మొక్కల స్థితిగతులను తెలుసుకున్నారు.

## ఆత్మకూరు లో అన్నా క్యాంటీన్ పరిశీలించిన మున్సిపల్ కమిషనర్



**ఆత్మకూరు (వుదయం ప్రతినిధి) ఫిబ్రవరి 26వ తేదీ** ఆత్మకూరు మున్సిపల్ బస్టాండ్ లో ఉన్న అన్న క్యాంటీన్ ను మున్సిపాలిటీ కమిషనర్ గంగా ప్రసాద్ పరిశీలించడం జరిగింది.అన్న క్యాంటీన్ లో ఉదయం అల్పాహారం అందుతున్న తీరును పరిశీలించి క్యాంటీన్ లో అందుతున్న ఆహార పదార్థాల నాణ్యత పై తింటున్న వారిని అడిగి తెలుసుకున్నారు.. అలాగే నిర్వాహకులతో మాట్లాడి ఎటువంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు.. ఈ కార్యక్రమంలో వీరితోపాటు పట్టణ బిజెపి అధ్యక్షులు నున్న.సంతోష్ కుమార్, టిడిపి నేత చిన్నపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైద్యులు మానవతా దృక్పథంతో వైద్య సేవలందించాలి



**తెల్ల కోటు బాధ్యతకు 'సింబల్'**

**నల్లగొండ మెడికల్ కళాశాలను రాష్ట్రంలో ఉత్తమమైన కళాశాలగా తీర్చిదిద్దుతాం**

**ప్రతి పేద విద్యార్థికి సహకారం అందిస్తాను**

**రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**





**నల్లగొండ, ఫిబ్రవరి 26 (వుదయం జిల్లా ప్రతినిధి) :**

వైద్యులు మానవతా దృక్పథంతో పేదలకు వైద్య సేవలందించాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోరారు. గురువారం నల్లగొండ ప్రభుత్వ వైద్య కళాశాలలో "అద్వితీ 2026" పేరున నిర్వహించిన నల్లగొండ ప్రభుత్వ వైద్య కళాశాల వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అన్ని వృత్తుల కన్నా వైద్య వృత్తి పవిత్రమైనదన్నారు. నల్లగొండ ప్రభుత్వ వైద్య కళాశాల అన్ని ఆధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేయబడిందని, వైద్య కళాశాలలో చదివే విద్యార్థులు సబ్జెక్టులతో పాటు, మానవత్వాన్ని కూడా నేర్చుకోవాలని, తెల్ల కోటు బాధ్యతకు "సింబల్ "అని అన్నారు. కళాశాలలో ఏవైనా సమస్యలు ఉంటే తీర్చేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, వైద్య కళాశాల విద్యార్థుల కోసం రెండు ఏసీ బస్సులను మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. నెలలోపు వీటిని మంజూరు చేస్తామన్నారు. ఇటీవలే ఏఐజి ఆసుపత్రి డాక్టర్ నాగేశ్వరరెడ్డిని ప్రభుత్వ వైద్య కళాశాలకు తీసుకువచ్చామని, నల్లగొండ ప్రభుత్వ వైద్య కళాశాలలో చదివిన పిజి విద్యార్థులను పరిశోధన నిమిత్తం తన ఆసుపత్రిలో ప్రతి సంవత్సరం 45 మంది చొప్పున తీసుకునేందుకు అంగీకరించారని, ఇందుకు సంబంధించిన ఎంఓయూను త్వరలోనే కుదుర్చుకోనున్నట్లు ఆయన వెల్లడించారు. నల్లగొండ పట్టణంలో వైద్య విద్యనే కాకుండా, చదువుకోసం ప్రతి పేద విద్యార్థికి సహకారం అందిస్తామని, ఇందుకు తమను సంప్రదించాలని, విద్యాభివృద్ధిలో భాగంగా బొట్టుగూడా ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలను, అలాగే ప్రతిక్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేశామని, పట్టణంలోని మరికొన్ని పాఠశాలలను కార్పొరేట్ తరహాలో తీర్చిదిద్దుతామని, రూ.900 కోట్లతో అవుటర్ రింగ్ రోడ్డు నిర్మిస్తున్నామని, రాబోయే రోజుల్లో నల్లగొండను స్మార్ట్ సిటీగా, మోడల్ సిటీగా చేస్తామని తెలిపారు.నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కాబోయే డాక్టర్లు గ్రామాలలో పేద ప్రజలకు సేవలు అందించాలని కోరారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ మాట్లాడుతూ డాక్టర్ వత్తి పవిత్రమైందని, రోగులను చిరునవ్వుతో పలకరించి వారికి వైద్యం చేయాలని సూచించారు. కార్యక్రమానికి డిప్యూటీ మేయర్ అమీర్ అశ్రఫ్ అలీ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యనారాయణ, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి గుమ్మల మోహన్‌రెడ్డి, డాక్టర్లు ఆయా వైద్య విభాగాల అధిపతులు, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మేయర్లు వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు.



## టెక్స్ టైల్ పార్క్ లో మౌలిక సదుపాయాలు
# వెంటనే కల్పించాలి

- **జిల్లా కలెక్టర్ సత్య శారద అధికారులకు ఆదేశాలు**

**గీసుగొండ, ఫిబ్రవరి 26 (వుదయం ప్రతినిధి) :**

వరంగల్ జిల్లా గీసుకొండ మండలం శాయంపేట హవేలీలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం పలు శాఖల అధికారులతో కలిసి సందర్శించి, పార్క్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పార్క్‌లో రహదారుల నిర్మాణం, రైల్వే ఓవర్ బ్రిడ్జ్, బ్రిడ్జ్ పనులు, గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే నుండి టెక్స్‌టైల్ పార్క్‌కు రహదారి మార్గం ఏర్పాటు, విద్యుత్ సరఫరా, తాగునీటి వసతి తదితర మౌలిక సదుపాయాల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. పనుల నాణ్యత, వేగం, సమయపాలనపై ప్రత్యేకంగా దృష్టి సారించిన కలెక్టర్, పెండింగ్‌లో ఉన్న పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పార్క్ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తైతే పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణం ఏర్పడి, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి మౌలిక సదుపాయాల అభివృద్ధిని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖల అధికారులు తమ తమ పరిధిలో జరుగుతున్న పనుల వివరాలను కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో సుమ, జిల్లా పరిశ్రమల మేనేజర్ స్వామి, ఆర్ బి శాఖ అధికారులు, నేషనల్ హైవేస్ అథారిటీ ప్రతినిధులు, తహసీల్దార్లు రాజ్‌కుమార్, రియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## మార్చి 25 లోగా బెస్ట్ అవైలబుల్ స్కూల్స్
# ఎంపికకు దరఖాస్తు చేసుకోవాలి

- **జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎం.రవీందర్**

**పెద్దపల్లి, ఫిబ్రవరి 26 (వుదయం ప్రతినిధి) :**

మార్చి 25 లోగా బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ఎంపిక కొరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎం.రవీందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లాల్లోని బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌కి రెసిడెన్షియల్ అండ్ నాన్ రెసిడెన్షియల్ పథకంలో భాగంగా ఉత్తమ పాఠశాలలను ఎంపిక చేయడానికి పెద్దపల్లి జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి తెలిపారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌కి రెసిడెన్షియల్ పథకంలోని విద్యార్థులకు ట్యూషన్, హాస్టల్ వసతి, భోజనంతో పాటు రెండు జతల దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలకు గాను విద్యార్థికి 42 వేల చొప్పున, నాన్ రెసిడెన్షియల్ పథకంలోని విద్యార్థులకు ట్యూషన్ తో పాటు రెండు జతల దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలకు గాను ప్రతీ విద్యార్థికి 28 వేల చొప్పున అందిస్తామని ఆయన తెలిపారు. దరఖాస్తు ఫారముల కొరకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయం పెద్దపల్లి యందు సంప్రదించాలని, పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను మార్చి 25 లోగా కార్యాలయంలో అందించాలని, ఈ అవకాశాన్ని జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## ఇంటర్ రెండవ సంవత్సర
# మొదటి పరీక్ష ప్రశాంతం

- **ఇంటర్మీడియట్ జిల్లా అధికారి కల్పన**

**పెద్దపల్లి, ఫిబ్రవరి 26 (వుదయం ప్రతినిధి) :**

జిల్లాలో ఇంటర్ రెండవ సంవత్సరం మొదటి పరీక్ష గురువారం ప్రశాంతంగా జరుగుతున్నాయి. ఇంటర్ రెండవ సంవత్సరం తెలుగు, హిందీ, ఉర్దూ భాష పరీక్షలు జరిగాయని, ఈ పరీక్షకు (4815) మంది హాజరు కావాల్సి ఉండగా, (4731)మంది హాజరు కాగా,(74) మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు. గురువారం 98 శాతం హాజరు నమోదు అయ్యిందని, పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఇంటర్మీడియట్ జిల్లా అధికారి కల్పన ఒక ప్రకటనలో తెలిపారు.

# ఇంటర్ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

**కామారెడ్డి, ఫిబ్రవరి 26 (వుదయం ప్రతినిధి) :**






జిల్లాలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను ప్రశాంతంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని ముందస్తు భద్రతా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా కామారెడ్డి పట్టణంలోని శ్రీ ఆర్యభట్ట జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని గురువారం జిల్లా ఎస్పీ ఎం.రాజేష్ చంద్ర సందర్శించి, భద్రతా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. పరీక్ష కేంద్రం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందితో మాట్లాడి, బందోబస్తు విషయంలో ఏమాత్రం అజాగ్రత్త వహించరాదని పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాలను సంబంధిత అధికారులు నిరంతరం సందర్శిస్తూ, నిశితంగా పర్యవేక్షిస్తారని ఆయన పేర్కొన్నారు. పరీక్షలు ముగిసే వరకు అంటే తేదీ 18032026 వరకు పరీక్షా కేంద్రాల పరిసరాల్లో 163 బిఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలులో ఉంటుందని, అక్కడ ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమికూడటం నిషిద్ధమని స్పష్టం చేశారు. అలాగే కేంద్రాల వద్ద నిషేధిత వస్తువులతో తిరగడం పూర్తిగా నిషేధించబడినట్లు హెచ్చరించారు. ముఖ్యంగా పరీక్షలు జరిగే రోజుల్లో ఉదయం 08:00 గంటల నుంచి మధ్యాహ్నం 01:00 గంటల వరకు పరీక్షా కేంద్రాల నుంచి 200 మీటర్ల పరిధిలోని అన్ని జిరాక్స్ కేంద్రాలను తప్పనిసరిగా మూసి వేయాలని ఆయన ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా అందరూ సహకరించాలని కోరారు.

# అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

- **కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**పెద్దపల్లి, ఫిబ్రవరి 26 (వుదయం ప్రతినిధి) :**



జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ కుటుంబ ప్రయోజనం పథకం (ఎన్ఎఫ్‌బీఎస్) లో అర్హులైన వారు పంచాయతీ కార్యదర్శి, ఎంపిడిఓ కార్యాలయం, తహసిల్దార్ కార్యాలయం లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. బిపిఎల్ కుటుంబాలలో కుటుంబాన్ని పోషించే ప్రధాన వ్యక్తి 18 నుంచి 60 సంవత్సరాల వయసు గలవారు మరణిస్తే వారు కుటుంబానికి ఈ పథకం కింద రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తామని కలెక్టర్ వెల్లడించారు. ఈ పథకానికి సంబంధించి మరణించిన వ్యక్తి కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఎటువంటి ఇతర ఆర్థిక సహాయాలు అందకుండా ఉండాలని, అప్పుడే ఈ పథకం అమలు అవుతుందని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## హనుమకొండ కలెక్టర్‌గా
# చాహత్ బాజ్ పాయ్ బాధ్యతల స్వీకరణ

**హనుమకొండ, ఫిబ్రవరి 26 (వుదయం జిల్లా ప్రతినిధి) :**



హనుమకొండ జిల్లా నూతన కలెక్టర్‌గా చాహత్ బాజ్ పాయ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చాహత్ బాజ్ పాయ్‌ను కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.రవి, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్, ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కన్నం నారాయణ, పలువురు జిల్లా అధికారులు, తహసిల్దార్లు నూతన కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. బాధ్యతలు స్వీకరించేందుకు కలెక్టరేట్ ప్రాంగణానికి చేరుకున్న జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్‌కి అదనపు కలెక్టర్, అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. జిల్లా కలెక్టర్‌గా కలెక్టర్ ఛాంబర్ లో బాధ్యతలు స్వీకరించారు. హనుమకొండ జిల్లా కలెక్టర్‌గా పని చేసిన స్నేహ శబరిష్ బదిలీపై మహబూబాబాద్ జిల్లాకు కలెక్టర్‌గా వెళ్ళగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా ఉన్న చాహత్ బాజ్ పాయ్ హనుమకొండ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

# అవగాహనతోనే రోడ్డు ప్రమాదాలకు చెక్



**'డిఫెన్సివ్ డ్రైవింగ్' పద్ధతిని ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలి**

**కరీంనగర్ సీపీ గౌష్ ఆలం**



**కరీంనగర్, ఫిబ్రవరి 26 (వుదయం ప్రతినిధి) :**



రోడ్డు ప్రమాదాల నివారణ కేవలం పోలీసుల చర్యలు మాత్రమే కాదని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండి, వాటిని బాధ్యతాయుతంగా పాటించినప్పుడే ప్రమాద రహిత సమాజం సాధ్యమవుతుందని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అన్నారు. రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమంలో భాగంగా గురువారం సింగపూర్ కిట్స్ కళాశాలనందు ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన 'అరైవ్ అలైవ్' అవగాహనా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి సీపీ ప్రసంగిస్తూ కీలక అంశాలను వెల్లడించారు. ప్రాణనష్టానికి అతివేగం , నిర్లక్ష్యం, మానవ తప్పిదాలే కారణమని, గత ఏడాది కమిషనరేట్ వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల వల్ల 200 మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని సీపీ అన్నారు. ఇందులో ఎక్కువ శాతం ప్రమాదాలు సీట్ బెల్టు ధరించకపోవడం, హెల్మెట్ లేకపోవడం, అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం వంటి మానవ తప్పిదాల వల్లే జరిగాయని తెలిపారు. ప్రమాదాల్లో మరణించిన వారిలో 85 శాతం మంది పురుషులు ఉండటం గమనార్హమని, అందులోనూ ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులే ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్ నుంచి హైదరాబాద్, వరంగల్, జగిత్యాల, సిరిసిల్ల, చొప్పదండి వెళ్లే ప్రధాన రహదారుల్లో ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉన్న 'బ్లాక్ స్పాట్లను' గుర్తించామని సీపీ తెలిపారు. అక్కడ ప్రత్యేక నిఘాతో పాటు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగా హుజురాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో లింగాపూర్ క్రాస్ రోడ్డు వద్ద ఉన్న బ్లాక్ స్పాట్ వద్ద అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నందున రెండు రోడ్ సేఫ్టీ సైన్ బోర్డు ఏర్పాటు చేసారు. రాష్ట్ర డీజీపీ ప్రారంభించిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేస్తున్నామని, పరిసరాలను గమనిస్తూ వాహనం నడిపే 'డిఫెన్సివ్ డ్రైవింగ్' పద్ధతిని ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని సూచించారు.అంతేకాకుండా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులందరితో రోడ్డు భద్రత నియమాలను పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పోలీసులకు సహకరించి, వారితో పాటు ఎన్నికల విధులు నిర్వహించినందుకుగాను ఎన్‌సిసి క్యాడెట్లకు ప్రశంసా పత్రాలను సీపీ చేతుల మీదుగా అందించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ శాఖ సమన్వయంతో పోలీసుల తరుపున లైసెన్స్ దరఖాస్తు చేయించామని వారికి లెర్నింగ్ లైసెన్స్ కూడా అందజేశామన్నారు. కార్యక్రమంలో హుజురాబాద్ మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వేణు , హుజురాబాద్ ఏసీపీ మాధవి, హుజురాబాద్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, వెంకట్, లక్ష్మీ నారాయణ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శంకర్, ఎస్సైలు శేఖర్‌రెడ్డి , స్వాతి, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



## నేర పరిశోధనలో
# జాగిలాల పాత్ర కీలకం

**పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్**

**వరంగల్ కమిషనరేట్‌లో నూతనంగా చేరిన భైరవ్, విరాత్ జాగిలాలు**

**ఎనిమిది నెలలు శిక్షణ కాలాన్ని పూర్తి చేసిన జాగిలాలు**

**శిక్షణలో ఉత్తమ ప్రతిభ కబనబరిచిన 'భైరవ్'కు బంగారు పతకం**

**వరంగల్ క్రైం, ఫిబ్రవరి 26 (వుదయం ప్రతినిధి) :**

నేర పరిశోధనలో పోలీస్ జాగిలాలు కీలకంగా నిలుస్తాయని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలియజేశారు. మొయినాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెన్స్ ట్రైనింగ్ అకాడమీలో ఎనిమిది నెలలు శిక్షణ పూర్తి చేసుకున్న బీగల్ జాతి చెందిన భైరవ్, విరాట్ జాగిలాలు వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు తమ సేవలందించేందుకు నూతనంగా విధుల్లోకి చేరిన నూతన పోలీస్ జాగిలాలను వరంగల్ పోలీస్ కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ పోలీస్ జాగిలాల హ్యాండ్లర్లు కుమార స్వామి (భైరవ్ హ్యాండ్లర్), సాంబయ్య (విరాట్ హ్యాండ్లర్)లను జాగిలాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం శిక్షణ కాలంలో జాగిలాలకు నిర్వహించిన క్లిష్టతరమైన పరీక్షల్లో ఉత్తమంగా నిలిచి గోల్డ్ మెడల్ సాధించిన భైరవ్ జాగిలానికి సిపి మెడల్ అలంకరించి హ్యాంగ్లర్లను పోలీస్ కమిషనర్ అభినందించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. ఈ నూతన జాగిలాలు పేలుడు పదార్థాలను సులభంగా పసిగడితాయని. ఈ శునకాలు చూడటానికి చిన్న అకారంలో వున్న పెద్ద జాగిలాలు వెళ్ళలేని ప్రదేశాలు, మార్గాల్లో ఈ జాగిలాలు వెళ్ళి పేలుడు పదార్థాలను గుర్తుస్తాయని, ముఖ్యంగా విమానాల్లో ప్రయాణికుల సామాను భద్రపర్చే క్యాబిన్లల్లో కార్ల క్రిందకు వెళ్ళి పేలుడు పదార్థాలను గుర్తించడం ఈ జాగిలాల ప్రత్యేకతని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. ముఖ్యంగా ఈ పోలీస్ జాగిలాల ద్వారా గతంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎన్నో కేసుల్లో నిందితులను గుర్తించడంతో పాటు మత్తు పదార్థాలను గుర్తించడం జరిగిందని పోలీస్ కమిషనర్ తెలియజేశారు. కార్యక్రమంలో అదనపు డిసిపిలు శ్రీనివాస్, రవి, ఏసిపి సురేంద్ర, ఆపరేషన్స్ అర్ఐ సింహచలం శ్రీనివాస్, డాగ్ స్క్వాడ్ ఇన్‌చార్జ్ ప్రభాకర్ పాల్గొన్నారు.



## పట్టుదలతో ప్రయత్నిస్తే
# ఏ రంగంలోనైనా విజయం సాధ్యం

- **కలెక్టర్ ఆదర్శ్ సురభి**
- **సీఎం కప్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో విజయంపై అభినందనలు**

**వనపర్తి, ఫిబ్రవరి 26 (వుదయం ప్రతినిధి) :**

క్రీడాకారులు క్రమశిక్షణ, పట్టుదలతో సాధన చేస్తే మరింత ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ సీఎం కప్ 2వ ఎడిషన్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో వనపర్తి జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా విజేత జట్టు సభ్యులు గురువారం కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జట్టు సభ్యులను అభినందించి, రాష్ట్ర స్థాయిలో విజయం సాధించడం వనపర్తి జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. క్రీడాకారులు క్రమశిక్షణ, పట్టుదలతో సాధన చేస్తే మరింత ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సూచించారు. కబడ్డీ క్రీడాభివృద్ధికి అవసరమైన సదుపాయాల కల్పనలో జిల్లా పరిపాలన తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో జాతీయ స్థాయిలోనూ రాణించేందుకు అవసరమైన ప్రోత్సాహం, మార్గదర్శకత్వం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కాగా గతేడాది మూలమల్ల కబడ్డీ బృందానికి రూ.3.50 లక్షలతో కలెక్టర్ తన నిధుల నుంచి మ్యాట్ ఇప్పించిన విషయం తెలిసిందే.జట్టు సభ్యులు మాట్లాడుతూ.. గత సంవత్సరం నుంచి ములమల్ల గ్రామంలో కబడ్డీ సాధనకు అవసరమైన సదుపాయాలు కల్పించినందుకు జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ సహకారంతో తాము రాష్ట్ర స్థాయిలో విజయం సాధించగలిగామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డివైఎస్ఓ సుధీర్‌రెడ్డి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ కురుమయ్య, పద్మారెడ్డి, కోచ్‌లు, క్రీడాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## ఘనంగా సేఫ్ తల్లి పిల్లల
# హాస్పిటల్ ప్రారంభోత్సవం

**మధిర ఫిబ్రవరి 26, వుదయం ప్రతినిధి.**

మధిర లోని కాంగ్రెస్ పార్టీ ఆఫీసు ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన సేఫ్ తల్లి పిల్లల హాస్పిటల్ ను సీనియర్ వైద్యులు,టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. వాసిరెడ్డి రామనాథం మరియు మున్సిపల్ చైర్మన్ సామినేని సుజాత రామనాథం ప్రారంభించారు. వైద్యం కొరకు సుదూర ప్రాంతాలకు వెళ్లనవసరం లేకుండా మధిర లోనే అత్యాధునిక వైద్య సదుపాయాలతో సేఫ్ తల్లి పిల్లల హాస్పిటల్ ప్రారంభించాం అని నిర్వాహకులు డా. కంచేటి సాయి కిషోర్ ఎండి పెడియాట్రిక్స్,డా. మండవ తేజస్వి ఎంఎస్ ఓబిజీ తెలిపారు.పుట్టిన నవజాత శిశువులుకు వైద్యం చిన్నపిల్లలకు ఎన్ఐసీయు సెటప్ తో వెంటిలేటర్ సపోర్ట్ ట్రీట్మెంట్ అందుబాటులో కలదన్నారు.చిన్న పిల్లల్లో వచ్చే అన్ని రకాల ఆరోగ్య సమస్యలకు వైద్యం అందించబడుతుంది అని తెలిపారు. స్త్రీల సమస్యలకు మరియు గర్భిణి స్త్రీలకు వైద్యం, స్త్రీ ప్రసూతి,సాధారణ మరియు లాప్రోస్కోపీ ద్వారా ఆపరేషన్లు చేయబడును అని తెలిపారు. దీర్ఘకాలంగా సంతానం అందని వారికి సరైన వైద్యం అందించబడుతుంది అని తెలిపారు.సాధారణ కాన్పులు చేయడం మా మొదటి ప్రాధాన్యత అన్నారు. ఈ వైద్య సౌకర్యాలను మధిర పరిసర ప్రాంతాల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ కోసం డా. రామనాథం చేతుల మీదుగా మొక్కను నాటారు.ఈ కార్యక్రమంలో పలు వార్డుల కౌన్సిలర్స్,వివిధ పార్టీల నాయకులు,వివిధ సంఘాల నాయకులు పలువురు వైద్యులు పాల్గొన్నారు.



# పిల్లల అభివృద్ధికి ఉపాధ్యాయుల కృషి

- **కలెక్టర్ కోయ శ్రీ హర్ష**
- **'శక్తి'పై ఉపాధ్యాయులు, అధికారులతో సమీక్ష**

**పెద్దపల్లి, ఫిబ్రవరి 26 (వుదయం ప్రతినిధి) :**

పిల్లల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయుల కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శక్తి కార్యక్రమం పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యా సంస్థల్లోని ఉపాధ్యాయులు, విద్యార్థులకు మధ్య మంచి కనెక్షన్ ఏర్పడాలని చేపట్టిన శక్తి కార్యక్రమం మంచి ఫలితాలు అందించిందని అన్నారు. శక్తి కార్యక్రమం అమలు వల్ల పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెరిగిందని, వారి విద్యా ప్రమాణాలు కూడా మెరుగ్గా అయ్యాయని కలెక్టర్ తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తి కొనసాగిస్తూ మరిన్ని మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. పాఠాలు బోధించడమే కాకుండా పిల్లల పట్ల ఉపాధ్యాయులు ప్రేమ చూపెడితే మంచి కనెక్టివిటీ ఏర్పడుతుందని, దీని కారణంగా విద్యార్థులు మంచి స్థాయికి ఎదిగేందుకు మనం మార్గదర్శకం చూపే అవకాశం ఉంటుందనే ఉద్దేశంతో చేపట్టిన శక్తి కార్యక్రమం జిల్లాలో విజయవంతమైందన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి శారద, అకాడమిక్ మానిటరింగ్ అధికారులు పిఎం. షేక్, జిసిడిఓ కవిత, మండల విద్యా ధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## యాదాద్రి కలెక్టర్‌గా అనురాగ్ జయంతి బాధ్యతల స్వీకరణ



**యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 26 (ఉదయం జిల్లా ప్రతినిధి) :**

2015 ఐఎఎస్ బ్యాచ్ కి చెందిన అనురాగ్ జయంతి యాదాద్రి భువనగిరి జిల్లా నూతన కలెక్టర్‌గా గురువారం పదవి బాధ్యతలు స్వీకరించారు. అనురాగ్ జయంతి గతంలో భోధన్, ఖమ్మం జిల్లాలో సబ్ కలెక్టర్‌గా, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌గా, జిహెచ్ఎంసి పరిధిలో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌గా పని చేశారు. ప్రస్తుతం జిహెచ్ఎంసి రాజేంద్ర నగర్‌లో జోనల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న అనురాగ్ జయంతి బదిలీపై యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టడం జరిగింది. విద్యా, వైద్య రంగాలతో పాటు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అట్టడుగు ప్రజలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా సమగ్రాభివృద్ధి దిశ గా జిల్లా ముందుకు సాగుతుందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.




## నేషనల్ సైన్స్ డే సందర్భంగా సైన్స్ క్విజ్ నిర్వహణ

హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ కళాశాలలో ఈనెల 28న జరగనున్న జాతీయ విజ్ఞాన దినోత్సవం (National Science Day) పురస్కరించుకొని డిగ్రీ విద్యార్థుల కోసం సైన్స్ క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, విశ్లేషణాత్మక ఆలోచన, విజ్ఞానాభిరుచి పెంపొందించడమే ఈ కార్యక్రమం లక్ష్యం అని ఒక ప్రకటనలో తెలియజేశారు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. రజనీలత మాట్లాడుతూ, "మన నిత్యజీవితంలో సైన్స్ కీలక పాత్ర పోషిస్తోంది. జీవుల మనుగడకు, అభివృద్ధికి, ఆరోగ్యానికి అవసరమైన అనేక అంశాలను సైన్స్ అందిస్తోంది. శాస్త్రీయ దృక్పథం ప్రతి విద్యార్థిలో పెంపొందాలి" అని పేర్కొన్నారు.ఈ క్విజ్ కార్యక్రమం వృక్షశాస్త్ర విభాగాధిపతి డా. ఈ. కోమల ఆధ్వర్యంలో నిర్వహించబడింది. కార్యక్రమంలో జీవశాస్త్ర విభాగాధిపతి డా. దినేష్, సూక్ష్మజీవ శాస్త్ర విభాగాధిపతి డా. పల్లవి, జీవసాంకేతిక విభాగాధిపతి డా. కిషోర్ కుమార్ పాల్గొన్నారు. అలాగే అధ్యాపకులు డా. శ్యాంప్రసాద్, డా. యుగంధర్, డా. సమ్మయ్య, డా. ఘనసింగ్, డా. నరేందర్, డా. గాంధీ, డా. రఘు, డా. స్వామి, డా. రాజయ్య, డా. సమత తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.క్విజ్ పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. విజేతలకు త్వరలో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో పరిశోధనా ఆసక్తిని పెంపొందించడంలో దోహదపడతాయని కళాశాల వర్గాలు పేర్కొన్నాయి.

## బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహుడు








**కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం శ్రీలక్ష్మి నరసింహుడు**
**ధర్మపురిని దర్శిస్తే యమపురి ఉండదు**
**అంకురార్పణతో ఉత్సవాలకు శ్రీకారం**
**భక్తుల సౌకర్యార్థం దేవస్థానం ప్రత్యేక చర్యలు**

**ధర్మపురి,ఫిబ్రవరి 26 (ఉదయం ప్రతినిధి):**

దక్షిణాభిముఖంగా ప్రవహించే గోదావరి తీరం, త్రిమూర్తులు కొలువై ఉన్న పుణ్యభూమి, నవనారసింహ క్షేత్రాల్లో అగ్రగణ్యమైన దివ్యక్షేత్రం అదే ధర్మపురి. దేశంలోనే అత్యంత ప్రాచీన క్షేత్రాలలో ఒకటైన ఈ పవిత్ర స్థలంలో బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఏకవేదికపై భక్తులకు దర్శనమిస్తుండటంతో దక్షిణ కాశీ గా ఖ్యాతి పొందింది.క్రీస్తుశకం 650926 కాలానికి ముందే ఈ క్షేత్రం వెలసిందని చరిత్రకారుల అభిప్రాయం. ధర్మవర్మ మహారాజు తపస్సుతో ప్రసన్నమైన మహావిష్ణువు, లక్ష్మీ సమేతుడై స్వయంభువుగా వెలిసిన క్షేత్రమే ధర్మపురి అని స్థల పురాణం చెబుతోంది. స్వామివారి కోరిక మేరకు నిర్మించబడిన బ్రహ్మ పుష్కరిణి (కొనేరు) ఈ క్షేత్రానికి మరింత పవిత్రతను చేకూర్చింది.అరణ్యవాస సమయంలో శ్రీరాముడు గోదావరిలో ఇసుకతో లింగాన్ని తయారు చేసి ప్రతిష్ఠించిన ఆలయమే శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం అని భక్తుల విశ్వాసం.అందుకే స్వామివారికి రామలింగేశ్వరుడు అనే నామం వచ్చింది. ధర్మపురిని దర్శిస్తే యమపురి ఉండదు ధర్మపురి దర్శిస్తే యమపురి ఉండదు. ధర్మపురి మహిమను చాటి చెప్పే నానుడి ఇది. యమలోకంలో శిక్షలిచ్చే యముడు సైతం ఇక్కడి గోదావరిలో స్నానం చేసి స్వామివారిని దర్శించి పాప విమోచనం పొందాడనే పురాణ గాథ ప్రాచుర్యంలో ఉంది. అందుకే క్షేత్ర పాలకుడిగా యముడు ప్రత్యేక స్థానం పొందాడు. గండదీపంలో నూనె పోస్తే గండాలు తొలగుతా యనే విశ్వాసంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తారు.

**ఇసుక స్తంభం సత్యవతి గుండం ప్రత్యేకత**

పాము రూపంలో ఉన్న భర్త మానవ రూపం దాల్చాలని కోరుకున్న సత్యవతి అనే భక్తురాలు గోదావరిలో స్నానం చేసి స్వామిని ప్రార్థించగా ఆమె భర్త శాప విమోచనం పొందాడని కథనం. ఆమె స్నానమాచరించిన ప్రదేశమే సత్యవతి గుండం గా ప్రసిద్ధి చెందింది. స్వామి సన్నిధి లో ఇసుకతో నిర్మించిన స్తంభం ఆమె భక్తికి నిదర్శనం.

**బ్రహ్మోత్సవాల శోభ**

శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవ స్థానం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 27 నుంచి మార్చి 11 వరకు వైభవం గా బ్రహ్మోత్సవాలు జరగనున్నా యి.దేశం నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. ఫిబ్రవరి 27 అం కురార్పణ,కలశ స్థాపన ఫిబ్రవరి 28 గోధూళి సుముహూర్తంలో కల్యాణోత్సవం,మార్చి 1న శ్రీలక్ష్మి నరసింహ స్వామి వార్ల ఊరేగింపు సేవ,2న శ్రీ వేంకటేశ్వర స్వామి ఊరేగింపు సేవ,3న చంద్ర గ్రహణం సందర్భంగా ఉదయం 6గం నుండి 7గం వరకు యోగా నరసింహ స్వామి వారి తెప్పోత్సవం, డోలోత్సవం, తదుపరి దేవాలయం మూసివేయబడును.4న మధ్యాహ్నం 3గం శ్రీ కొత్త నరసింహ స్వామి వారి తెప్పోత్సవం,డోలోత్సవం,5న శ్రీ వేంకటేశ్వర స్వామి తెప్పోత్సవం డోలోత్సవం, సాయంత్రం 4గం శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారి దక్షిణ దిగ్యాత్ర,6న సాయంత్రం 4గం లకు శ్రీలక్ష్మి నరసింహ స్వామి ఉత్తర దిగ్యాత్ర,8గం భోగమడపం ఉత్సవం, వేదస దస్సు ,7న సాయంత్రం4గం లకు శ్రీ వేంకటేశ్వర స్వామి దక్షిణ,ఉత్తర దిగ్యాత్రలు ,8గం లకు దోపోత్స వం,8న ముప్పురు స్వాముల రథోత్సవం,చక్రతీర్థం,యోగ నరసింహ స్వామి పుష్పయా గం,9న శ్రీ వెంకటేశ్వర స్వామి పుష్పయాగం,శ్రీ యోగా నరసింహ స్వామి ఏకంతోత్సవం,10న ఉగ్ర నరసింహ స్వామి పుష్పయాగం, శ్రీవెంకటేశ్వర స్వామి ఏకంతో త్సవం,మార్చి 11 ఉగ్ర నరసింహ స్వామివారి ఏకాంతోత్సవంతో ముగింపు.

**ఒకే వేదికపై ముప్పురు మూర్తుల కళ్యాణం**

శేషప్ప కళావేదికపై లక్ష్మి సమేతం గా ఉగ్ర నరసింహ,యోగ నరసింహ, వేంకటేశ్వర స్వాముల కళ్యా ణం గోధూళి వేళ నిర్వహించడం ఈ క్షేత్రానికి ప్రత్యేక ఆకర్షణ. దేశంలో ఎక్కడా లేని విధంగా ఒకే వేదికపై ముప్పురు దేవతల కళ్యాణం జరగడం విశేషం. భక్తుల రద్దీ దృష్ట్యా క్యూలైన్లు, చలువ పందిళ్లు,పూల దండల అలంకర ణ, గోదావరిలో స్నానానికి ప్రత్యేక సదుపాయాలు, మహిళల దుస్తులు మార్చుకునే గదులు, ప్రసాదాల తయారీ వంటి ఏర్పా ట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. భద్రత కోసం ప్రత్యేక బందోబస్తు చర్యలు తీసుకున్నారు. సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ,ఎంపీ గడ్డం వంశీకృష్ణ, జిల్లా కలెక్టర్ సత్యప్ర సాద్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు.మహారాష్ట్ర,ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడపనున్నట్లు తెలిపారు.13రోజులు రైస్ మిల్లర్లు, దాతలు,వర్తక వ్యాపారులు,స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఓల్డ్ టిటిడి లో భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తు న్నట్లు దేవ స్థానం కార్యనిర్వహన అధికారి సంకటాల.శ్రీనివాస్, దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు వెల్లడిం చారు.

**బ్రహ్మోత్సవాలకు మున్సిపల్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు**

బ్రహ్మోత్సవాలకు మున్సిపల్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పై ప్రత్యేక దృష్టి సారించినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస రావు వెల్లడించారు.గోదావరీ నది తీరంలో,ఘాట్ల వద్ద, దేవాలయం పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నామని, డ్రైనేజీలు, రోడ్లు,ప్రధాన కూడళ్లలో పరిశుభ్రంగా ఉంచడం,డస్ట్ బిన్స్ ఏర్పాటు, భక్తులకు త్రాగునీటికి చాలివేం ద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

**నృసింహుని బ్రహ్మోత్సవాలకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భద్రత కట్టుదిట్టం**

ఫిబ్రవరి27నుండి మార్చి 11 వరకు నిర్వహించే ధర్మపురి నరసింహుని బ్రహ్మోత్సవాలకు ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు డిఎస్పీ రఘుచందర్ నేతృత్వంలో సీఐ రాం నరసింహ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై మహేష్ కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.బ్రహ్మో త్సవాలకు పోలీస్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, సామాన్య భక్తులకు కూడా స్వామివారి దర్శనం కలిగేలా, క్యూ లైన్ ల ఏర్పాటు,స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులు గోదావరి లో స్నానమాచరించ డానికి గోదావరి ఒడ్డున పోలీసు బందోబస్తు, మహిళల భద్రత కు షీటీమ్స్ ఏర్పాటు మత్స్య శాఖ సహకారం తో గోదావరి నది లో గజ ఈత గాల్ల నియామకం, ధర్మపురికి వచ్చే వాహనాలను ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశామని, మంగలి గడ్డ, పుష్కర ఘాట్, గోదావరి బస్టాండ్ ఆలయ పరిసరాలు నంది చౌరస్తా గోదావరి రోడ్డులో 70 సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉంటుందని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## ధర్మపురి నరసింహుని బ్రహ్మోత్స వాలకు కట్టుదిట్టమైన భద్రత



**అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు**
**350 మంది సిబ్బంది,70 సీసీ కెమెరాలతో నిరంతరం నిఘా**
**ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు**
**ప్రతీ ఒక్కరికీ స్వామి వారి దర్శనం కలిగేలా ఏర్పాట్లు**
**సీఐ రాం నరసింహ రెడ్డి**

**ధర్మపురి,ఫిబ్రవరి 26 (ఉదయం ప్రతినిధి):**

ధర్మపురి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో ఈ నెల 27 నుంచి మార్చి 11 వరకు 13 రోజుల పాటు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా పోలీసుల ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు సీఐ రాం నరసింహ రెడ్డి తెలిపారు.జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు డీఎస్పీ రఘుచందర్ నేతృత్వంలో సుమారు 350 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు వెల్లడింaచారు. ఎస్సై మహేష్‌తో పాటు ప్రత్యేక బృందాలు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నాయి.వీఐపీలు, సాధారణ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దర్శనం కల్పించేందుకు ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేశారు.ఈవేటీజింగ్ నివారణకు షెటీమ్స్ ను వినియోగించనున్నారు.గోదావరి నది వద్ద స్నానాలకు వచ్చే భక్తుల భద్రత కోసం పోలీసులతో ప్రత్యేక భద్రత కల్పించనున్నట్లు,పాటు మత్స్యశాఖ సిబ్బంది,గజ ఈతగాళ్లను నియమిస్తున్నట్లు తెలిపారు.ధర్మపురికి వచ్చే వాహనాలకు ట్రాఫిక్ అంతరాయం లేకుండా ప్రత్యేక పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బ్రహ్మ పుష్కరిణి, మంగలిగడ్డ, పుష్కర ఘాట్, గోదావరి తీర ప్రాంతం, బస్టాండ్, ఆలయ పరిసరాలు, నంది చౌరస్తా, గోదావరి రోడ్డులో మొత్తం 70 సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్య వేక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల సమన్వ యంతో భద్రతా చర్యలు చేపట్టామని సీఐ తెలిపారు.

## ఆదిలాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తాం

**- జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు**
**- ప్రాజెక్టు పనుల పురోగతి పై మంత్రి ఏరియల్ సర్వే**

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 26 (ఉదయం ప్రతినిధి) :**



ఆదిలాబాద్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పరచడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. గురువారం మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరిన మంత్రి, జిల్లాలోని భీంపూర్, బోరజ్ మండలాల పరిధిలో గల హట్టిఘాట్ పంప్ హౌస్, చనాకాకోరాట బ్యారేజ్ ప్రాంతాలను ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు. అనంతరం హట్టిఘాట్ పంప్ హౌస్ వద్ద క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రాజెక్టు పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆదిలాబాద్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పరచడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సమృద్ధిగా సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.చనాకాకోరాట బ్యారేజ్ ద్వారా చేకూరే సాగునీటి ప్రయోజనాలపై ఇంజినీరింగ్ అధికారులతో సమగ్రంగా చర్చించి పలు సూచనలు చేశారు. ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచి నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా ప్రాజెక్టులకు సంబంధించిన సమగ్ర వివరాలు, జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని మంత్రికి వివరించారు. ఈ పర్యటనలో రాష్ట్ర ముఖ్యమంత్రి సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, పి. సుదర్శన్ రెడ్డి, టీజీఐఐసీ ఎండీ కె.శశాంక, ఆదిలాబాద్ ఎంపీ జి.నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎస్పీ అఖిల్ అఖిల్మ మహాజన్, అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, రాజేశ్వర్, విద్యుత్ శాఖ ఎస్ ఈ శేషరావ్ రాథోడ్, ఆర్డీఓ స్రవంతి, తహసిల్దార్లు శ్రీనివాస్, రాజేశ్వరి, నలంద ప్రియ తదితరులు పాల్గొన్నారు.



## చోరులకు చెక్ !

- 11 తులాల బంగారం
- 500 గ్రాముల వెండి నగల స్వాధీనం
- ఎస్పీ నితికా పంత్
- పోలీసు సిబ్బందికి అభినందన

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 26 (ఉదయం ప్రతినిధి) :**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలో ఇటీవల కాలంలో వరస దొంగతనాలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగజ్ నగర్ పట్టణ పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి బాధితులు కోల్పోయిన బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు అధికారి నితికాపంత్ కాగజ్ నగర్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో దొంగతనాలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మొత్తం18 తులాల బంగారం దొంగతనానికి గురికాగా, 11 తులాల బంగారు నగలను స్వాధీన పరుచుకున్నట్లు తెలిపారు. అలాగే కిలో వెండి దొంగతనానికి గురికాగా 500 గ్రాముల వెండి (అరకిలో)ని సైతం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులు ఎ 1 గా ఇర్షాదు పాషా జెసిబి డ్రైవర్ సుభాష్ చంద్ర బోస్ కాలనీ, ఎ 2 గా షేక్ అంజాద్ సెంట్రింగ్ వర్క్, సర్ సిల్క్ కాలనీ, A3 గా మీర్జా సోహెల్ బేగ్, జెసిబి డ్రైవర్ చింతగూడలకు చెందినవారు పట్టణంలోని ఇళ్లకు తాళాలు వేసి, ఊర్లకు వెళ్ళిన వారి వివరాలు తెలుసుకొని వరుస దొంగతనాలు చేసేవారని ఎస్పీ పేర్కొన్నారు. ఎ 4 గా కాగజ్ నగర్ పట్టణంలోని బాలాజీ నగర్‌కు చెందిన చిలుకూరి శ్రీకాంత్ నగల మరమ్మతు చేసి వారిని తెలిపారు. దొంగతనాలు ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించి, ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులు సీఐ ప్రేమ్ కుమార్, ఎస్సై సుధాకర్, కానిస్టేబుల్‌ను ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు.

## వంట నాణ్యత పెంచండి.. లేదంటే చర్యలు తప్పవు

**- ఇర్కోడ్ ఆదర్శ పాఠశాలలో కలెక్టర్ కె. హైమావతి ఆకస్మిక తనిఖీ**
**- వంట సిబ్బందిపై ఆగ్రహం.. విద్యార్థులతో కలిసి భోజన పరిశీలన**

**సిద్దిపేట, ఫిబ్రవరి 26 (ఉదయం ప్రతినిధి)**



సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడ్ గ్రామంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల మరియు జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ కె. హైమావతి గురువారం ఆకస్మికంగా సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును స్వయంగా పర్యవేక్షించిన ఆమె, భోజన నాణ్యతపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తనిఖీలో భాగంగా విద్యార్థులకు వడ్డిస్తున్న బిర్యానీ అన్నం, ఆలుగడ్డ టమాటా కూర, సాంబారును కలెక్టర్ పరిశీలించారు. బిర్యానీలో కనీసం బిర్యానీ ఆకు, మసాలా దినుసులు కూడా కనిపించకపోవడం.. సాంబారు నాణ్యత లోపించడంపై ఆమె వంట సిబ్బందిని మందలించారు. "కామన్ డైట్ మెనూ పాటిస్తున్నప్పటికీ, వంట రుచికరంగా లేకపోతే విద్యార్థులు ఎలా తింటారు?" అని ప్రశ్నించారు. ఇష్టానుసారంగా వండితే సహించేది లేదని హెచ్చరించిన కలెక్టర్.. ప్రతి వంటకం నాణ్యతగా, అందరికీ సరిపోయేలా ఉండాలని ఆదేశించారు. భోజన ప్రక్రియను 'ఫుడ్ చెకింగ్ టీచర్' నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలోని బాలికల వసతి గృహాన్ని కలెక్టర్ సందర్శించారు. అక్కడ వండిన అన్నం, గుడ్డు, పాలకూర పప్పు, బెండకాయ ఫ్రై, సాంబారు, పెరుగులను తనిఖీ చేశారు. పాలకూర పప్పు నీళ్లలా పలచగా ఉందని, మెరుగ్గా వండాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించిన కలెక్టర్.. "భోజనం ఎలా ఉంది? రోజూ రుచిగా ఉంటుందా?" అని ఆరా తీశారు. భోజనం బాగానే ఉందని విద్యార్థులు తెలపడంతో, కడుపునిండా తిని ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. వసతి గృహంలో డ్రైనేజీ బ్లాక్ అయి ఇబ్బందిగా ఉందని సిబ్బంది కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆమె, వెంటనే ఇంజనీరింగ్ అధికారులను పంపించి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థుల వసతి, ఆరోగ్యం విషయంలో రాజీ పడకూడదని అధికారులను ఆదేశించారు.

## ఇసుక అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టాలి

- ఇసుక బుకింగ్ "మానా ఇసుక వాహనం" ద్వారానే జరగాలి
- అక్రమ కార్యకలాపాలను ఏమాత్రం సహించబోం
- కలెక్టర్ ఇలా త్రిపాఠి

**నిజామాబాద్, ఫిబ్రవరి 26 (ఉదయం ప్రతినిధి) :**



జిల్లాలో ఇసుక బుకింగ్ పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో "మానా ఇసుక వాహనం" యాప్ ద్వారానే జరగాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆఫ్‌లైన్ బుకింగ్ అనుమతించబడదని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టం చేశారు. అధ్యక్షతన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించారు. జిల్లాలో ఇసుక తవ్వకాలు, రవాణా, ప్రభుత్వ ఆదాయం పెంపు, అక్రమ తవ్వకాల నియంత్రణపై సమగ్రంగా చర్చించిన అనంతరం కలెక్టర్ కఠిన ఆదేశాలు జారీ చేశారు. ఈ విధానం ద్వారా పారదర్శకత పెరిగి ప్రభుత్వానికి గరిష్ట ఆదాయం లభిస్తుందని తెలిపారు. మంజీరా నది పరివాహక ప్రాంతాల్లో ఇసుక తవ్వకాల విషయంలో ప్రత్యేకంగా దృష్టి సారించిన కలెక్టర్, ప్రస్తుతం మంజీరా నదిలో ఐదు ప్రభుత్వ రీచ్‌లు అనుమతించబడినప్పటికీ అవి పర్యావరణ అనుమతులకు లోబడి ఉండాలని పేర్కొన్నారు. సంబంధిత శాఖల నుంచి అవసరమైన పర్యావరణ క్లియరెన్సులు పొందిన తర్వాత మాత్రమే ఆ రీచ్‌లలో ఇసుక తవ్వకాలు నిర్వహించడానికి అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. పర్యావరణ అనుమతులు లేకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ తవ్వకాలు చేపట్టరాదని కఠినంగా ఆదేశించారు. అదేవిధంగా మంజీరా నదిలో మూడు పట్టా భూములు జిల్లా కలెక్టర్ ఆమోదం పొందినట్లు తెలియజేశారు. వ్యవసాయ భూముల్లో ఉన్న ఇసుక మట్టెల తొలగింపు యాంత్రిక పద్ధతిలో కాకుండా కేవలం మానవ శక్తితో మాత్రమే నిర్వహించాలని, ట్రాక్టర్ల ద్వారానే రవాణా చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రక్రియకు మండల వ్యవసాయాధికారి మరియు స్థానిక తహసీల్దార్ (ఎంఆర్ఓ) లకు అధికారాలు అప్పగించబడినట్లు తెలిపారు. రైతులకు ప్రభుత్వం నిర్దేశించిన ధర చెల్లించి మాత్రమే ఇసుక తొలగించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులకు నష్టం కలగకూడదని గట్టిగా సూచించారు.జిల్లాలో ఎక్కడైనా అక్రమంగా ఇసుక లేదా గ్రావెల్ తవ్వకం, రవాణా జరుగుతున్నట్లు గుర్తిస్తే తక్షణమే సుమోటో కేసులు నమోదు చేయాలని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అక్రమ రవాణా లేదా తవ్వకాలు జరిగిన పక్షంలో సంబంధిత వాహనాలను సీజ్ చేయడం, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం, సంబంధిత అధికారుల నిర్లక్ష్యంపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. అక్రమ ఇసుక, గ్రావెల్ తవ్వకాల నియంత్రణపై కలెక్టర్ స్పందిస్తూ ఇటువంటి అక్రమ కార్యకలాపాలను ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు.ఈ బాధ్యత కేవలం రెవెన్యూ శాఖ మరియు గనుల శాఖకే పరిమితం కాదని, పోలీసు శాఖ, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ సిబ్బంది, గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో కలిసి ఒకే వేదికపై పనిచేసి అక్రమ తవ్వకాలు మరియు రవాణాను పూర్తిగా అరికట్టాలని ఆదేశించారు. జిల్లాలో ఇసుక నిర్వహణ పూర్తిగా పారదర్శకంగా, నియంత్రితంగా అమలు కావాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, మైనింగ్ ఏ.డీ సంజయ్ కుమార్, రెవెన్యూ పోలీస్ ఇరిగేషన్ ఆర్.డబ్ల్యూ.ఎస్, మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, గ్రౌండ్ వాటర్, హౌసింగ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

**ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్...**

బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. గురువారం ఇంటర్ సెకండియర్ పరీక్ష కొనసాగగా, విద్యార్థుల హాజరు గురించి కలెక్టర్ ఆరా తీశారు. నిబంధనలకు అనుగుణంగానే పరీక్ష నిర్వహిస్తున్నారా? అని పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతి, ప్రథమ చికిత్స సదుపాయం, ఏ.ఎన్.ఎం, టాయిలెట్స్ అందుబాటులో ఉన్నాయా అని గమనించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సజావుగా పరీక్షలు జరిపించాలని సూచించారు. పరీక్ష పూర్తయిన వెంటనే ఆన్సర్ షీట్లు తగిన పోలీసు బందోబస్తు మధ్య నిర్దేశిత కేంద్రాలకు తరలించాలని, ఎలాంటి కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పూర్తి పారదర్శకంగా, పక్కాగా పరీక్షలు జరిపించాలని ఆదేశించారు. సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వాచీలు వంటి ఉపకరణాలు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించకూడదని సూచించారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో ఉన్నారు.

## బ్యాంకర్లు, అధికారులు పనిచేయాలి






- జాప్యం లేకుండా రుణాలు అందించాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ
- సకాలంలో రుణాలు అందించాలి
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**జయశంకర్ భూపాలపల్లి ఫిబ్రవరి 26 (ఉదయం జిల్లా ప్రతినిధి):**

ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రాధాన్యత రంగాలకు 2971.20 కోట్లు రుణాలు అందించడం లక్ష్యం కాగా డిసెంబర్ మాసం నాటికి 1937.21 కోట్ల రుణాలు అందించినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలో లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో జిల్లా కన్సల్టేటివ్, జిల్లా స్థాయి రివ్యూ కమిటీ, జిల్లా స్థాయి ఇంప్లిమెంటేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కమిటీ సమావేశంలో నిర్దేశించిన లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లకు సూచించారు. మున్సిపల్, గ్రామ పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించేందుకు కార్యాచరణ తయారు చేయాలని సూచించారు. రుణ లక్ష్య సాధనలో మరింత ప్రగతి సాధించేందుకు బ్యాంకర్లు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. జిల్లాలో పంట రుణాలు, ఎం.ఎస్.ఎం.ఈ, హౌసింగ్, విద్య, వ్యవసాయ రుణాలను సమీక్షించారు. రికవరీ శాతాన్ని పెంచేందుకు అధికారులు గ్రామ స్థాయిలో లబ్ధిదారులకు అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం ఇస్తున్న నిధులు బ్యాంకర్లు నీడలా చేయొద్దని అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో పాడి పరిశ్రమకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అదే విధంగా కోళ్ల ఫారాలు నెలకొల్పుకునేందుకు సెరికల్చర్ చేపట్టేందుకు అధిక మొత్తంలో రుణాలు ఇచ్చే విధంగా కృషి చేయాలన్నారు. ప్రాధాన్యతా రంగాలకు సకాలంలో రుణాలు అందించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. పంట రుణాలు చెల్లించిన రైతులకు తిరిగి రెన్యూవల్ చేయడంలేదని, ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయాన్ని ఆపుతున్నారన్నారు. రెన్యూవల్ కాకుండా ఇబ్బందులు పడే 100 మంది రైతులను చూపిస్తానని అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, రుణాలు చెల్లించని వారికి అవగాహన కల్పించి వసూలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కానీ ఇబ్బందులకు గురిచేయొద్దని సూచించారు. బ్యాంకర్లు రుణాలు ఇచ్చి పుచ్చుకునే ధోరణితో ప్రజలు, రైతులతో మంచిగా ఉండాలని, అపుడే లావాదేవీలు బాగా జరుగుతాయని స్పష్టం చేశారు.మొండి కేసులు వివరాలు నాకు చెప్పండి నేను వసూలు చేసే బాధ్యత తీసుకుంటానని తెలిపారు. బ్యాంకర్లు రైతులను ఇబ్బంది పెట్టకుండా రిలేషన్ మెయింటైన్ చేయాలని సూచించారు. కొంతమంది బ్యాంకర్లు వల్ల మంచి రైతులు సైతం ఇబ్బంది పడుతున్నారని సక్రమంగా చెల్లించని వారు మంచిగా రుణాలు తీసుకుంటున్నారని అన్నారు. ఈ ప్రాంతంలో డైరీ యూనిట్ కు మంచి అవకాశం ఉందని, డైరీ యూనిట్ ఎర్పాటు కు రుణ సదుపాయం కల్పించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య,ఆర్.బి.ఐ.ఎల్‌డిఓ యశ్వంత్ సాయి, నాబార్డ్ డీడీఎం చంద్రశేఖర్, యూబీఐ డిజిఎం, టిజిబి ఆర్ ఎం, ఎల్.డి.ఎం. ఎ.తిరుపతి, జిల్లా అధికారులు, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరాలి




జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ.

జయశంకర్ భూపాలపల్లి ఫిబ్రవరి 26 (వుదయం జిల్లా ప్రతినిధి):

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని అమలు తీరును సమగ్రంగా పరిశీలించారు.వంటగది పరిశుభ్రత, ఆహార పదార్థాల నిల్వ విధానం,

మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అనే అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతను స్వయంగా తనిఖీ చేసి, అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. పోషకాహారం విషయంలో

- లక్ష్యసాధన దిశగా... విద్యార్థుల ప్రస్థానం!
- క్రమశిక్షణతో కూడిన చదువే ఉన్నత శిఖరాలకు తొలిమెట్టు.
- నేటి విద్యార్థులే రేపటి విజేతలు: ఉన్నత స్థాయికి చేరే మార్గాలు.
- కష్టపడి చదువుదాం... గౌరవప్రదమైన స్థానాన్ని అందుకుందాం!

ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. వంట సిబ్బంది పరిశుభ్రతను పాటించడంతో పాటు, ఆహార పదార్థాలు తాజావిగా ఉండేలా చూడాలని, గడువు ముగిసిన పదార్థాలను వినియోగించొద్దని ఆదేశించారు. భోజనం బావుంది ప్రతి రోజు ఇలానే చేయాలని వంట సిబ్బందిని అభినందించారు..పాఠశాలల్లో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పోషకాహారం అందించడంతో పాటు, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తరచుగా పరిశీలించాలని సంబంధిత అధికారులకు సూచించారు.విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేలా సమతుల ఆహారం అందించడం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. విద్యతో పాటు ఆరోగ్యం కూడా ముఖ్యమని, విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని, విద్యార్థులు మంచి అలవాట్లు అలవరచుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు.అనంతరం హాస్టల్ పరిసరాలను పరిశీలించిన కలెక్టర్, భద్రతా పరమైన చర్యలపై దృష్టి సారించాలని, సీసీ కెమెరాల ఏర్పాటు చేయడంతో పాటు, ప్రహరీ గోడ పైభాగంలో ఫెన్సింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, పాఠశాల ప్రిన్సిపాల్ జీవరత్నం,

పాఠశాల ఉపాధ్యాయులు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భూ కబ్జాలపై బీజేపీ గర్జన

## దాతల భూములను వదలని వైనంపై మండిపాటు




ఖమ్మం , ఫిబ్రవరి 26 (వుదయం జిల్లా ప్రతినిధి):

రాష్ట్ర ప్రభుత్వం ఖమ్మం జిల్లాలో పేదల పట్ల అత్యంత అమానుషంగా వ్యవహరిస్తోందని, బడా బాబులు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల ప్రయోజనాల కోసమే దశాబ్దాలుగా నివాసం ఉంటున్న పేదల ఇళ్లను కనికరం లేకుండా నేలమట్టం చేస్తోందని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తింది. గురువారం ఖమ్మం జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక మీడియా సమావేశంలో బీజేపీ రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు, జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వర రావు పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక మంత్రులు, రెవెన్యూ అధికారుల తీరుపై నిప్పులు చెరిగారు. దాతలు పేదల కోసం ఇచ్చిన భూములను కాజేయాలని చూస్తున్న అధికార పక్ష నేతల కుట్రలను వారు తీవ్రంగా ఎండగట్టారు.దశాబ్దాల క్రితం దాతలు పేదల నివాసాల కోసం దానంగా ఇచ్చిన భూముల్లో చిన్నపాటి గుడిసెలు వేసుకుని జీవిస్తున్న అమాయక ప్రజలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని బీజేపీ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లకు వెళ్లి పంచనామాలు చేసి, వారి నుంచి ఆధార్ కార్డులు లాక్కొని, కనీసం 24 గంటల సమయం కూడా ఇవ్వకుండానే రాత్రికి రాత్రే బుల్డోజర్లతో ఇళ్లను కూల్చివేయడం ప్రభుత్వ రాక్షసత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. పసిపిల్లలు, వృద్ధులు, గర్భిణులు, మహిళలు అనక రోడ్డున పడి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నా అధికారుల్లో కనీస మానవత్వం లోపించిందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం తమ కమీషన్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల ప్రయోజనాల కోసమే ఈ దారుణాలకు ఒడిగడుతున్నారని ఆరోపించారు.ఈ భూముల వెనుక ఉన్న చరిత్రను బీజేపీ నాయకులు మీడియాకు పూసగుచ్చినట్లు వివరించారు. 1954వ సంవత్సరంలో భూదాన ఉద్యమ స్ఫూర్తితో కల్వల రాజేశ్వరరావు అనే దాత పేదల నివాసాల కోసం సుమారు 62 ఎకరాల భూమిని దానంగా ఇచ్చారని గుర్తుచేశారు. సర్వే నెంబర్లు 147, 148, 149 తదితర నెంబర్లలో ఉన్న ఈ భూములను అప్పటి ఇందిరా గాంధీ ప్రభుత్వం నుంచి మొదలుకొని, రాజీవ్ గాంధీ, మన్మోహన్ సింగ్ ప్రభుత్వాల వరకు ఏ ఒక్కరూ పేదలకు పంచాలనే కనీస ఆలోచన చేయలేదని విమర్శించారు. దాతల ఆశయాలకు గండికొడుతూ, ఇప్పుడు ఆ భూములను ఆక్రమించి, పేదలను గెంటివేసి, బడా బాబుల విలాసాల కోసం ఖమ్మంలో 'జూబ్లీహిల్స్' తరహా కాలనీలను నిర్మించాలని మంత్రులు కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి వంటి మంత్రులు మూడు ప్రభుత్వాలు మారినా పదవుల్లో ఉంటూ పేదలకు చేసిందేమీ లేదని విమర్శించారు.రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందని, ఆ లోటును పూడ్చుకునేందుకే ఇలాంటి భూముల అమ్మకాలకు తెరలేపిందని బీజేపీ నేతలు ఆరోపించారు. బడ్జెట్ అంచనాల ప్రకారం ఈ పన్నెండు నెలల కాలానికి సుమారు రూ. 2,30,000 కోట్ల ఆదాయం రావాల్సి ఉండగా, కేవలం రూ. 1,40,000 కోట్లు మాత్రమే ఖజానాకు చేరిందని లెక్కలతో సహా వివరించారు. సుమారు 90 వేల కోట్ల రూపాయల రెవెన్యూ లోటులో ఉన్న ప్రభుత్వం, ఆ ఖాళీని భర్తీ చేసుకునేందుకు దాతలు పేదల కోసం ఇచ్చిన భూములను సైతం అమ్ముకునే నీచమైన స్థాయికి దిగజారిందని మండిపడ్డారు. పక్కా ఇళ్లు కట్టుకుని కోట్లు గడిస్తున్న కబ్జాదారులను వదిలేసి, పేదవాడి పూరిగుడిసెపై ప్రతాపం చూపించడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు.కాంగ్రెస్, ఇతర పార్టీలు మైనార్టీలను, పేదలను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నాయని వారు విమర్శించారు. ఎన్నికల సమయంలో ముస్లింలు, పేదల ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేసే నాయకులు, నేడు అదే ముస్లిం, మైనార్టీ పేదలకు చెందిన ఇళ్లను కనికరం లేకుండా కూల్చివేస్తున్నారని దుయ్యబట్టారు. ఓట్లు వేయించుకుని గద్దెనెక్కిన తర్వాత వారిని వీధిన పడేయడం దారుణమన్నారు. పేదల పక్షాన పోరాడే ఏకైక పార్టీ బీజేపీ మాత్రమేనని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు.చివరగా, ప్రభుత్వానికి, రెవెన్యూ అధికారులకు బీజేపీ నేతలు సవాల్ విసిరారు. దమ్ముంటే, ఏ పాపం ఎరుగని పేదల ఇళ్ళు కూల్చడం ఆపి, 1954 నాటి 'పహణీ' (భూ రికార్డులు) ని ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. ఆ 62 ఎకరాల భూములు ఎవరివి? ఎవరి కోసం ఇచ్చారో రికార్డులు బయటపెడితే నిజాలు వెలుగులోకి వస్తాయన్నారు.

తక్షణమే ఈ కూల్చివేతలు ఆపి, నిరాశ్రయులైన పేదలకు అదే స్థలంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, లేనిపక్షంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా వ్యాప్తంగా తీవ్ర స్థాయిలో ప్రజా ఉద్యమం చేపడతామని, ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.మీడియా

సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్తా వెంకటేశ్వర్లు, మందడప సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో బీఎంఎస్ ధర్నా




కరీంనగర్ ఫిబ్రవరి 26 (వుదయం ప్రతినిధి)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా

భారతీయ మజ్దూర్ సంఘ్ జిల్లా అధ్యక్షులు పసుల శ్రవణ్ ఆధ్వర్యంలో కరీంనగర్ కలెక్టరేట్ ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించారు.కార్మిక చట్టాల అమలులో నిర్లక్ష్యం,కనీస వేతనాల పెంపు లేకపోవడం,కార్మికుల సామాజిక భద్రతా హక్కుల పరిరక్షణలో లోపాలు వంటి అంశాలపై ఈ నిరసన ప్రదర్శన, ధర్నా కార్యక్రమం జరిగింది..ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పసుల శ్రవణ్ ,తొర్తి శ్రీనివాస్ మాట్లాడుతూబీడీ కార్మికుల హక్కులు కాపాడాలని,బీడీ కార్మికుల వేతనాలు పెంచాలని,అన్ని రంగాల్లో కార్మిక చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని,ఆశ,అంగన్వాడీ కార్యకర్తల ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వేతనాల పెంపు భద్రతా పథకాలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు.కార్మికులే దేశ ఆర్థిక వ్యవస్థకు మూలం.కానీ ప్రభుత్వాలు పట్టించుకున్న పరిస్థితుల్లో లేవు, ఈపీఎస్ 95 పెన్షనర్లకు రూ 7500 లకు పెంచాలి, ఈ ఎఫ్ పి ఓ కనీస వేతన పరిమితిని పెంచాలని, కరీంనగర్ లో ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు చేయాలని డిమాండ్. చేశారు,ఈ కార్యక్రమంలో బీడీ కార్మికులు,రైస్ మిల్ కార్మికులు,స్ట్రీట్ వెండర్స్, బి ఎం ఎస్ కార్యకర్తలు,బీడీ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి రేణికుంట శంకర్,నక్క అరుణ్,ఆకుల తిరుపతి, మధుకర్, రాజేశం,సుమతి,స్వప్న,అనసూర్య,లక్ష్మీ,అనిత తదితరులు పాల్గొన్నారు.

## మీ సేవ ఆపరేటర్లతో సమీక్ష సమావేశం...



జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బిఎస్ లత

జగిత్యాల ఫిబ్రవరి 25 (వుదయం ప్రతినిధి)

జగిత్యాల జిల్లాలో మీ సేవ ఆపరేటర్లకు సదరం/యుడిఐడి వెబ్ సైట్లో వికలాంగత్వం ధృవీకరణ కోసం "మీ సేవ" కేంద్రాలలో కొత్తగా నమోదు 21 రకాల కేటగిరీల గురించి స్లాట్ బుకింగ్ చేసుకునే విధానం (రీ అసెస్మెంట్ టెంపరరీ సర్టిఫికెట్ స్లాట్ బుకింగ్) దివ్యాంగులకు యుడిఐడి సదరం శిబిరాల గురించి మరియు (నేమ్ డేట్ అఫ్ బర్త్ ఆధార్ అప్డేషన్ అండ్ ఈ కేవైసీ (ఎస్ఓపీ) చేసే ప్రక్రియ గ్రీవెన్స్ సవరణలు ఆన్లైన్ లో నమోదు చేయుటకు మీసేవ ఆపరేటర్లకు ఒక రోజు అవగాహన కార్యక్రమం జగిత్యాల కలెక్టరేట్ సమావేశ మందిరములో ఏర్పాటు చేయడం జరిగినది ఈ కార్యక్రమానికి "మీ సేవ" ఆపరేటర్ లు హాజరయ్యారు హైదరాబాద్ సదరం విభాగము నుండి అధికారులు జూమ్ ద్వారా సూచనలు సలహాలు ఇవ్వడం జరిగినది ముఖ్య అతిధులుగా గౌరవ అడిషనల్ కలెక్టర్ (రెవిన్యూ) అడిషనల్ డిఆర్డిఓ డిపియం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ఏఓ ఆర్ఎంఓ ఈడిఎం అడ్మిన్ అసిస్టెంట్ సదరం విభాగం డాటా ఎంట్రీ ఆపరేటర్లు కుమార్ మనోజ్ లు పాల్గొన్నారు



# పేద కుటుంబాలకు నిత్యావసరాల వితరణ

దమ్మపేట ఫిబ్రవరి 26 (వుదయం ప్రతినిధి )

ఉపాధి లేక ఇబ్బంది పడుతున్న రెండు పేద కుటుంబాలకు సత్తుపల్లి ప్రాంతానికి చెందిన సుధా హెర్బల్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్, అనువంశిక ఆయుర్వేద వైద్యురాలు కొనకళ్ళ సుధారాణి అండగా నిలిచారు.. గురువారం ఆ రెండు కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యవసరాలు అందించారు.. దమ్మపేట మండలం తొట్టి పంపు గ్రామం హనుమంతుని గుంపుకు పొట్టకూటి కోసం వలసగా వచ్చిన కారం రాజమ్మ, తాటి పెంటయ్య ఈ రెండు కుటుంబాలు. వృత్తిరీత్యా దినసరి కూలీలు కొద్దిరోజులుగా సరైన పని లేక ఇంటి వద్ద ఉంటున్నారు. పూట గడవడం కూడా కష్టమైపోతోంది. ఈ నేపథ్యంలో వీరి పరిస్థితి తెలుసుకున్న సుధారాణి గురువారం ఆ రెండు కుటుంబాలకు బియ్యం,

నెలకు సరిపడా నిత్యవసరాలు అందించి తన దాతృత్వాన్ని చాటుకున్నారు..

# ఆత్మకూర్ రూపురేఖలు మారుస్తా :మంత్రి వాకిటి శ్రీహరి

మక్తల్ ,ఫిబ్రవరి 26(వుదయం ప్రతినిధి)




రాబోయే కొద్ది రోజుల్లో ఆత్మకూరు రూపు రేఖలు మారుస్తానని రాష్ట్ర క్రీడా, యువజన సర్వీసుల, పాడి పరిశ్రమ, పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మక్తల్ నియోజకవర్గం ఆత్మకూరు లో నూతనంగా నిర్మించిన శ్రీ వాసవి కళ్యాణ మండపాన్ని ఆయన ప్రారంభించారు.కళ్యాణ మండప ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథి గా విచ్చేసిన మంత్రికి అర్చకులు పూర్ణ కుంభం తో స్వాగతం పలికారు. వాసవి మాత ఆలయంలో మంత్రి శ్రీహరి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి శ్రీహరి మాట్లాడుతూ వైశ్యులు అంటే ఒక నమ్మకమని, అన్ని రంగాల్లో వైశ్యులు రాణించగలుగుతున్నారని తెలిపారు.సమాజంలో ప్రజల ఆలోచన విధానాలు మార్చ గలిగే శక్తి వైశ్యులకు ఉంటుందన్నారు. కిరాణా కొట్టు నడిపే వ్యాపారికి చుట్టు పక్కల ఉండే ఐదు వందల కుటుంబాలను ప్రభావితం చేసే సామర్థ్యం వారికి ఉంటుందన్నారు.ఆత్మకూరు ప్రాంతం బాగుపడాలనే తపన తో శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నానని తెలిపారు. రాబోయే రోజుల్లో ఆత్మకూరు రూపు రేఖలు మారుస్తానని హామీనిచ్చారు.ఎవరూ ఊహించని విధంగా ఆత్మకూరు, అమరచింత ను అభివృద్ధి చేసి చూపిస్తానని స్పష్టం చేశారు. జూరాలపై బ్రిడ్జి నిర్మించి వనపర్తి నుండి వయా ఆత్మకూరు మంత్రాలయం వరకు 4 లేన్ రోడ్డు మంజూరు అయ్యిందని గుర్తు చేశారు. సాయంత్రం 7 తర్వాత రవాణా బంద్ అయ్యే ఆత్మకూరు లో త్వరలో 24 గంటలు రవాణా సదుపాయం ఉండబోతుందన్నారు. ఎక్కడైతే ట్రాన్స్పోర్ట్ సౌకర్యం ఉంటదో అక్కడే అభివృద్ధి చెందుతుందన్నారు.

పరమేశ్వర చెరువు రోడ్డు పై నుండి చెరువు మీదుగా ఆలయం వరకు భక్తుల సౌకర్యార్థం ఒక కోటి రూపాయలతో బ్రిడ్జిని నిర్మిస్తున్నట్లు మంత్రి తెలిపారు.ఇప్పటికే ఆత్మకూరు లో డయాలసిస్ సెంటర్ ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. 25 కోట్ల తో హాస్పిటల్ ను నిర్మిస్తున్నట్లు మంత్రి తెలియజేశారు.5 ఎకరాల భూమి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ కి కేటాయించామని తెలిపారు. అదేవిధంగా పట్టణంలో సీసీరోడ్లు, డ్రైనేజిల నిర్మాణం ప్రారంభమయ్యాయని మంత్రి స్పష్టం చేశారు. ఆత్మకూరు కు రెవిన్యూ డివిజన్ కల సాకారం దిశగాఅడుగులు పడుతున్నాయని వెల్లడించారు.మీరు నాపై పెట్టుకున్న నమ్మకాన్ని ఓమ్ము చేయనని మంత్రి హామీనిచ్చారు.గతంలోభూ కబ్జాల వల్ల ఆత్మకూరు లో భూములు కొనే పరిస్థితి ఉండేది లేదన్నారు. ఇప్పుడు ధైర్యంగా భూములు కొనొచ్చని భరోసానిచ్చారు.

మీకు ఏ ఆపద వచ్చినా మీకు అండగా వాకిటి శ్రీహరి ఉంటాడని స్పష్టం చేశారు.వాసవి మాతా కళ్యాణ మండపానికి సహకరించిన దాతలకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు.త్వరలో హైదరాబాద్ లో 40 వేల మంది తో చేయనున్న వాసవి మాతా పారాయణం గిన్నిస్ బుక్ అఫ్ వరల్డ్ రికార్డు ను విజయవంతం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మంత్రి తో పాటు మాజీ రాజ్యసభ సభ్యులు టీ జి వెంకటేష్, రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత, టీపీసీసీ కల్లుగీత సెల్ చైర్మన్ నాగరాజు గౌడ్,ఆత్మకూరు మున్సిపల్ చైర్ పర్సన్ నాగమణి, వైస్ చైర్ పర్సన్ శ్రీనివాసులు, మార్కెట్ కమిటి చైర్మన్ రహమతుల్లా తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర మంత్రి తుమ్మలకు దమ్మపేట నాయకుల సంఘీభావం



యూట్యూబ్ చానల్స్ దుష్ప్రచారాన్ని ఖండించిన ఆలపాటి

దమ్మపేట ఫిబ్రవరి 26 (వుదయం ప్రతినిధి):

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం అల్లిపల్లి గ్రామంలో విలేకరుల సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర గారిపై కొన్ని యూట్యూబ్ ఛానల్స్ చేసిన దుష్ప్రచారాన్ని తెలంగాణ రాష్ట్ర పామాయిల్ రైతు సంఘం సంక్షేమ అధ్యక్షుడు ఆలపాటి ప్రసాద్ తీవ్రంగా ఖండించారు. బుధవారం ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పామాయిల్ మొక్కలపై మంత్రి తుమ్మలపై ఆరోపణ చేసిన దుష్ప్రచారాన్ని ఖండిస్తూ గత 15 సంవత్సరాలగా ఏమి జరిగిందో వివరించారు. ఈరోజు తన శాఖ పరంగా మంత్రి తుమ్మల గుర్తింపు తెచ్చుకుంటూ పామాయిల్ సాగు విస్తీర్ణం పై దృష్టి పెడుతూ ఉన్న మంత్రిపై అవాకులు చవాకులు పేలుతున్నారని ఆయన ఆరోపించారు. సత్తుపల్లి అశ్వరావుపేట నియోజకవర్గం వ్యాప్తంగా ఉన్న పామాయిల్ రైతులని అడిగితే ఈ పామాయిల్ సాగుపై మంత్రి తుమ్మల కి ఉన్న ప్రత్యేక శ్రద్ధను ఏ రైతైన గంటా పదంగా చెబుతారని ఆలపాటి రామచంద్ర ప్రసాద్ వివరించారు. ఈ విలేకరుల సమావేశంలో ఆలపాటి తో పాటు సీనియర్ నాయకులు పైడి వెంకటేశ్వరరావు, అచ్యుతరావు,

కాసాని నాగప్రసాద్, ఎర్రా వసంతం పామ్ ఆయిల్ రైతులు పాల్గొన్నారు.

# హెడ్ కానిస్టేబుల్స్ గా ఉద్యోగోన్నతి

కోదాడ ఫిబ్రవరి 26(వుదయం)



కోదాడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నందు కానిస్టేబుల్ గా పని చేస్తున్న కె.విద్యాసాగర్ హెడ్ కానిస్టేబుల్స్ గా పదోన్నతి పొందారు. ఈమేరకు జిల్లా పోలీసు కార్యాలయం నందు జిల్లా ఎస్పి నరసింహ ఐపిఎస్ ప్రమోషన్ పొందిన హెడ్ కానిస్టేబుల్ ను ప్రమోషన్ ఉత్తర్వులు అందజేసి, మిఠాయిలు పంచి శుభాకాంక్షలు తెలిపినారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగోన్నతి తో పాటుగా బాధ్యతలు పెరుగుతాయని బాధ్యతలు కు అనుగుణంగా విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఉత్తమ సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలని, పోలీస్ శాఖకు మంచి పేరు తేవాలని కోరారు. క్రమశిక్షణతో మెలగాలని, తోటి సిబ్బందిని గౌరవించాలని సమన్వయంతో ముందుకెళ్లాలని కోరినారు. ఆరోగ్యం పట్ల, కుటుంబాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారుఎస్పీ వెంట పోలీస్ సంఘం అధ్యక్షులు రామచందర్ గౌడ్ సిబ్బంది ఉన్నారు.

## 7వ వార్డు డ్రైనేజీలు సిసి రోడ్లకు నిధుల మంజూరు

*టెండర్లు త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం సమర్పణ...*

మెట్ పల్లి ఫిబ్రవరి 25 (వుదయం విలేఖరి)



మెట్ పల్లి పట్టణ 7వ వార్డు హనుమాన్ నగర్ ఇస్లాంపూర కు డ్రైనేజీలు సిసి రోడ్లు మంజూరు అయినవి ఇట్టి డ్రైనేజీ సిసి రోడ్లు కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు ను కోరగా నిధుల మంజూరు చేయడం జరిగిందని అందుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలని కోరుతూ గురువారం మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రాన్ని అందజేసిన మెట్పల్లి పట్టణ 7వ వార్డు కాంగ్రెస్ పార్టీ

ఇంచార్జ్ అబ్దుల్ జాకీర్

### కోనాపురం లో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి

# కళ్యాణ మహోత్సవం వేడుకలు

*12వ వార్షిక కళ్యాణ మహోత్సవ జాతర ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన గ్రామ పెద్దలు*

నర్సంపేట, ఫిబ్రవరి 26 వుదయం ప్రతినిధి.



వరంగల్ జిల్లా, చెన్నారావుపేట మండలంలో ఎంతో ప్రాచుర్యం పొందిన కోనాపురం శ్రీ లక్ష్మీనరసింహస్వామి గుట్టపై 27 ఫిబ్రవరి రోజున కళ్యాణ మహోత్సవం జరగనుంది.

కోనాపురం గ్రామంలోని గుట్టపై స్వయంభుగా వెలసిన శ్రీ బాల ఉగ్ర నరసింహ స్వామి దేవాలయంలో ప్రతి సంవత్సరం కళ్యాణ మహోత్సవ జాతర ఉత్సవాలను గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహిస్తున్నారు.ఈ సంవత్సరం కూడా 12వ వార్షిక కళ్యాణ మహోత్సవం సందర్భంగా 27 ఫిబ్రవరి శుక్రవారం రాత్రి 8 గంటలకు ఈ కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు గ్రామ అర్చకులు కసిబొజ్జల శివకృష్ణచార్యులు వెల్లడించారు. గురువారం గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డ్ సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామ నాయకులు, గ్రామ యువకుల ఆధ్వర్యంలో కళ్యాణ మహోత్సవ జాతర ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ జాతర ఉత్సవాల్లో భాగంగా 27 ఫిబ్రవరి శుక్రవారం రోజు రాత్రి 8 గంటలకు స్వామివారి కళ్యాణం, 3 మార్చి మంగళవారం రోజున జాతర (ప్రభ బండ్లు), 7 మార్చి శనివారం రోజున స్వామి వారి రథోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు. స్వయంభుగా వెలిసిన శ్రీ బాల ఉగ్ర నరసింహ స్వామి, పాదాలు, పకృతి సాహసిద్ధంగా ఏర్పడిన కోనేరు మరెన్నో ప్రత్యేకలు కలిగిన ఈ దేవాలయాన్ని, జరగబోయే కళ్యాణ మహోత్సవాన్ని మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు,

అధికారులు హాజరై శ్రీ లక్ష్మీనరసింహ స్వామి అనుగ్రహం పొందాలని ఆలయ అర్చకులు గ్రామ పెద్దలు కోరారు.

## అంధ విద్యార్థులకై ప్రత్యేక డిజిటల్ లైబ్రరీ కార్నర్ ప్రారంభం

నల్లగొండ , (వుదయం జిల్లా ప్రతినిధి): నల్లగొండ జిల్లాలో ప్రప్రథమంగా అంధ విద్యార్థులకై ప్రత్యేక డిజిటల్ లైబ్రరీ కార్నర్ సదుపాయాలను నల్లగొండ జిల్లా గ్రంథాలయంలో ప్రారంభించడం గర్వకారణమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం ఏ అఫీజ్ ఖాన్ అన్నారు. గురువారం నల్లగొండ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బ్లైండ్ (దృష్టి లోపం ఉన్న) పాఠకులు, విద్యార్థులకై ప్రత్యేక డిజిటల్ లైబ్రరీ కార్నర్ ను ఆయన ప్రారంభించారు. విద్య అందరికీ సమానంగా అందుబాటులో ఉండాలని, ఇందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బ్లైండ్ విద్యార్థులకు ఏర్పాటు చేసిన సదుపాయాలు, బ్రెయిలి పుస్తకాలు, ఆడియో బుక్స్, ఈ-బుక్స్, స్క్రీన్ రీడర్ సాఫ్ట్‌వేర్‌తో కూడిన కంప్యూటర్లు, ప్రత్యేకంగా చదువుకునే విభాగం, సహాయక సాంకేతిక పరికరాలు ఉపయోగించుకోవాలని చెప్పారు.అనంతరం 2026–27 సంవత్సరానికి సంబంధించిన జిల్లా గ్రంథాలయ సంస్థ వార్షిక బడ్జెట్ సమావేశం గ్రంథాలయ సంస్థ చైర్మన్ అధ్యక్షతన జరిగింది. వార్షిక బడ్జెట్‌కు సమావేశం ఆమోదం తెలిపింది. ఈ బడ్జెట్ ద్వారా గ్రంథాలయాల అభివృద్ధి, పుస్తకాల కొనుగోలు, భవనాల మరమ్మతులు, డిజిటల్ లైబ్రరీ విస్తరణ, భద్రతా చర్యలు వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన చెప్పారు. జిల్లాలో అవసరమైన చోట పబ్లిక్ రీడింగ్ సెంటర్లు ప్రారంభిస్తామన్నారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు గ్రంథాలయ సెస్ ను సకాలంలో చెల్లించాలన్నారు. జిల్లాలోని ప్రతి గ్రంథాలయాన్ని సమగ్ర జ్ఞాన కేంద్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని చైర్మన్ స్పష్టం చేశారు.

# తిరుమల ఘాట్ రోడ్డుపై ప్రమాదం

తిరుమల ,ఫిబ్రవరి 26 (వుదయం ప్రతినిధి):

తిరుమల ఘాట్ రోడ్డుపై జరిగిన ప్రమాదంలో ఓ ద్విచక్రవాహనదారుడు ప్రాణాలు కోల్పోయాడు. మొదటి ఘాట్ రోడ్డులోని అత్యంత ప్రమాదకరమైన మలుపుల్లో ఒకటైన 30వ మలుపు వద్ద ఈ ఘటన జరిగింది.తమిళనాడులోని అరక్కోణం తాలుకా మిట్టపిట్టై గ్రామానికి చెందిన నటరాజన్, మునిరత్నం శ్రీవారి దర్శనం కోసం బైక్‌పై తిరుమలకు వచ్చారు. దర్శనం అనంతరం తిరిగి వెళ్తుండగా మొదటి ఘాట్ రోడ్డులోని 30వ మలుపు వద్ద వారి వాహనం అదుపుతప్పింది. అతి వేగంగా వెళ్తున్న బైక్ నేరుగా రోడ్డు పక్కన ఉన్న పిట్టగోడను ఢీకొట్టింది. దీంతో ఇద్దరు ఎగిరిపడ్డారు.

# ఇంటర్మీడియట్ పరీక్షల కేంద్రాల బందోబస్తు పరిశీలించిన జిల్లా ఎస్పీ డి.జానకి.

**ఉదయం మహబూబ్‌నగర్**

మహబూబ్‌నగర్ జిల్లాలో జరుగుతున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల సందర్భంగా రెండవ సంవత్సరం (సెకండ్ ఇయర్) పరీక్ష నిర్వహణ జరుగుతున్న నేపథ్యంలో, మహబూబ్‌నగర్ టౌన్‌లోని ప్రభుత్వ బాలుర కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి, సందర్శించారు.జిల్లా ఎస్పీ పరీక్ష కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు



లేకుండా జరిగేలా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.పరీక్ష కేంద్ర పరిసర ప్రాంతాలలో 100 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలు చేయడం, అనధికార వ్యక్తులు గుంపులుగా గుమికూడకుండా చర్యలు తీసుకోవడం, మొబైల్ ఫోన్లు మరియు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగంపై కఠిన నిబంధనలు పాటించేలా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. అలాగే ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పరీక్ష సమయాల్లో ప్రత్యేక ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని ట్రాఫిక్ అధికారులకు సూచించారు. విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రానికి చేరుకునేలా సహకరించాలని తెలిపారు.విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రశాంత వాతావరణాన్ని కాపాడాలని, అపోహలు లేదా రూమర్లు నమ్మవద్దని జిల్లా ఎస్పీ గారు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సంబంధిత సర్కిల్ ఇన్స్పెక్టర్, స్టేషన్ హౌస్ ఆఫీసర్ మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాలో భారీ ఆర్థిక కుంభకోణం.. చేతులెత్తేసిన రియల్టర్!

## జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో గతంలో ఎన్నడూ వినని రీతిలో ఒక భారీ ఆర్థిక కుంభకోణం వెలుగులోకి వచ్చింది.




గద్వాల ఫిబ్రవరి 26 (ఉదయం ప్రతినిధి)జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో గతంలో ఎన్నడూ వినని రీతిలో ఒక భారీ ఆర్థిక కుంభకోణం వెలుగులోకి వచ్చింది. కర్ణాటకకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి శ్రీనివాసరెడ్డి ఎమ్మె ఏకంగా 210,26,29,000 (రెండు వందల పది కోట్ల రూపాయల పైచిలుకు) మొత్తానికి గద్వాల కోర్టులో దివాలా పిటిషన్ దాఖలు చేయడం పట్టణమంతా కలకలం సృష్టిస్తోంది. సదరు వ్యాపారి గద్వాలలో కేవలం ఒక అద్దె ఇంట్లో నివసిస్తూ ఇంతటి పెను దారుణానికి ఒడిగట్టడం స్థానికులను విస్మయానికి గురి చేస్తోంది.కర్ణాటకలో ఉన్న అప్పుల కోసం గద్వాల కోర్టులో ఎత్తుగడ?సదరు వ్యాపారి కర్ణాటకలో భారీగా అప్పులు చేసి, వాటి నుండి చట్టపరంగా తప్పించుకోవడానికి గద్వాల కోర్టును ఒక రక్షణ కవచంలా వాడుకుంటున్నారనే చర్చ గద్వాల బజారులో జోరుగా సాగుతోంది. ఇక్కడ అద్దె ఇంట్లో ఉంటూ, స్థానిక కోర్టులో పిటిషన్ (IP 01/2026) వేయడం ద్వారా తన అప్పులన్నింటికీ ముగింపు పలకాలని చూస్తున్నాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయిబాధితుల్లో గద్వాల వాసులు.. ఒక్కొక్కరిది 'కోటి' రూపాయల నష్టం!ఈ కుంభకోణంలో బాధితుల సంఖ్య అక్షరాలా 226 మంది. ఇందులో కర్ణాటక వారితో పాటు గద్వాల పట్టణానికి చెందిన పలువురు వ్యక్తులు కూడా పెద్ద మొత్తంలో డబ్బులు కోల్పోయినట్లు సమాచారం. 36 శాతం భారీ వడ్డీ ఆశ చూపి స్థానికుల నుంచి కూడా అతను వసూళ్లు చేసినట్లు తెలుస్తోంది. మొత్తం అప్పుల లెక్కను బాధితుల సంఖ్యతో పోలిస్తే, సగటున ఒక్కొక్క బాధితుడు దాదాపు కోటి రూపాయల మేర నష్టపోయినట్లు స్పష్టమవుతోంది.నమ్మకం మునిగింది.. 226 కుటుంబాలు వీధిన!జీవితకాల కష్టార్జితాన్ని, పిల్లల పెళ్లిళ్ల కోసం దాచుకున్న సొమ్మును నమ్మకంతో ఒక అద్దె ఇంట్లో ఉండే వ్యక్తికి అప్పగించిన బాధితులు ఇప్పుడు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. "వేరే రాష్ట్రం నుంచి వచ్చి, మా గడ్డపైనే దివాలా తీసి మమ్మల్ని ముంచడమేంటి?" అని గద్వాల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గద్వాల చరిత్రలోనే ఇది అతిపెద్ద ఆర్థిక దారుణంగా చర్చనీయాంశమైంది. ఈ వ్యవహారంలో బాధితుల జాబితాలో మీ పేరు లేదా మీకు తెలిసిన వారి పేరు ఉందో లేదో వెంటనే న్యాయ నిపుణుల ద్వారా ధృవీకరించుకోండి. ఇటువంటి భారీ వడ్డీ ఆశ చూపే లావాదేవీల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలి.

# డిజిటల్ విప్లవంతో మారిన ప్రపంచ గతి.

## పల్లె యాప్ ఆవిష్కరణ సభలో ఎమ్మెల్యే కవ్వంపల్లి.



కరీంనగర్, ఫిబ్రవరి 26 (ఉదయం ప్రతినిధి) : డిజిటల్ విప్లవంతో ప్రపంచ గతి మారిపోయిందని టీపీసీసీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. గురువారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్ లో వి.సాయి సుమంత్ నేతృత్వంలో నూతనంగా రూపొందించిన పల్లె యాప్ ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఇంటర్నెట్ వల్ల ప్రపంచమే కుగ్రామంగా మారిపోయిందని, స్థానిక వార్తలతోపాటు దేశ, అంతర్జాతీయ వార్తలు, విశేషాలను అప్పటికప్పుడు తెలుసుకోగలుగుతున్నామన్నారు. వర్తమానాన్నే కాదు భవిష్యత్తును కూడా ప్రభావితం చేసేంతంగా ఇంటర్నెట్ మార్పు తెచ్చిందన్నారు. ప్రతి ఒక్కరి జీవితాల్ని డిజిటల్ మయంగా మార్చేశాయన్నారు. మారిన పరిస్థితులకు అనుగుణంగా పల్లె యాప్ ను సాయి సుమంత్ రూపొందించడం శుభ పరిణామమని ఆయన పేర్కొన్నారు. గ్రామీణ వార్తా విశేషాలతోపాటు విద్య,ఉద్యోగావకాశాలపై విద్యార్థులు, నిరుద్యోగులకు, విద్యార్థులకు సమాచారం,చిరు వ్యాపారులకు అడ్వర్టయిజింగ్, పోస్టర్ల తయారీకి సంబంధించిన సమాచారాన్ని పల్లె యాప్ ద్వారా అందించడం సంతోషకరమని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత ఊట్కూరి నరేందర్ రెడ్డి, కరీంనగర్ నియోజవర్గ మాజీ ఇంచార్జీ పురమల్ల శ్రీనివాస్, 27వ డివిజన్ కార్పొరేటర్ శ్యామల కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.అనంతరం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కొండ సత్యలక్ష్మి గార్డెన్స్ లో జరిగిన కే.ఎస్. అనంతాచార్య కుమార్తె వివాహానికి ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# క్షయ వ్యాధి నిర్మూలన సామాజిక బాధ్యత.

మధిర ఫిబ్రవరి 26, ఉదయం ప్రతినిధి. వైద్య మరియు ఆరోగ్య శాఖ,జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ వి సుబ్బారావు ఆదేశాల మేరకు మధిర మండలం, ఖమ్మంపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ బట్ట అంజన్ బాబు ఆధ్వర్యంలో క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు మరియు డిజిటల్ ఎక్స్రే ద్వారా నిర్ధారించడం జరిగింది.ఈ సందర్భంగా క్షయ వ్యాధి లక్షణాలు అయినా వారానికి మించిన దగ్గు,ఆకలి మందగించడం బరువు తగ్గడం సాయంత్రం జ్వరం రావడం చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉన్న వారు దగ్గరలో



ని ప్రభుత్వ ఆసుపత్రి నందు తెమడ పరీక్ష ,లేదా ఎక్స్రే పరీక్షలు చేయించుకోవాలని,క్షయ అంటువ్యాధి కనుక ఇతరులకు వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకొని మందులు క్రమం తప్పకుండా వాడినట్లయితే క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చని క్షయ వ్యాధిపై అవగాహన కలిగి ఉండి క్షయ వ్యాధి రహిత ఖమ్మంపాడుగా కృషిచేయాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ పృధ్వి రాజ్ నాయక్,సీనియర్ చికిత్స పర్యవేక్షకులు సందీప్,శివ,ఉపేందర్, ఉప సర్పంచ్ ఉషారాణి గ్రామ కార్యదర్శి అర్చన, టీబి నోడల్ పర్సన్ కొండయ్య,హెచ్.వి సుబ్బలక్ష్మి,సిహెచ్ఓ వడ్లమూడి వెంకటేశ్వరరావు,ముప్వ వెంకయ్య బాబు,ఆశా కార్యకర్తలు నాగూర్ బి, విజయ, గ్రామపంచాయతీ సిబ్బంది మరియు ఐకెపి అంగన్వాడి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# పేదలకు సొంతింటి కల నెరవేరుస్తున్న ఇందిరమ్మ ఇండ్లు



వెల్దండ ఫిబ్రవరి 26 (ఉదయం ప్రతినిధి) పేదలకు సొంతింటి కల నెరవేరుస్తున్న ఇంద్రమ్మ ఇండ్ల పథకం అని రాష్ట్ర ముఖ్యమంత్రి సోదరుడు ఎనుముల తిరుపతిరెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ లు పేర్కొన్నారు మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా నిర్మించిన రాంపురం శ్రీనివాస్ నూతన గృహాన్ని వారు గృహప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల చిరకాల వాంఛ అయిన సొంతిల్లు కల నేటికి నెరవేరిందని రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని అన్నారు కల్వకుర్తి ప్రాంతాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని వారు అన్నారు అనంతరం ఇంటి యజమాని రాంపురం శ్రీను కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా ముఖ్య అతిథులను శాలువాలతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సర్పంచ్ మ,ట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ భూపతి రెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, పర్వత రెడ్డి, సంజీవ యాదవ్, జంగయ్య యాదవ్, ఉప సర్పంచ్ ఎర్ర శీను, , రమేష్, పుల్లయ్య, హరికిషన్ నాయక్, రాజు యాదవ్, తోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు

# జాతీయ సెమినార్‌కు ముస్తాబవుతున్న కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల



**కామారెడ్డి, ఫిబ్రవరి 26 (ఉదయం):** స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (స్వయంప్రతిపత్తి) లో రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 27, 28 తేదీలలో నిర్వహించనున్న జాతీయ సెమినార్ కోసం కళాశాల సర్వాంగ సుందరంగా సిద్ధమవుతోంది. 60 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగి, న్యాక్ 'ఏ' గ్రేడ్ సాధించిన ఈ కళాశాల, ఇప్పుడు జాతీయ స్థాయి అతిథులకు స్వాగతం పలికేందుకు ముస్తాబవుతోంది.కళాశాల ప్రవేశ ద్వారం వద్ద రోడ్డుకు ఇరువైపులా మట్టితో చదును చేసి సుందరీకరణ పనులు చేపట్టారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు పెయింటింగ్ పనులు పూర్తి చేసి స్వచ్ఛమైన వాతావరణాన్ని కల్పించారు. సెమినార్ కోసం అత్యాధునిక డిజిటల్ సెమినార్ హాల్‌ను సిద్ధం చేశారు. ఈ సెమినార్‌కు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి, జాతీయ మరియు రాష్ట్ర స్థాయి విశ్వవిద్యాలయాల నుంచి ప్రముఖ ఆచార్యులు, విశ్లేషకులు విచ్చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకృష్ణారెడ్డి, కళాశాల విద్యకమిషనర్ శ్రీమతి దేవసేన ఐఏఎస్, ప్రస్తుత రేరా చైర్మన్, పూర్వ కామారెడ్డి కలెక్టర్ డాక్టర్ సత్యనారాయణ తదితరులు హాజరుకానున్నారు.నూతన విద్యా విధానం 'లో మార్పులు, దేశాభివృద్ధిలో ఉన్నత విద్య ప్రాధాన్యతపై ఆచార్యులు, పరిశోధక విద్యార్థులు తమ పరిశోధనా పత్రాలను సమర్పించనున్నారు. "ఈ జాతీయ సెమినార్ నిర్వహణ ద్వారా కళాశాల ర్యాంకింగ్‌ను, నాణ్యతా ప్రమాణాలను మరింత మెరుగుపరుచుకునే అవకాశం ఉందని డాక్టర్ కె. విజయ్ కుమార్, ప్రిన్సిపాల్ & సెమినార్ చైర్మన్ అన్నారు. "ప్రతిష్ఠాత్మకమైన మా కళాశాలలో ఈ సెమినార్ నిర్వహించడం వల్ల విద్యాపరంగా కళాశాల కీర్తి మరింత పెరుగుతుందని డాక్టర్ కె. కిష్టయ్య, వైస్ ప్రిన్సిపల్, సెమినార్ కన్వీనర్ తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్

## రాయల నాగేశ్వరరావు,డిసిసి అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్.

**ఖమ్మం ఉదయం బ్యూరో ఫిబ్రవరి 26**

ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం బుద్ధారం గ్రామంలో పర్వతు కనకయ్య ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు,డిసిసి మాజీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు,కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సొంతింటి కల సాకారం చేస్తోందని వారు పేర్కొంటు, లబ్ధిదారుడికి కొత్త పట్టు పట్టు వస్త్రాలు అందజేసి ,శుభాకాంక్షలు తెలియజేశారు... అనంతరం లబ్ధిదారుడి ఇంట్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యంతో భోజనం చేశారు...



# ముఖ్యమంత్రి సోదరుడు ఎనుముల తిరుపతిరెడ్డికి ఘన సన్మానాలు



వెల్దండ ఫిబ్రవరి 26 (ఉదయం ప్రతినిధి) రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సోదరుడు ఎనుముల తిరుపతిరెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మండల కేంద్రానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మాజీ సర్పంచ్ భూపతి రెడ్డి నివాసానికి విచ్చేసిన సందర్భంగా శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు సుమారు రెండు గంటల పాటు కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధి పై చర్చించారు కార్యక్రమంలో నాగర్ కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాడుగుల రామ్ రెడ్డి, సాయి రెడ్డి, వైకృష్ణారెడ్డి, గ్రామ సర్పంచ్ మ,ట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ రమాకాంత్ రెడ్డి,, రాజశేఖర్, శ్రీనివాస్ గౌడ్, మదన్ గౌడ్, సమీర్ బాబా, తో పాటు పలువురు నాయకులు ఉన్నారు

# వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు

**మిషన్ భగీరథ పైప్‌లైన్ మరమ్మత్తుల పరిశీలన – దోమల మందు పిచికారి ప్రారంభం**



**కోదాడ, ఫిబ్రవరి 26: (ఉదయం )**

వేసవిలో పట్టణంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని కోదాడ మునిసిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ వెంకట్ రత్నం బాబు తెలిపారు. గురువారం పట్టణంలోని సూర్యాపేట రోడ్డుపై ప్రధాన రహదారి పక్కన మిషన్ భగీరథ మెయిన్ పైప్‌లైన్‌కు జరుగుతున్న మరమ్మత్తు పనులను ఆమె పరిశీలించారు. నీటి సరఫరా అంతరాయం లేకుండా పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం 21వ వార్డులో దోమల నివారణ కోసం ప్రత్యేక మందు పిచికారీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పట్టణంలో దోమల సమస్య నివారణకు సమగ్ర చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు పరిశుభ్రత పాటిస్తూ మున్సిపాలిటీకి సహకరించాలని కోరారు.తదుపరి 22వ వార్డులో రహదారి సమస్యలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కట్టెబోయిన జ్యోతి శ్రీనివాస్, తూనం కృష్ణ, నాయకులు ఎర్నేని వెంకట్ రత్నం బాబు, కట్టెబోయిన శ్రీనివాస్, ధనమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# మర్పడగా, రాంపల్లి గ్రామాలను సందర్శించిన ఎన్ఐఆర్డి అధికారులు

**కొండపాక (ఉదయం ప్రతినిధి)** గురువారం రోజు మండల పరిధిలోని మర్పడుగా, రాంపల్లి గ్రామాలలో నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ కు చెందిన మహారాష్ట్ర,లడక్, దోద్రా నగర్, హవేలీ,ఒడిశా, పంజాబ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలనుండి టీం లీడర్ అయిన దిగంబర్, సోనాల్ మొబార్ ఆధ్వర్యంలో అధికారులు ఈ రెండు గ్రామాలలో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన ఆయిల్ పాం ప్లాంటేషన్, యాదవ కమ్యూనిటీ గొర్ల షెడ్లు, రైతు వేదిక, నిర్మాణాలు, ఫామ్ పాండ్స్, డంపింగ్ యార్డ్స్, స్మశాన వాటికలు



ఫీడర్ ఛానల్ వంటి పనులను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలు రాష్ట్రాల నుంచి వచ్చిన అధికారుల తో పాటు కొండపాక ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఈసీ ప్లాంటేషన్ మేనేజర్, డిటిసి టెక్నికల్ అసిస్టెంట్లు, ఎస్ బి ఎం కోఆర్డినేటర్ చెన్నారెడ్డి, మర్పడగా, రాంపల్లి సర్పంచులు బాలరాజు, బొమ్మ ఎల్లయ్య తో పాటు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వార్డు సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# మద్యం సేవించి వాహనం నడపడం వల్ల క్షణిక నిర్లక్ష్యం జీవితాంతం బాధకు దారితీస్తుంది.

## వైరా ఏసీపీ సారంగపాణి.




**మధిర,ఫిబ్రవరి26 ఉదయం ప్రతినిధి:**

రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని వైరా ఏసీపీ సారంగపాణి అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో చైతన్యం కల్పించాలనే ఉద్దేశంతో బోనకల్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ క్యాంపెయిన్2026 (ఫేజ్ -2) కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వైరా ఏసీపి వాహనదారులకు రోడ్డు నియమాల ప్రాముఖ్యతను వివరించారు.ముఖ్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్ కారణంగా జరిగే ప్రమాదాలు,కుటుంబాలపై పడే ప్రభావం,చట్టపరమైన చర్యలు, ప్రాణనష్టం వంటి అంశాలను నొక్కి చెప్పారు.మద్యం సేవించి వాహనం నడపడం వల్ల క్షణిక నిర్లక్ష్యం జీవితాంతం బాధకు దారితీస్తుందని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు ప్రయాణికులు సీటు బెల్ట్ ధరించడం తప్పనిసరని,మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, మొబైల్ వాడకం,సిగ్నల్ జంపింగ్, ఓవర్ స్పీడ్, ఓవర్ లోడింగ్ నివారించాలన్నారు.ఎల్లప్పుడూ ఎడమ వైపున ఉంటూ,జీబ్రా క్రాసింగ్ ఉపయోగించాలని తెలిపారు.కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ మధు,ఎస్సై వెంకన్న పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల ప్రొసిడింగ్ పత్రాలు

**జయశంకర్ భూపాలపల్లి ఫిబ్రవరి 26 (ఉదయం జిల్లా ప్రతినిధి):**



రాపెల్లికోట గ్రామ పంచాయతీ ఆవరణలో గురువారం సర్పంచ్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులకు ప్రొసిడింగ్ పత్రాలు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో కార్యదర్శి ప్రసాద్, ఇందిరమ్మ కమిటి అధ్యక్షుడు కాటివేని రాజయ్య, కమిటి సభ్యులు బట్టి దేవక్క, మోతే రాజయ్య, ప్రచార కమిటి చైర్మన్ మోతే చంద్రయ్యా, వార్డు సభ్యులు, అట్టెం రాజు, దేవ్వక్క, గురజాల బాల కృష్ణా, బట్టి శ్రీశైలం, కండెల రాజబాబు, యూత్ కాంగ్రెస్ నాయకులు కాట్రేవుల నవీన్, దేనవేన వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు

# అనాధ శరణాలయానికి రూ.5 వేల ఆర్థిక సహాయం

**కోదాడ, ఫిబ్రవరి 26: (ఉదయం)**

పట్టణ పరిధిలోని అశోక్‌నగర్‌లో గల శనగల రాధాకృష్ణ మానసిక వికలాంగుల కేంద్రానికి రూ.5,000ల ఆర్థిక సహాయం అందింది. మండల పరిధిలోని కూచిపూడికి చెందిన సర్పంచ్ కాసాని సంధ్య వెంకటేశ్వర్లు తమ తల్లిదండ్రులు కాసాని భారతమ్మ-నాగయ్యల జ్ఞాపకార్థం గురువారం ఈ మొత్తాన్ని కేంద్ర నిర్వాహకులకు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికలాంగుల కేంద్రంలో ఉన్న పేద పిల్లలకు అన్నదానం నిర్వహించేందుకు ఈ సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరూ తమకు



ఉన్న దాంట్లో కొంత భాగాన్ని పేదలు, అనాథలకు కేటాయించి ఆదుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శెట్టి లక్ష్మయ్య, గంట లక్ష్మీ నారాయణ, శెట్టి రామానాయుడు, శిరంశెట్టి ఉపేందర్, తరుణ్, రెడ్డబోయిన స్వామి తదితరులు పాల్గొన్నారు.

# నిస్వార్థ సేవకుడు నిరంతర ప్రజా

జయశంకర్ భూపాలపల్లి ఫిబ్రవరి 26(ఉదయం జిల్లా ప్రతినిధి):మహాదేవపూర్ మండల కాంగ్రెస్‌లో కట్కం అశోక్ ఒక ప్రత్యేకమైన బ్రాండ్‌గా నిలుస్తున్నారు.నిరంతరం ప్రజా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల హృదయాలను గెలుచుకుంటూ, మండలంలో రైజింగ్ లీడర్‌గా ఎదుగుతున్నారు గ్రామ స్థాయి నుండి మండల స్థాయి వరకు ప్రజల సమస్యలను పట్టించుకుని, రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీను బాబు దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తూ మండలవ్యాప్తంగా మంచి గుర్తింపు పొందారు. ముఖ్యంగా యువతతో సత్సంబంధాలు పెంపొందిస్తూ, వారిని పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా భాగస్వామ్యం చేయడంతో పాటు పార్టీ ఎదుగుదలకు ప్రత్యేక కృషి చేస్తున్నారు అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు విజయం కోసం మండల నాయకులతో కలిసి అహర్నిశలు శ్రమించి, మండలంలో గణనీయమైన మెజారిటీ రావడంలో కీలక పాత్ర పోషించారు. పార్టీ పట్ల అంకితభావం, నాయకత్వ లక్షణాలు, సేవా దృక్పథం కట్కం అశోక్‌ను ప్రత్యేక నాయకుడిగా నిలబెట్టాయి.మండల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న కట్కం అశోక్ ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మహాదేవపూర్ మండలంలోని తన స్వంత గ్రామం



బెగ్లూర్ లో భారీ మెజారిటీతో సర్పంచ్ అభ్యర్థిని గెలిపించుకున్నారు.ఇదే కాక పార్టీ కార్యక్రమాలను తనవంతుగా నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు. మారుమూల గ్రామం బెగ్లూర్ నుండి తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన అశోక్ యువజన కాంగ్రెస్ నాయకునిగా దశాబ్దకాలంగా పని చేస్తూ గ్రామంలో తన నాయకత్వ ముద్రతో కాంగ్రెస్ పార్టీని ముందు వరుసలో నిలిపి పలుమార్లు సర్పంచ్, ఎంపీటీసీ, పదవులు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకే దక్కేలా చేసిన కృషి అభినందనీయం.గతంలో కరుడుగట్టిన కాంగ్రెస్ వాదిగా ఉన్న ఆకుల నారాయణ సేవలను మరిపించి గ్రామంలో తనదైన ముద్ర వేశారు మంత్రి శ్రీధర్ బాబు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీను బాబుకు మంథని నియోజకవర్గంలో కట్కం అశోక్ ప్రధాన అనుచరుడు అయినప్పటికీ పదవులు దక్కకపోవడంపై అశోక్ అభిమాన కార్యకర్తలు నిరాశకు గురవుతున్నారానే చర్చలు జరుగుతున్నాయి ఇదిలా ఉంటే ఇప్పటి వరకు ఎలాంటి పదవులను ఆశించకుండా చేసిన సేవలకు పార్టీలో ప్రత్యేక నాయకుడిగా గుర్తింపు పొందారు కాంగ్రెస్ పార్టీకి దశాబ్ద కాలంగా నిస్వార్థ సేవకునిగా సీనియర్,యువజన నాయకులతో కలిసి పార్టీకి అందిస్తున్న సేవలను గుర్తించి పార్టీ అధిష్టానం కీలక పదవులు అందించేనా లేక రాబోవు ఎంపీపీ, జడ్పీటీసీ ఎన్నికల్లో ప్రజాప్రతినిధిగా నిలబెట్టి ప్రజా సేవకు అవకాశం కల్పించేనా అంటు తన అనుచరులు అభిమాన కాంగ్రెస్ కార్యకర్తలు చర్చించుకుంటున్నారు మరోవైపు మంత్రి శ్రీధర్ బాబు, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీను బాబు నేతృత్వంలో అశోక్ కు ఉన్నతమైన పదవి అవకాశం దక్కుతుందని కార్యకర్తలు నాయకులు ఆశాభవం వ్యక్తం చేస్తున్నారు ఇదిలా ఉంటే పార్టీకి నిస్వార్థ సేవలందించే వారికి ఎలాంటి గౌరవం దక్కుతుందో వేచి చూడాల్సిందే.

# మదర్సా దారులు విద్యార్థులకు చెక్కుల పంపిణీ



నారాయణపేట ఫిబ్రవరి 26(ఉదయం ప్రతినిధి)భిష్మరాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మదర్సా దారుల్ ఉలూమ్ అష్రఫియా విద్యార్థుల కోసం 85 వేల చెక్కు అందజేశారు.నారాయణపేట జిల్లాలోని కొలం పల్లి గ్రామంలో ఉన్న మదర్సా దారుల్ ఉలూమ్ అష్రఫియా, కొలం పల్లి విద్యార్థుల కోసం 85 వేల చెక్కును ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రాజ్ కుమార్ రెడ్డి అష్రఫియా ఎడ్యుకేషన్ సొసైటీ, కొలం పల్లి నాజిమ్ డాక్టర్ సయ్యద్ అహ్మద్ హుసేని అష్రఫీ కి అందజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ సయ్యద్ అహ్మద్ హుసైనీ మాట్లాడుతూ విద్యార్థులకు ఆధునిక యుగానికి అనుగుణంగా కంప్యూటర్ విద్యను అందించేందుకు ఫౌండేషన్ అందించిన 85 వేల (కంప్యూటర్ల కోసం) ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఈ సహాయానికి భిష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రాజ్‌కుమార్ రెడ్డి కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.భీష్మరాజ్ ఫౌండేషన్ నారాయణపేట జిల్లాలో పలు ఫలాహీ కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజానికి సేవలందిస్తోందని, ఇది అభినందనీయమని పేర్కొన్నారు. డాక్టర్ రాజ్‌కుమార్ రెడ్డి సేవలను ప్రశంసిస్తూ అనంతరం వారికి సన్మానం చేశారు.

తదుపరి డాక్టర్ రాజ్‌కుమార్ రెడ్డి కొలం పల్లి పర్యటనలో భాగంగా బరాక్ ఖాతాలి కొల్లంపల్లి వద్ద హాజరై దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు స్థానిక కొలం పల్లి నాయకులు పాల్గొన్నారు.

# దమ్మక్కపల్లి పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం

ఉదయం న్యూస్ కొండపాక ప్రతినిధి ఫిబ్రవరి 26మండల పరిధిలోని దమ్మక్కపల్లి మండల ప్రజాపరిషత్ పాఠశాలలో గురువారం రోజు స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించుకున్నారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగాపాల్గొన్న మండల నోడల్ అధికారివిఠల్,పాఠశాలప్రధానోపాధ్యాయుడు రామచంద్రారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఉపాధ్యాయ పాత్ర పోషించిన విద్యార్థులను అభినందించారు , అనంతరం వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి యొక్క ప్రాముఖ్యతతో పాటు, ఉపాధ్యాయ వృత్తిలో ఉండే ఇబ్బందులను అర్థం చేసుకోవడమే కాకుండా, చక్కటి విద్యార్థులుగా తయారు కావడానికి, జీవితంలో ఉన్నత మెట్లు ఎక్కడానికి ఈ స్వయం పరిపాలన దినోత్సవం ఎంతగానో దోహదపడుతుంది అన్నారు. ఈ పరిపాలన దినోత్సవం లో డీఈఓ గా కళ్యాణి, ఎంఈఓ గా రిషిత్, ఎంఎన్ఓ గా శివాని, హెచ్ఎం గా మహేష్ వ్యవహరించారు. ఇట్టి కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు

## అనిల్ అంబానీ నివాసం అటాచ్ చేసిన ఈడీ



రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీకి చెందిన ముంబయి నివాసం 'అబోడ్'ను ఈడీ అధికారులు అటాచ్ చేశారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. 17 అంతస్తులతో 66 మీటర్ల ఎత్తున్న ఈ విలాసవంతమైన ఇల్లు.. ముంబయిలోని పాలి హిల్ ప్రాంతంలో ఉంది. దీని విలువ సుమారు రూ.3,716 కోట్లు ఉంటుందని అంచనా. అనిల్ గ్రూప్ కంపెనీలు కోట్ల రూపాయల బ్యాంకు రుణాల మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి.

# బిజినెస్

## ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో రూ.590 కోట్ల మోసానికి మాస్టర్‌మైండ్ అతడే..!




ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో రూ.590కోట్ల మోసం ఘటన బ్యాంకింగ్ రంగంలో సంచలనం సృష్టించింది. ఈ కేసు దర్యాప్తులో కీలక విషయాలు బయటపడ్డాయి. ఈ కుంభకోణం సూత్రధారి బ్యాంకు మాజీ ఉద్యోగేనని తేలింది. బ్యాంకింగ్ ప్రక్రియను తారుమారు చేసి ప్రభుత్వానికి చెందిన ఈ నిధులను అతడు షెల్ కంపెనీలకు మళ్లించినట్లు వెల్లడైంది. దీంతో ఆ మాస్టర్‌మైండ్ సహా అతడికి సహకరించిన మరో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. హరియాణా (Haryana)లో చండీగఢ్‌లోని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ శాఖలో జరిగిన మోసం కేసులో నలుగురు నిందితులను పోలీసులు మంగళవారం రాత్రి అరెస్ట్ చేశారు. నిందితులను రిభవ్ రిషి, అభయ్ కుమార్, అభిషేక్ సింగ్లా, స్వాతి సింగ్లాగా గుర్తించారు. వీరిలో ఇద్దరు గతంలో ఐడీఎఫ్‌సీ బ్యాంకులో పనిచేసిన ఉద్యోగులు కాగా.. మరో ఇద్దరు ప్రైవేటు వ్యక్తులని పోలీసులు తెలిపారు. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకులో మాజీ మేనేజర్ అయిన రిభవ్ రిషి ఈ మోసానికి మాస్టర్‌మైండ్ అని, అతడే ఈ కుట్ర మొత్తాన్ని అమలుచేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం రిషి చండీగఢ్‌లోని ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లో పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈనేపథ్యంలో నిందితులను విచారిస్తున్నట్లు పేర్కొన్నారు. హరియాణా ముఖ్యమంత్రి గ్రామీణ్ ఆవాస్ యోజన-2.0 స్కీమ్‌కు సంబంధించిన నిధులను జమ చేసేందుకు ఆ విభాగం అధికారులు 2025 సెప్టెంబరు 26న ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల్లో రెండు ఖాతాలు తెరిచారు. తొలుత ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో రూ.50కోట్లు, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లో రూ.25 కోట్లు జమ చేశారు. అయితే, ఆ నిధులను వినియోగించేందుకు రాష్ట్ర ఆర్థిక శాఖ నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాకపోవడంతో ఈ ఖాతాలను మూసివేయాలని ప్రభుత్వ అధికారులు నిర్ణయించుకున్నారు. ఆ ఖాతాల్లో ఉన్న డబ్బు మొత్తాన్ని వడ్డీతో సహా మరో ఖాతాకు బదిలీ చేయాలంటూ ఈ రెండు బ్యాంకులకు ఈ ఏడాది జనవరి 13న లేఖలు పంపారు. దీంతో జనవరి 16న ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ రూ.25.45 కోట్లను హరియాణా ప్రభుత్వానికి చెందిన మరో అకౌంట్‌కు బదిలీ చేసి తమ ఖాతాను మూసేసింది. అయితే, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ మాత్రం కేవలం రూ.1.27 కోట్లను మాత్రమే ట్రాన్స్‌ఫర్ చేసింది. దీంతో ఖాతాలో ఉన్న రూ.50 కోట్ల నిధులు ఏమయ్యాయని హరియాణా ప్రభుత్వ విభాగం బ్యాంకును ప్రశ్నించింది. దీనికి బ్యాంకు నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో విచారణ కమిటీ వేసింది. ఈ విచారణలో విస్తుపోయే విషయాలు బయటపడ్డాయి. ప్రభుత్వ అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి ఆ ఖాతా నుంచి నిధులను షెల్ కంపెనీలకు చెందిన మరో బ్యాంకు ఖాతాలకు బదిలీ చేసినట్లు తేలింది. ఈ కుట్రంతా రిభవ్ రిషినే చేసినట్లు తెలిసింది. ఈ సందర్భంగా బ్యాంకులో నిర్వహణపరమైన లోపాలు కూడా బయటపడ్డాయి. తప్పుల తడకగా కొన్ని లావాదేవీలను నిర్వహించినట్లు తెలిసింది. దీంతో గుట్టు లాగగా.. ప్రభుత్వ ఖాతాల్లోని మొత్తం రూ.590 కోట్ల నిధులను దారి మళ్లించినట్లు తేలింది. దీనిపై దర్యాప్తు చేపట్టిన అధికారులు.. ఇప్పటికే ఆ సొమ్ము మొత్తాన్ని రికవరీ చేసినట్లు హరియాణా సీఎం నాయబ్ సింగ్ సైనీ వెల్లడించారు. ఈ మోసం నేపథ్యంలో ప్రభుత్వ ఖాతాలను నిర్వహించకుండా ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌పై నిషేధం విధించినట్లు పేర్కొన్నారు.

## మరోసారి ట్రంప్ టార్గెట్‌లో భారత్..

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి భారత్‌ను టార్గెట్ చేశారు. మన దగ్గరి నుంచి అమెరికాకు దిగుమతి అయ్యే సోలార్ ఉత్పత్తులపై (Solar Imports) ప్రాథమికంగా 126 శాతం డ్యూటీ విధించారు. ఇండోనేసియాపై ప్రాథమిక సుంకాలను 86 శాతం నుంచి 143 శాతానికి పెంచారు. లావోస్‌పై 81 శాతం డ్యూటీ వేశారు. ఫారెన్ సబ్సిడీల ఆధారంగా రేటును నిర్ధరించినట్లు అమెరికా వాణిజ్య శాఖ వెల్లడించింది. ఈ మూడు దేశాల నుంచి అగ్రరాజ్యానికి దిగుమతి అవుతోన్న సెల్స్, ప్యానెల్స్ వంటి సోలార్ దిగుమతుల విలువ 4.5 బిలియన్ డాలర్లని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. తమ సోలార్ ఉత్పత్తులపై ఈ దేశ ప్రభుత్వాలు అసంబద్ధ రీతిలో సబ్సిడీలు ఇస్తున్నాయని ట్రంప్ (Donald Trump) ప్రభుత్వం వాదిస్తోంది. అమెరికా ఫస్ట్ విధానానికి ట్రంప్ తొలి ప్రాధాన్యం ఇస్తున్నారు. స్థానిక తయారీని ప్రోత్సహించడానికి తాపత్రయపడుతున్నారు. ఈ అధిక డ్యూటీ కారణంగా అమెరికా వినియోగదారులు సోలార్ దిగుమతులపై ఎక్కువ చెల్లించాల్సి ఉంటుంది. ఇదిలా ఉంటే.. ప్రపంచ దేశాలపై ఇప్పటికే ట్రంప్ ఎడాపెడా విధించిన సుంకాలను అమెరికా సుప్రీంకోర్టు రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఇలాంటి సమయంలో ఈ డ్యూటీ విధింపు ప్రాధాన్యం సంతరించుకుంది.



## ఏఐకి టీసీఎస్ భయపడదు: సీఈఓ కృతివాసన్



కృత్రిమ మేధ సాంకేతికతకు దిగ్గజ ఐటీ సంస్థ టీసీఎస్ (TCS) భయపడదని ఆ సంస్థ సీఈఓ కృతివాసన్ పేర్కొన్నారు. ఏఐ వల్ల సంభవించే మార్పులకు అనుగుణంగా కంపెనీ విధానాలు మార్చుకుంటున్నామని అన్నారు. సంస్థ వార్షిక ఈవెంట్‌లో మాట్లాడిన ఆయన.. ఏఐ టూల్స్ వినియోగంతో స్వీయ ఆదాయం తగ్గినా ఫర్వాలేదన్నారు. వీటిని ఉపయోగించాలని సిబ్బందిని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఏఐ ఆధారిత సాంకేతికత వినియోగంలో యువ నిపుణులతో పోలిస్తే సీనియర్ స్థాయి ఉద్యోగులు నెమ్మదిగా ఉన్నట్లు గుర్తించామని కృతివాసన్ పేర్కొన్నారు. తమ ఆరు లక్షల సిబ్బందిలో ఏఐ నైపుణ్యాలు ఉండాలని భావిస్తున్నామన్న ఆయన.. ఉద్యోగులు కూడా కష్టపడాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధి అవకాశాలను నూతన సాంకేతికత దెబ్బతీస్తుందనే విషయంపై సంస్థ భయపడదన్నారు.

## విమానయాన సంస్థల నష్టాలు రూ.17,000-18,000 కోట్లు: ఇక్రా అంచనా



ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2025-26) భారత విమానయాన సంస్థల నష్టాలు రూ.17,000- 18,000 కోట్లుగా ఉండొచ్చని రేటింగ్స్ సంస్థ ఇక్రా అంచనా వేసింది. 2024-25 నష్టం రూ.5500 కోట్లతో పోలిస్తే ఇది చాలా ఎక్కువ అని పేర్కొంది. అయితే వచ్చే ఆర్థిక సంవత్సరంలో మాత్రం నష్టాలు రూ.11,000- 12,000 కోట్లకు పరిమితం కావచ్చని వెల్లడించింది. దేశీయంగా విమాన ప్రయాణికుల రద్దీ పెరుగుతుండటం, డిసెంబరులో ఇండిగో పరిణామాల తర్వాత తిరిగి కార్యకలాపాలు సాధారణ స్థాయికి రావడం ఇందుకు దోహదం చేస్తాయని ఇక్రా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కింజాల్ షా తెలిపారు. 2025-26లో నష్టాలు బాగా పెరిగే అవకాశం ఉన్నప్పటికీ.. దేశీయ విమానయాన రంగంపై 'స్థిరత్వం'తో కూడిన అంచనానే కొనసాగిస్తున్నట్లు ఇక్రా పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి దేశీయ విమాన ప్రయాణికుల సంఖ్యలో పెరుగుదల 4-6% ఉంటుందని గతంలో అంచనా వేయగా, ప్రస్తుతం 0-3 శాతానికి ఇక్రా తగ్గించింది. వాతావరణ ప్రతికూలతలు, 2025 జూన్‌లో విమానం కూలిన ఘటన, డిసెంబరులో ఇండిగో సర్వీసుల రద్దు పరిణామాలు ఇందుకు కారణమవుతాయని వివరించింది. 2026-27లో దేశీయ విమాన ప్రయాణికుల రద్దీ 6-8% పెరిగి 17.5- 17.9 కోట్ల మందికి చేరొచ్చని వెల్లడించింది. అంతర్జాతీయ విమాన ప్రయాణికుల రద్దీలో బలమైన వృద్ధి ఉండొచ్చని తెలిపింది. లో బేస్ ఎఫెక్ట్ ఇందుకు కలిసి వస్తుందని పేర్కొంది. ఇ-వీసా/ వీసా ఆన్ ఎరైవల్ విస్తృతి పెరగడం, థీమ్ బేస్డ్, ప్రత్యేక పర్యాటక గమ్యస్థానాల అభివృద్ధికి కేంద్రం ప్రాధాన్యం ఇస్తుండటం కూడా తోడ్పడుతుందని వివరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అంతర్జాతీయ విమాన ప్రయాణికుల సంఖ్య 7-9%, వచ్చే ఆర్థిక సంవత్సరంలో 8-10%పెరిగే అవకాశం ఉందని ఇక్రా తెలిపింది. 2025 డిసెంబరు 31 నాటికి దేశీయ విమానయాన సంస్థల వద్ద ఉన్న మొత్తం విమానాల సంఖ్య 865గా ఉంది. 2026 జనవరి 31నాటికి మొత్తంగా 1,700 విమానాల డెలివరీ పెండింగ్‌లో ఉంది. రాబోయే పదేళ్లలో ఈ విమానాలు కంపెనీలకు సరఫరా కావొచ్చు.

# క్రీడలు

## రెండో రోజూ దుమ్మురేపిన జమ్ముకశ్మీర్ బ్యాటర్లు



కర్ణాటకతో రంజీ ట్రోఫీ ఫైనల్‌లో జమ్ముకశ్మీర్ బ్యాటర్లు దుమ్మురేపారు. రెండో రోజు ఆట ముగిసేసరికి జమ్ముకశ్మీర్ ఆరు వికెట్ల నష్టానికి 527 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఒక సెంచరీ, ఐదు అర్ధశతకాలు నమోదు కావడం గమనార్హం. కర్ణాటక బౌలర్లు ఎంత శ్రమించినా ఆలౌట్ చేయలేకపోయారు. ప్రస్తుతం క్రీజ్‌లో సాహిల్ లోత్రా (57★), అబిద్ ముస్తాక్ (20★) ఉన్నారు. వర్షం రావడంతో ఇవాళ గేమ్ ముందుగానే ముగిసింది. ఓవర్‌నైట్ 284/2 స్కోరుతో రెండో రోజు ఆటను ప్రారంభించిన జమ్ముకశ్మీర్‌కు స్వల్ప వ్యవధిలో షాక్ తగిలింది. శుభమ్ పుందిర్ (121), అబ్దుల్ సమద్ (61)ను కర్ణాటక బౌలర్లు త్వరగానే పెవిలియన్‌కు పంపారు. అదొక్కటే కర్ణాటకకు ఈ రోజు గేమ్‌లో ఊరట. తొలి రోజు రిటైర్డ్ హర్ట్‌గా డగౌట్‌కు వెళ్లిన కెప్టెన్ పరాస్ డోగ్రా (70) క్రీజ్‌లోకి వచ్చాడు.

## అతడు.. పవర్‌హౌస్ ఆఫ్ వరల్డ్ క్రికెట్: హ్యారీ బ్రూక్




టీ20 ప్రపంచకప్ 2026లో సెమీఫైనల్‌కు చేరుకున్న తొలి జట్టుగా ఇంగ్లాండ్ నిలిచింది. గ్రూప్-2 నుంచి మరో మ్యాచ్ మిగిలిఉండగానే సెమీస్ బెర్తును ఖాయం చేసుకుంది. పాకిస్థాన్‌పై సెంచరీతో జట్టు విజయంలో ఇంగ్లాండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ కీలక పాత్ర పోషించాడు. అయితే, మాజీ సారథి జోస్ బట్లర్ మరోసారి విఫలమై నిరాశ పరిచాడు. ఇప్పటివరకు ఐదు మ్యాచుల్లో బట్లర్ కేవలం 62 పరుగులు మాత్రమే చేశాడు. అతడి ఫామ్‌పై బ్రూక్ స్పందించాడు. తమకు వన్డే, టీ20 ప్రపంచకప్‌లను అందించిన సారథి బట్లర్ అని బ్రూక్ గుర్తు చేశాడు. ''నేను ఇప్పటికే చాలాసార్లు ఈ విషయంపై మాట్లాడా. బట్లర్ ప్రపంచ క్రికెట్‌కు పవర్‌హౌస్ లాంటోడు. కెరీర్‌లో ఎన్నో అద్భుతాలు సాధించాడు. వన్డే, టీ20 ప్రపంచ కప్‌లను గెలిపించాడు. ఇప్పుడు అతడి టైమ్ కాదంతే. తప్పకుండా బట్లర్ నుంచి గొప్ప ఇన్నింగ్స్ చూడబోతున్నాం. అయితే, అభిమానులకు ఓ విజ్ఞప్తి. ఇంకాస్త సమయం ఇవ్వండి. మరీ ఎక్కువగా స్పందించాల్సిన అవసరం లేదు. ఇప్పటివరకు దాదాపు 500కి పైగా టీ20లు ఆడాడు. ఇంగ్లాండ్ తరఫున 150కి పైగా మ్యాచుల్లో 145+ స్ట్రైక్‌రేట్‌తో పరుగులు రాబట్టాడు. అందుకే, చెబుతున్నా అతడు మా బెస్ట్ ప్లేయర్'' అని బ్రూక్ వెల్లడించాడు.

## సూర్య విషయంలో అలా చేస్తే మూర్ఖత్వమే: మైకెల్ వాన్




టీ20 ప్రపంచ కప్‌లో సూపర్-8 దశ కొనసాగుతోంది. ఇప్పటికే టీమ్ఇండియా తన తొలి సూపర్-8 మ్యాచ్‌లో ఓటమి చవిచూసింది. గురువారం జింబాబ్వేతో తలపడేందుకు చెన్నై వేదికగా తీవ్ర సాధన చేస్తోంది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ అద్భుతమైన ఫామ్‌తో లీగ్ స్టేజ్‌లో పరుగులు రాబట్టాడు. మరోసారి అతడి నుంచి భారీ ఇన్నింగ్స్ రావాలని అభిమానులు కోరుకుంటున్నారు. అయితే, ఈ టీ20 ప్రపంచ కప్ ముగిసిన తర్వాత సూర్యకుమార్‌ను కెప్టెన్సీ నుంచి తప్పిస్తారనే ఊహాగానాలు వస్తున్నాయి. కొత్త సారథ్యం వైపు టీమ్ఇండియా మేనేజ్‌మెంట్ చూస్తోందన్న వ్యాఖ్యలు వినిపించాయి. ఈ క్రమంలో ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ మైకెల్ వాన్ కీలక వ్యాఖ్యలు చేశాడు. సూర్య విషయంలో అలాంటి నిర్ణయం తీసుకోవద్దని సూచించాడు. ''సూర్యకుమార్ యాదవ్ ఓ అద్భుతం. ఇలాంటి జీనియస్ ప్లేయర్‌ను కొనసాగించాలి. టీ20 ప్రపంచ కప్ తర్వాత 'స్కై'ను కాదని మరొక సారథిని తీసుకురావాలనుకోవడం మూర్ఖత్వమే అవుతుంది'' అని అన్నాడు. ''తిలక్ వర్మ స్ట్రైక్‌రేట్‌ను పెంచుకోవాలని చూస్తుంటాడు. అయితే, బ్యాటింగ్ లైనప్‌ను ఓ సారి గమనిస్తే.. విభిన్నమైన కూర్పుతో బరిలోకి దిగుతుంటాం. అందులోనూ నిలకడైన ఆటతీరు ప్రదర్శించడం చాలా ముఖ్యం. కొన్నిసార్లు నిలకడగా ఆడే సమయంలో స్ట్రైక్‌రేట్ మరీ ఎక్కువగా ఉండకపోవచ్చు. కొన్నిసార్లు 130-140 స్ట్రైక్‌రేట్‌తో పరుగులు చేయడం వల్ల పునాది వేయగలుగుతాడు. ఇదంతా బ్యాటింగ్ లైనప్‌నుబట్టి ఆధారపడి ఉంటుంది'' అని పేర్కొన్నాడు. ''ఈ ప్రపంచ కప్పే పాకిస్థాన్ క్రికెటర్ బాబర్ అజామ్‌కు చివరి టీ20 టోర్నీ. బాబర్ అజామ్‌ను నేను పొట్టి ఫార్మాట్ ప్లేయర్ అనుకోవడం లేదు. అతడికి వన్డే ఫార్మాట్ చక్కగా నప్పుతుంది. టెస్టుల్లోనూ స్పెషలిస్ట్‌గా మారొచ్చు'' అని మైకెల్ వాన్ విశ్లేషించాడు.

## న్యూజిలాండ్‌తో మ్యాచ్‌లో బౌలింగ్ ఎంచుకున్న శ్రీలంక



కొలంబో: టీ20 ప్రపంచ కప్ సూపర్-8లో భాగంగా శ్రీలంక, న్యూజిలాండ్ జట్ల మధ్య మ్యాచ్ జరుగుతోంది. సెమీస్ రేసులో నిలవాలంటే ఇరు జట్లకూ ఇందులో విజయం సాధించడం అత్యంత ముఖ్యం. టాస్ నెగ్గిన శ్రీలంక కెప్టెన్ దాసున్ శనక బౌలింగ్ ఎంచుకున్నాడు. తుది జట్టులో ఒక్కో మార్పుతో శ్రీలంక, కివీస్ జట్లు బరిలోకి దిగాయి. శ్రీలంక జట్టులోకి మిషారా స్థానంలో అసలంక వచ్చాడు. కివీస్ ఆల్‌రౌండర్ జేమ్స్ నీషమ్‌కు బదులు కోలె మెక్‌కాంచీకి 'ఫైనల్ XI'లో స్థానం దక్కింది. శ్రీలంక: పాథున్ నిశాంక, కుశాల్ మెండిస్ (వికెట్ కీపర్), చరిత్ అసలంక, పవన్ రత్నాయకె, కమిందు మెండిస్, దాసున్ శనక (కెప్టెన్), దునిత్ వెల్లాలగె, దుషాన్ హేమంత, దుష్మంత చమీర, మహీశ్ తీక్షణ, దిల్షాన్ మదుషంక టిమ్ సీఫెర్ట్ (వికెట్ కీపర్), ఫిన్ అలెన్, రచిన్ రవీంద్ర, గ్లెన్ ఫిలిప్స్, మార్క్ చాప్‌మన్, డారిల్ మిచెల్, మిచెల్ సాంట్నర్ (కెప్టెన్), కోలె మెక్‌కాంచీ, మాట్ హెన్రీ, ఐష్ సోధి, లాకీ ఫెర్గూసన్.

## సాంట్నర్-కోలే కీలక భాగస్వామ్యం..

టీ20 ప్రపంచ కప్ సూపర్-8 మ్యాచ్‌లో శ్రీలంకకు న్యూజిలాండ్ 169 పరుగులను లక్ష్యంగా నిర్దేశించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కివీస్ 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. కెప్టెన్ మిచెల్ సాంట్నర్ (47) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. శ్రీలంక బౌలర్లలో మహీశ్ తీక్షణ 3, దుష్మంత చమీర 3, వెల్లాలగె ఒక వికెట్ తీశారు. ఓ దశలో శ్రీలంక బౌలర్ల దెబ్బకు కివీస్ బ్యాటర్లు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. కివీస్ ఇన్నింగ్స్ కాస్త దూకుడుగానే ప్రారంభమైంది. ఫిన్ అలెన్ (23), టిమ్ సీఫెర్ట్ (8) దెబ్బకు మూడు ఓవర్లలోనే 30 పరుగులు చేసింది. స్వల్ప వ్యవధిలో ఓపెనర్లను కోల్పోయిన జట్టును గ్లెన్ ఫిలిప్స్(18), రచిన్ రవీంద్ర (32) కాపాడారు. అయితే, వారిద్దరితోపాటు డారిల్ మిచెల్ (3), మార్ చాప్‌మన్ (0) ఔటయ్యారు. దీంతో కివీస్ స్కోరు వంద దాటడం కూడా కష్టమేనని అనిపించింది. కానీ, కోలె మెక్‌కాంచి (31★)తో కలిసి కెప్టెన్ సాంట్నర్ మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. వీరిద్దరూ ఏడో వికెట్‌కు 47 బంతుల్లోనే 84 పరుగులు జోడించారు. దీంతో శ్రీలంక ముంగిట కివీస్ గౌరవప్రదమైన లక్ష్యాన్ని ఉంచగలిగింది.




## అదే టీమ్ఇండియా తక్షణ కర్తవ్యం: రవిశాస్త్రి

పొట్టి ప్రపంచకప్‌లో గ్రూప్‌స్టేజీలో భారత్ నాలుగుకు నాలుగు మ్యాచుల్లోను గెలిచి సత్తా చాటిన విషయం తెలిసిందే. అయితే.. సూపర్-8లో మాత్రం దక్షిణాఫ్రికా చేతిలో 76 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. దీంతో సెమీస్ అవకాశాలు కాస్త సంక్లిష్టంగా మారాయి. ఈ నేపథ్యంలో టీమ్ఇండియా (Team India) మాజీ కోచ్ రవిశాస్త్రి (Ravi Shastri) భారత్‌కు కొన్ని సూచనలు చేశాడు. దక్షిణాఫ్రికాతో ఓటమి ఓ రకంగా మేలుకొలుపు అని అన్నాడు. వెంటనే జట్టు కూర్పులో మార్పులు చేయాలని సూచించాడు. మీరు టీ20 వరల్డ్ కప్‌లో వరుసగా 12 మ్యాచ్‌లు గెలిచారు. (గత పొట్టి ప్రపంచకప్ విజయాలతో కలిపి) దక్షిణాఫ్రికాతో ఓటమి పాలయ్యారు. ఇది ఓ మేలుకొలుపు. జట్టు కూర్పులో మార్పులు, చేర్పులు చేసేందుకు సమయం ఆసన్నమైంది. జట్టు ప్రణాళికల గురించి కూడా పునరాలోచన చేయాలి. భారత్ ఇకపై తేలికగా



తీసుకోదు. ఎందుకంటే టీమ్ఇండియా మరో మ్యాచ్ ఓడిపోతే తీవ్రమైన ఒత్తిడికి గురికావాల్సి వస్తుంది' అని రవిశాస్త్రి అన్నాడు. జింబాబ్వే మ్యాచ్ నేపథ్యంలో టీమ్ఇండియాకు అతడు పలు సూచనలూ చేశాడు. 'అక్షర్ పటేల్‌ను (Axar Patel) తిరిగి తుదిజట్టులోకి తీసుకోవాలి. అతడి అనుభవం టీమ్‌కు చాలా అవసరం. వాషింగ్టన్ సుందర్‌ను (Washington Sundar) కూడా ఈ మ్యాచ్‌లో ఆడించాలి. జట్టులో అదనపు స్పిన్నర్ ఉంటే మంచిదే. అక్షర్ పటేల్‌ను ఆడిస్తే.. అతడు నం.8లో బ్యాటింగ్ చేయాలి. అయిదో స్థానంలో హార్దిక్ పాండ్య (Hardik Pandya), నం.6లో శివమ్ దూబె, ఏడో స్థానంలో వాషింగ్టన్ సుందర్ బ్యాటింగ్‌కు రావాలి' అని రవిశాస్త్రి సూచించాడు. చెన్నైలోని చిదరంబరం స్టేడియం వేదికగా టీమ్ఇండియా, జింబాబ్వేకు మ్యాచ్ జరగనుంది. అలాగే మార్చి 1న కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా భారత్, వెస్టిండీస్ జట్లు తలపడనున్నాయి. సెమీస్‌కు అర్హత సాధించాలంటే.. ఈ రెండు మ్యాచుల్లోనే విజయం సాధించడం టీమ్ఇండియాకు చాలా కీలకం.

# వుదయం సినిమా




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రతిష్టాత్మక పాన్ఇండియా ప్రాజెక్ట్ 'పెద్ది' సినిమా వేసవిలో గ్రాండ్ గా విడుదల కానున్న నేపథ్యంలో బజ్ నెక్స్ట్ లెవల్ కి చేసుకుంది. బుచ్చి బాబు సానా దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. ఇది భారీ హాలిడే సీజన్ షోడౌన్ కు వేదికగా నిలుస్తోంది. వృద్ధి సినిమాస్ బ్యానర్ పై వెంకట సతీష్ కిలారు నిర్మించిన పెద్దిలో జాన్వీ కపూర్ కథానాయికగా నటించింది. ఈ సినిమా ప్రమోషన్స్ లో ఇప్పటికే సంచలనం సృష్టించింది. ఆస్కార్ అవార్డు గ్రహీత సంగీత దర్శకుడు ఎ.ఆర్. రెహమాన్ స్వరపరిచిన ఫస్ట్ షాట్ గ్లింప్స్, బ్లాక్ బస్టర్ ఫస్ట్ సింగిల్ చికిరి చికిరి కి ట్రెమండస్ రెస్పాన్స్ తో రికార్డులను బద్దలు కొట్టాయి. ఎక్సయిట్మెంట్ ని మరింతగా పెంచుతూ మార్చి 2న రెండవ సింగిల్ 'రై రై రా రా' విడుదలతో బజ్ నెక్స్ట్ లెవల్ కి వెళ్ళబోతోంది. సాంగ్ పోస్టర్‌లో రామ్ చరణ్ మ్యాసీ అవతార్ లో కనిపిస్తున్నారు. రగ్గడ్ దుస్తులు, చిరిగిన జుట్టు, గడ్డం, భుజంపై పెద్ద సుత్తిని వేలాడదీసుకుని, మెరిసే చిరునవ్వుతో కనిపిస్తున్నారు, బ్యాక్ డ్రాప్ లో గందరగోళం చెలరేగుతున్నప్పటికీ, ప్రజలు అతని చుట్టూ పరిగెత్తుతున్నారు. ఎ.ఆర్ రెహమాన్ పవర్ ఫుల్ సంగీతం ఇప్పటికే సంచలనం సృష్టించింది. పెద్ది ఈ సంవత్సరం అత్యంత ఎదురుచూస్తున్న మాస్ స్పెక్టకిల్‌లలో ఒకటిగా రాబోతోంది. ఈ చిత్రంలో శివ రాజ్ కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ, బొమన్ ఇరానీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి ఆస్కార్‌విజేత స్వరకర్త ఎ.ఆర్ రెహమాన్ సంగీతాన్ని అందిస్తున్నారు. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ ఆర్ రత్నవేలు డీవోపీ, జాతీయ అవార్డు గెలుచుకున్న ఎడిటర్ నవీన్ నూలి ఎడిటర్, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్.

**సాంకేతిక సిబ్బంది:**
**రచన, దర్శకత్వం: బుచ్చిబాబు సాన సమర్పకులు: మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్: వృద్ధి సినిమాస్ నిర్మాత: వెంకట సతీష్ కిలారు సహ నిర్మాత: ఇషాన్ సక్సేనా సంగీతం: ఏఆర్ రెహమాన్ DOP: ఆర్ రత్నవేలు ప్రొడక్షన్ డిజైన్: అవినాష్ కొల్లా ఎడిటర్: నవీన్ నూలి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వి.వై.ప్రవీణ్ కుమార్మార్కెటింగ్: ఫస్ట్ షో PRO: వంశీ-శేఖర్**



## నిజాయితీ గల శ్రీ చిదంబరం గారు

వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ట జంటగా నటించిన బ్లాక్ బ్లాక్ బస్టర్ చిత్రం 'శ్రీ చిదంబరం గారు'. ఈ చిత్రం ద్వారా వినయ్ రత్నం దర్శకుడిగా పరిచయమయ్యారు. చింతా వినీష రెడ్డి, చింతా గోపాల కృష్ణా రెడ్డి నిర్మాతలుగా చింతా రాజశేఖర్ రెడ్డి సహ నిర్మాతగా రూపొందిన ఈ చిత్రం థియేటర్స్ లో అద్భుతమైన విజయాన్ని అందుకుంది. ఈ చిత్రం ఫిబ్రవరి 26 నుంచి ఈవిన్ ఓటీటీలో ప్రసారం కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీ స్ట్రీమింగ్ సెలబ్రేషన్స్ గ్రాండ్ గా నిర్వహించారు.

ప్రీ స్ట్రీమింగ్ సెలబ్రేషన్స్ ప్రెస్ మీట్ లో డైరెక్టర్ నందిని రెడ్డి మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. డైరెక్టర్ వినయ్ ని ఇప్పుడే కలుస్తున్నాను. కానీ తన ఇంటర్వ్యూ ఒకటి చూశాను. నా జర్నీ నేను గుర్తుకొచ్చింది. 25 ఏళ్ల ఒక అబ్బాయికి ఇంత పాషన్ తో సినిమా తీయడం మామూలు విషయం కాదు. ఖచ్చితంగా తను భవిష్యత్తులో చాలా గొప్ప కథలు చెబుతాడు. ఈటీవీ విన్ కారణంగా చాలా కొత్త కంటెంట్, కొత్త ఫిలిం మేకర్స్ ఇండస్ట్రీకి వస్తున్నారు. డైరెక్టర్ వినయ్ వాయిస్ లో నిజాయితీ ఉంది. ఈ సినిమాలో నిజాయితీ ఉంది. ఈ సినిమా మీ అందరికీ కనెక్ట్ అవుతుంది. తెలుగు చిత్ర పరిశ్రమ చిరకాలం ఉంటుంది. ఇంత మంచి సినిమాలను ప్రేమించే మన ఆడియన్స్ కోసం ఈటీవీ ఇలాంటి మంచి కథలు చెబుతున్నారు. 45 రూపాయలకి సబ్స్క్రిప్షన్ తీసుకోండి. చాలా హార్ట్ ఫుల్ గా చెప్పిన కథ ఇది. ఈ సినిమా చూశాక కచ్చితంగా చాలామంది ఫిలిం మేకర్స్ ఇన్స్పైర్ అవుతారు. ఈటీవీలో ఈ సినిమా చాలా పెద్ద హిట్ అవుతుంది.



## నా భర్త విజయ్ దేవరకొండ

**విజయ్ దేవరకొండ, రష్మిక మూడు ముళ్ల బంధంతో ఒక్కటయ్యారు. గురువారం ఉదయం 10.10కి రష్మిక మెడలో విజయ్ మూడు ముళ్లు వేశారు. ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలను రష్మిక అభిమానులతో పంచుకుంటూ 'హాయ్ మై లవ్స్.. నా భర్తను మీకు పరిచయం చేస్తున్నా మిస్టర్ విజయ్ దేవరకొండ ' అని పేర్కొన్నారు.**



## అనిల్ రావిపూడి నెక్స్ట్ మూవీ అనౌన్స్ మెంట్







బ్లాక్ బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి తన మచ్ ఎవైటెడ్ నెక్స్ట్ మూవీ అనౌన్స్ మెంట్ తో మరోసారి అందరిలో ఆసక్తిని పెంచారు. వరుసగా తొమ్మిది బాక్సాఫీస్ విజయాలతో అదరగొట్టిన అనిల్ రావిపూడి.. ఈ సంక్రాంతికి వచ్చిన 'మన శంకరవరప్రసాద్ గారు'తో ఆల్ టైమ్ రీజినల్ ఇండస్ట్రీ హిట్ అందిస్తూ బిగ్గెస్ట్ సక్సెస్ ని నమోదు చేశారు. ఇప్పుడు ఆయన కొత్త ప్రాజెక్ట్ లో విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ హీరోలుగా నటించనున్నారు.

F2, F3, సంక్రాంతికి వస్తున్నం వంటి బ్లాక్‌బస్టర్ ఎంటర్‌టైనర్‌ల తర్వాత ఇది అనిల్ రావిపూడి వెంకటేష్‌తో కలిసి చేస్తున్న ఐదవ చిత్రం కావడం విశేషం. ఇటీవలే MSGలో అతిథి పాత్రలో అదరగొట్టారు వెంకటేష్. అలాగే సంచలనాత్మక బ్లాక్‌బస్టర్ పటాస్ తర్వాత కళ్యాణ్ రామ్‌తో ఇది అనిల్ రావిపూడి రెండవ చిత్రం.

దర్శకుడు అనిల్ రావిపూడి దగ్గుబాటి, నందమూరి కుటుంబాల నుంచి వచ్చిన స్టార్స్ ని కలిపి ఈ కొత్త చిత్రాన్ని ఒక క్లీన్, టిపికల్ అనిల్ ఎంటర్‌టైనర్‌గా అందరికీ కనెక్ట్ అయ్యే కథాంశంతో రూపొందిస్తున్నారు. ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులతో కనెక్ట్ అయ్యే కంప్లీట్ ఎంటర్టైనర్ గా ఉండబోతుంది. అనిల్ రావిపూడి ట్రేడ్‌మార్క్ స్టయిల్, హ్యూమర్, ఎమోషన్స్, ఎంటర్టైమెంట్ తో సంక్రాంతికి ఫెస్టివ్ ట్రీట్‌గా నిలవనుంది. ఈ చిత్రం ప్రస్తుతం ప్రీ‌ప్రొడక్షన్ దశలో ఉంది, ప్రాజెక్ట్ చుట్టూ ఉన్న భారీ అంచనాలను తగ్గట్టుగా దర్శకుడు స్క్రిప్ట్‌ను జాగ్రత్తగా మెరుగుపరుస్తున్నాడు. సాంకేతిక బృందం గురించి వివరాలు, ఇతర నటీనటుల వివరాలు త్వరలో తెలియజేస్తారు. ఇద్దరు స్టార్ హీరోలు, వరుస విజయాలతో దూసుకుపోతున్న దర్శకుడు కలిసే ఈ సినిమా ఇప్పటికే టాలీవుడ్‌లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రాజెక్ట్‌లలో ఒకటిగా నిలుస్తోంది.

ఈ చిత్రం 2027 సంక్రాంతికి విడుదల కానుంది. అనిల్ రావిపూడి, సంక్రాంతి మధ్య ఉన్న ప్రత్యేక అనుబంధాన్ని మరోసారి గుర్తు చేస్తోంది. ప్రతి సంవత్సరం పండుగకు ఆయన సినిమాలు ప్రేక్షకులకు గ్రాండ్ ఎంటర్టైన్‌మెంట్ అందిస్తున్నాయి. సంక్రాంతి వినోదాలకు అనిల్ రావిపూడి చిరునామా అనే భావనను ఇది మరింత బలపరుస్తోంది.

## విష్ణు విన్యాసం

### ఫ్యామిలీ అంతా ఎంజాయ్ చేస్తారు



కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీ విష్ణు హిలేరియస్ జాయ్‌రైడ్ 'విష్ణు విన్యాసం'తో అలరించబోతున్నారు. యదునాథ్ మారుతీ రావు దర్శకత్వంలో, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుమంత్ నాయుడు జి నిర్మించిన ఈ చిత్రంలో శ్రీ విష్ణు సరసన నయన్ సారిక హీరోయిన్ గా నటిస్తోంది. ఇపటికే ప్రమోషనల్ కంటెంట్ హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. ఫిబ్రవరి 27న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా హీరో శ్రీ విష్ణు విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**మీరు గ్రహాలని, జాతకాలని నమ్ముతారా?**
అన్ని ఫాలో అవ్వను, కానీ మనం చిన్నప్పటి నుంచి అందరితోపాటు అలవాటు చేసుకున్న కొన్నిటిని ఫాలో అవుతాను. పర్సనల్ గా నాకైతే ఫలానా టైము ఫలానా నెంబర్లు అనే నమ్మకాలు లేవు.

**విష్ణు విన్యాసం ప్రాజెక్టు ఎలా మొదలైంది?**
డైరెక్టర్ మారుతి కథ చెప్పారు. నాకు చాలా నచ్చింది. అందరూ రిలేట్ అయ్యే కథ, చాలా మంచి క్యారెక్టర్. ఫ్యామిలీతో కలిసి హ్యాపీగా నవ్వుకోవచ్చు. కథ విన్న వెంటనే మొదలుపెట్టాం.

**ఇందులో హీరోయిన్ క్యారెక్టర్ చాలా డామినేటింగ్ గా ఉంది కదా?**
ఆ క్యారెక్టరైజేషన్ ని ప్రేక్షకులు చాలా బాగా ఎంజాయ్ చేస్తారు. హీరోయిన్ డామినేషన్ సినిమాలో నా క్యారెక్టర్ కి ప్రాబ్లం అవుతూ ఉంటుంది. ఆడియన్స్ మాత్రం చాలా బాగా కనెక్ట్ అవుతారు. అందునుంచి చాలా మంచి ఫన్ జనరేట్ అవుతుంది. ఇందులో హీరోయిన్ క్యారెక్టర్ కాస్త అనుమానస్పదంగా ఉంటుంది. నయన్ సారిక రెండు మూడు పేజీలు సీన్ కూడా సింగిల్ టేక్ లో చేసింది. తన పెర్ఫార్మన్స్ ఈ సినిమాలో చాలా ప్రత్యేకంగా ఉంటుంది. ఆడియన్స్ చాలా బాగా కనెక్ట్ అవుతారు. ఫస్ట్ హాఫ్ యూత్ కి సెకండ్ హాఫ్ యూత్ తో పాటు ఫ్యామిలీ కూడా కనెక్ట్ అవుతుంది. సెకండ్ హాఫ్ లో వచ్చే ఫ్యామిలీ కామెడీ ప్రేక్షకులు చాలా ఎంజాయ్ చేస్తారు.

**ఇందులో మీ క్యారెక్టర్ ఎలాంటి ఎక్సైట్మెంట్ ని క్రియేట్ చేసింది?**
ఇలాంటి క్యారెక్టర్ చేయడం నాకు కొత్త. ఈ క్యారెక్టర్ కి కొన్ని రూల్స్ ఉంటాయి. చాలా నమ్మకాలు ని ఫాలో అవుతుంటాడు. చాలా ఇంట్రెస్టింగ్ గా ఉంటుంది. డైరెక్టర్ మారుతి సినిమాని చాలా బాగా హ్యాండిల్ చేశాడు. చాలా క్లారిటీ ఉన్న డైరెక్టర్. ఎడిటింగ్ మీద కూడా చాలా మంచి గ్రిప్ ఉంది. అలాగే సినిమాలో మంచి అనుభవం ఉన్న టెక్నీషియన్స్ పనిచేయడం కూడా ప్లస్సు అయ్యింది.

**మ్యూజిక్ గురించి?**
రథన్ చాలా మంచి మ్యూజిక్ ఇచ్చారు. అన్ని కూడా కథ నుంచి వచ్చిన పాటలే. నాలుగు పాటల్లో కూడా మంచి ఫన్ ఉంటుంది.మేము షూటింగ్ కి వెళ్ళకముందే పాటలన్నీ చేయించుకున్నాం. మా వరకు తను అనుకున్న సమయం లోనే పాటలన్నీ ఇచ్చేశారు. తను అందుబాటులో లేకపోవడం వల్ల నేపథ్య సంగీతం సురేష్ బొబ్బిలి గారితో చేయించాం. అది కూడా అద్భుతంగా వచ్చింది

**మీ మార్క్ డైలాగ్స్ ఇందులో ఉంటాయా**
అన్నీ ఉంటాయి. కథ, క్యారెక్టర్ చాలా ఇంట్రెస్టింగ్ గా సరదాగా అనిపిస్తాయి. ఇందులో ఇంకొంచెం డిఫరెంట్ టైమింగ్ చూస్తారు. ఇందులో లెక్చరర్ గా కనిపిస్తాను. అక్కడ కూడా తను నెంబర్లను ఫాలో అవుతాడు. ఇందులో వీరి వీరి గుమ్మడి పండు అనే ఒక సీక్వెన్స్ ఉంది. ఆ ఎపిసోడ్ కి థియేటర్ మొత్తం నవ్వులతో బ్లాస్ట్ అవుతుంది. అలాగే ఇంటర్వెల్లో ఎవరు ఊహించనంత ఎంటర్టైనింగ్ గా ఉంటుంది. ఇందులో మంచి సిచువేషన్ కామెడీ ఉంటుంది.

**బ్యాక్ టు బ్యాక్ ఓటిటి డిల్స్ ఫినిష్ కావడం ఎలా అనిపిస్తుంది?**
ఈ రెండు సినిమాలే కాదండి..మరో మూడు సినిమాల డీల్స్ కూడా కంప్లీట్ అయ్యాయి. రిలీజ్ కి ముందే ప్రొడ్యూసర్స్ హ్యాపీగా ఉండడం చాలా ఆనందాన్నిస్తుంది. మన బడ్జెట్ బ్రాకెట్లో జాగ్రత్తగా సినిమా చేసుకోవడానికి కూడా ఒక మంచి అవకాశం. నేనెప్పుడూ కూడా ప్రొడ్యూసర్స్ పెట్టే డబ్బులు వెనక్కి వస్తే చాలు అనే ఆలోచనతోనే ఉంటాను. ఇప్పుడు అలా అన్ని సినిమాలు జరగడం హ్యాపీగా ఉంది.

**ఇందులో సత్యతో మీ కామెడీ ఎలా ఉండిపోతుంది?**
సత్యతో ఇంతకుముందు చేశాను. ఇందులో తను నాకు కో లెక్చరర్ గా కనిపిస్తాడు. చాలా సరదాగా ఉంటుంది.

**ఈ సినిమా ఆడియన్స్ కి ఎలాంటి ఎక్స్పిరియన్స్ ఇస్తుంది?**
ఒక రెండు గంటలపాటు హాయిగా నవ్వుకోవచ్చు. మంచి ఎంటర్టైనర్. ఫ్యామిలీతో కలిసి హ్యాపీగా చూడొచ్చు. ఈ వీకెండ్ కి హ్యాపీ గా టైం పాస్ చేసి రావచ్చు.

## హేబల్‌వంత్ బ్రేక్ ఈవెన్ సాధించింది: నిర్మాత

ప్రామిసింగ్ కథానాయకుడు సుహాస్, శివానీ నాగారం జంటగా రూపొందిన హిలేరియస్ ఎంటర్‌టైనర్ 'హే బల్‌వంత్'. గోపీ అచ్చర దర్శకత్వంలో త్రిశుల్ విజనరీ స్టూడియోస్ పతాకంపై బి.నరేంద్ర రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. బన్నీవాస్, వంశీ నందిపాటిల సక్సెస్‌ఫుల్ ద్వయం నందిపాటి ఎంటర్ టైన్‌మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్ పై ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ఈ శుక్రవారం ఈనెల 20న ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రం హిలేరియస్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల అభినందనలతో పాటు, విమర్శకుల ప్రశంసలు అందుకుంటూ బ్లాక్‌బస్టర్ టాక్‌తో దూసుకపోతుంది.ఈ నేపథ్యంలో చిత్ర బృందం తొలిసారిగా, వినూత్నంగా థాంక్యూ మీట్ ఫర్ బ్రేక్ ఈవెన్ డన్ ఈవెంట్‌ను నిర్వహించింది. నిర్మాత బి.నరేంద్ర రెడ్డి మాట్లాడుతూ ''మా బ్యానర్‌లో వచ్చిన తొలి సక్సెస్ ఇది. చూసిన ప్రతి ఒక్కరూ ఎంతో సంతృప్తి చెందారు. ఓ మంచి సినిమా తీశానని అభినందించారు. కొన్ని థియేటర్స్‌కి వెళ్లి నేను ఆడియన్స్ మధ్యలో సినిమా చూశాను. సినిమాను అందరూ ఎంతగానో ఎంజాయ్ చేస్తున్నారు. నాకు ఇది ఎంతో సంతృప్తి నిచ్చింది. ఓ మంచి సినిమా తీశాననే భావన కలిగింది. తప్పకుండా సినిమా చూడని వాళ్లు అందరూ ఈ సినిమా చూడాలని కోరుకుంటున్నాను' అన్నారు. దర్శకుడు గోపీ అచ్చెర మాట్లాడుతూ '' ఈ మూవీ చూసిన అందరూ ప్రశంసలు కురిపిస్తుంటే ఆనందంగా ఉంది. ముఖ్యంగా యూఎస్‌లో ఆడియన్స్ కు కూడా ఈ సినిమా నచ్చింది. ఈ సక్సెస్‌కు కారణమైన అందరికి నా కృతజ్ఞతలు' అన్నారు.



## సన్ ఆఫ్ ప్రీ రిలీజ్



సాయి సింహాద్రి సైన్మా బ్యానర్ మీద సాయి సింహాద్రి హీరోగా, నిర్మాతగా చేసిన చిత్రం 'సన్ ఆఫ్'. ఈ మూవీని బత్తుల సతీష్ తెరకెక్కించారు. ఈ సినిమాని ఫిబ్రవరి 27న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో బుధవారం నాడు ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిర్మాత, నటుడు అశోక్ కుమార్, రామ సత్య నారాయణ రాజు, లైన్ వెంకట్, కన్నా రవి, రామకృష్ణ గౌడ్ తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. నిర్మాత, హీరో సాయి సింహాద్రి మాట్లాడుతూ .. 'సతీష్‌గారు 'సన్ ఆఫ్' కథను నాకు చెప్పినప్పుడు షాక్ అయ్యాను. ఆయన చెప్పిన కథను విన్న తరువాత నా జీవితంలో జరిగినట్టుగానే ఉంది కదా అని అనిపించింది. యదార్థ ఘటనలతో ఈ మూవీని తెరకెక్కించారని కూడా చెప్పుకోవచ్చు. నాన్న మనకు క్రమ శిక్షణ, చదువు, సమయ పాలన వంటివి ఇస్తారు. డబ్బుని కాకుండా కష్టపడే తత్వాన్ని వారసత్వంగా ఇవ్వాలి. శోభా రాణి గారి వల్లే ఈ సినిమా ఈ స్థాయికి వచ్చింది. నేను ఐదు థియేటర్లు అడిగితే శోభమ్మ నాకు 300 థియేటర్లు ఇచ్చారు. ఫిబ్రవరి 27న మా సినిమా రాబోతోంది. తండ్రీకొడుకులు, ఫ్యామిలీ అంతా కలిసి చూడాల్సిన చిత్రమిది. అందరికీ తప్పకుండా నచ్చుతుంది' అని అన్నారు.

## ది ప్యారడైజ్ ఆయా షేర్ సాంగ్



నేచురల్ స్టార్ నాని మోస్ట్ ఎవైటెడ్ ప్రాజెక్ట్ ది పారడైస్ ఫస్ట్ సింగిల్ ఆయా షేర్ వరల్డ్ వైడ్ సంచలనం సృష్టించింది. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రానికి రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు. విడుదలైన కొద్దిసేపటికే ఆయా షేర్ ప్రపంచవ్యాప్తంగా ట్రెండ్ అవుతూ భారీ రెస్పాన్స్ అందుకుంది.

ఈ పాట యూట్యూబ్ గ్లోబల్ చార్ట్‌స్‌లో 9 దేశాల్లో ట్రెండింగ్‌లో నిలిచింది. భారత్, యూఏఈలో నంబర్ 1 స్థానాన్ని దక్కించుకోగా, యూకే, ఆస్ట్రేలియా, సింగపూర్, కెనడా, సౌదీ అరేబియా, అమెరికా, న్యూజిలాండ్ వంటి దేశాల్లో కూడా అద్భుతమైన ర్యాంకులు సాధించింది. ఒక తెలుగు పాటకు ఈ స్థాయి అంతర్జాతీయ ఆదరణ రావడం విశేషం.ఈ సాంగ్ లో రా ఎనర్జీ, నాని స్క్రీన్ ప్రెజెన్స్ అదిరిపోయింది. ఆయన చేసిన ఐకానిక్ హుక్ స్టెప్ ప్రేక్షకులను అద్భుతంగా ఆకట్టుకుంది. ఫ్లోర్ మూవ్ ఇప్పుడు ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, యూట్యూబ్ షార్ట్‌లలో ట్రెండ్ అవుతూ ప్రపంచవ్యాప్తంగా అభిమానులను అలరిస్తోంది.

ఆయా షేర్ విజయంతో ది పారడైస్ సినిమా ప్రమోషన్స్ ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సాంగ్ ఇప్పటికే దేశాల్ని దాటి అలరించడంతో ది ప్యారడైజ్ పై అంచనాలు నెక్స్ట్ లెవల్ కి చేరుకున్నాయి.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at LAKSHYAM TELUGU DAILY, D. No.1227/1, 11 GPR Flats, Pedakakani Village and Mandal, Guntur, Andhra Pradesh - 522509 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : Sirikonda Augustin, RNI No. APTEL/2014/57702. E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.